సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 345

సోమవారం 28-8-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'




ఆ ఇద్దరి మధ్యే పోటీ!

టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ నేడు న్యూయార్క్‌లో ప్రారంభమవుతుంది. పురుషుల సింగిల్స్‌లో ఫేవరెట్స్‌గా జొకోవిచ్, డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ బరిలోకి దిగనున్నారు.

- వివరాలు 12లో





చంద్రుడిపై వేగంగా మార్పులు

చంద్రుడిపై ఉష్ణోగ్రతలు చాలా వేగంగా మారుతున్నట్లు విక్రమ్ ల్యాండర్‌లో అమర్చిన పేలోడ్ ద్వారా వెల్లడైందని ఇస్రో తెలిపింది.

వివరాలు 6లో ▸



బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

పశ్చిమబెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఉన్న ఓ బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి 8 మంది చనిపోయారు.

వివరాలు 6లో ▸



అమెరికాలో కాల్పులు

అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో ఓ యువకుడి కాల్పుల్లో ముగ్గురు నల్ల జాతీయులు ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



కోటాలో భవనాలకు వలలు

రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యల నివారణ కోసం హాస్టల్ భవనాలకు వలలు బిగించాలని అధికారులు ఆదేశించారు.

వివరాలు 6లో ▸

ఏపీ బీమా..ది బెస్ట్

వైఎస్సార్ ఉచిత పంటల బీమాకు జాతీయ స్థాయిలో ప్రశంసలు

మేమూ అనుసరిస్తామంటున్న పలు రాష్ట్రాలు

- ముందుకొచ్చిన మహారాష్ట్ర, ఒడిశా, పుదుచ్చేరి, మేఘాలయ
- 2023–24 సీజన్ నుంచి రూపాయికే పంటల బీమా కవరేజ్
- యూనివర్సల్ కవరేజ్ కల్పించడంలో ఏపీ ఆదర్శం
- అదే బాటలో మిగిలిన రాష్ట్రాలూ వెళ్లాలని కేంద్రం సూచన
- ఈ–క్రాప్ ప్రామాణికంగా ఉచిత పంటల బీమా పథకం అమలు
- ఏపీని చూసే పీఎంఎఫ్‌బీవైలో మార్పులు చేశామన్న కేంద్రం
- రుషికేశ్‌లో పీఎంఎఫ్‌బీవై సెమినార్‌లో అభినందనలు



ఈ-క్రాప్‌లో రైతుల పంట వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం దేశానికే ఆదర్శంగా నిలిచింది. రైతులపై పైసా భారం పడకుండా నోటిఫై చేసిన పంటలకు సంబంధించి సాగు చేసిన ప్రతి ఎకరాకు ఈ క్రాప్ ఆధారంగా యూనివర్సల్ బీమా కవరేజ్ కల్పించడంపై పలు రాష్ట్రాలు ప్రశంసిస్తున్నాయి. ఈ పథకాన్ని తమ రాష్ట్రాల్లోనూ అమలు చేస్తామని మహారాష్ట్ర, ఒడిశా, పుదుచ్చేరి, మేఘాలయ ముందుకొచ్చాయి. 2023-24 వ్యవసాయ సీజన్ నుంచి కేవలం రూపాయి ప్రీమియంతో తమ రాష్ట్రాల్లోనూ అమలు చేస్తున్నట్టు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలుపై ఉత్తరాఖండ్‌లోని రిషికేష్‌లో శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు జరిగిన 10వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఈ రాష్ట్రాలు అధికారికంగా ప్రకటించాయి. ఈ ఏడాది నుంచి రైతుల నుంచి రూపాయి మాత్రమే వసూలు చేస్తామని, మిగిలిన మొత్తాన్ని తమ ప్రభుత్వాలు భరిస్తాయని ఆ రాష్ట్రాల ప్రతినిధులు చెప్పారు. సెమినార్‌లో పాల్గొన్న మరికొన్ని రాష్ట్రాలు కూడా

మిగతా 2వ పేజీలో ▸

ఫ్యాక్ట్ చెక్

దగాకోరు.. దబాయింపు!

- వాస్తవాలను వక్రీకరిస్తూ.. పొంతన లేని పోలికలతో రామోజీ కాకి లెక్కలు
- దిగుబడిలో 60 శాతానికిపైగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సొంత అవసరాలుపోనూ మిగతాది బయట మంచి ధరకు విక్రయిస్తున్న రైతులు
- ఎక్కడ అమ్ముకుంటేనేం?.. అన్నదాతకు మంచి జరుగుతుంటే సంతోషించాలి కదా?
- ఏపీలో ఎక్కువగా బీపీటీ, నెల్లూరు, స్వర్ణ సాగు.. వీటికి మార్కెట్‌లో మంచి గిరాకీ
- తెలంగాణలో ఎంటీయూ 1010, 1001 సాగు.. మార్కెట్ లేక ప్రభుత్వానికి విక్రయం
- టీడీపీ హయాంలో 17.94 లక్షల మంది నుంచి 2.65 కోట్ల టన్నుల ధాన్యం కొనుగోలు
- ఇప్పుడు నాలుగేళ్లలోనే 32.78 లక్షల మంది రైతుల నుంచి 3.10 కోట్ల టన్నుల ధాన్యం సేకరణ
- నాడు ధాన్యం సేకరణకు రూ.40,237 కోట్లు.. నేడు రూ.58,766 కోట్లు వ్యయం

2 లో

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ట్రోఫీతో రాయలసీమ కింగ్స్ జట్టు



ఏపీఎల్ సీజన్-2 చాంపియన్స్

రాయలసీమ కింగ్స్

విశాఖలో జరిగిన ఫైనల్లో కోస్టల్ రైడర్స్‌పై విజయం

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టీ20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌లో రాయలసీమ కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం విశాఖపట్నంలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఫైనల్లో హనుమ విహారి సారథ్యంలోని రాయలసీమ కింగ్స్ జట్టు ఐదు వికెట్ల తేడాతో కోస్టల్ రైడర్స్‌ను ఓడించింది. బోధల కుమార్(53 పరుగులు), విహారి(46 పరుగులు) రాణించారు.

12 లో

ఏపీఎల్ నిర్వహణ భేష్



- యువ క్రికెటర్లకు ఆంధ్ర ప్రీమియర్ లీగ్ మంచి వేదిక
- ఇక్కడ ప్రతిభ ఉన్న క్రికెటర్లకు కొదువ లేదు
- ఏపీ నుంచి మరింత మంది దేశానికి ప్రాతినిధ్యం వహించాలి
- ఏసీఏ పనితీరు అద్భుతం.. ఇలాగే క్రికెటర్లను ప్రోత్సహించండి
- విశాఖ చాలా అందమైన నగరం.. ఇది నాకెంతో ఇష్టమైన ప్రదేశం
- ఇక్కడ అనేక టోర్నీల్లో ఆడాను.. ఏపీఎల్ సీజన్-2 ఫైనల్స్ సందర్భంగా టీమిండియా మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్

14 లో

130 స్కూళ్లకు క్రీడా ప్రతిభా అవార్డులు

ఈ నెల 29న ప్రదానం

2 లో

ముగ్గురికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

విశాఖ జిల్లాకు చెందిన మురహరరావు ఉమాగాంధీ.. నెల్లూరు జిల్లాకు చెందిన మేకల భాస్కరరావు

అన్నమయ్య జిల్లాకు చెందిన శెట్టెం ఆంజనేయులు ఎంపిక

సెప్టెంబర్ 5న ఢిల్లీలో అవార్డుల ప్రదానం

5 లో

11 మంది తెలుగు సేవకులకు 'హంస-2023' పురస్కారాలు

29న నన్నయ వర్సిటీలో ప్రదానం: లక్ష్మీపార్వతి

3 లో

నైతిక 'కృత్రిమ మేధ' అత్యావశ్యకం

లేదంటే సమాజంపై ఏఐ ప్రతికూల ప్రభావాలు తప్పవు

బీ20 సదస్సులో ఆందోళన వ్యక్తంచేసిన ప్రధాని నరేంద్ర మోదీ

'ఏఐ వినియోగానికి సంబంధించి అంతర్జాతీయ స్థాయి ఏకరూప మార్గనిర్దేశకాలు అవసరం. నిబంధనల చట్రం లేకుంటే క్రిప్టో కరెన్సీ వంటి అంశాల్లో సమస్యలు మరింత ఎక్కువ అయ్యే ప్రమాదముంది. పర్యావరణానికి హాని తల పెట్టని రీతిలో జీవన, వ్యాపార విధానాలకు పారిశ్రామిక వర్గాలు ప్రాధాన్యతనివ్వాలి. ఇందుకు వ్యాపారవర్గాలు, ఆయా దేశాల ప్రభుత్వాలు కలసి కట్టుగా ముందుకు సాగాలి'



మహిళా సాధికారతకు చంద్రయాన్-3 చిహ్నం

ఇండియా డాటర్స్ ఇంత ప్రతిష్టాత్మకంగా ఉంటే భారత్ అభివృద్ధిని ఎవరు అడ్డుకోగలరు. మహిళల నేతృత్వంలో జరిగే అభివృద్ధి మన దేశ స్వాభావిక లక్షణంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో అసాధ్యమైనది ఏదైనా ఉంటే మహిళా శక్తితో సుసాధ్యంగా చేయొచ్చు. చంద్రయాన్-3 మిషన్ దీనికి నిలువెత్తు ఉదాహరణ.

- మన్‌కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ

6 లో

నేడు జగనన్న విద్యా దీవెన సాయం

- ఏప్రిల్–జూన్ 2023 త్రైమాసికానికి 9,32,235 మంది విద్యార్థులకు లబ్ధి
- 8,44,336 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.680.44 కోట్లు జమ
- నగరిలో బటన్ నొక్కి విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్

3 లో



ఇంటికే 'ఈ-పాఠం'

- విద్యార్థులకు మరింత చేరువగా చదువులు.. ఏపీ ఈ–పాఠశాల యూట్యూబ్ చానల్, ఈ–విద్య డీటీహెచ్ చానళ్ల ద్వారా బోధన
- ప్రసారాలకు ముందుకొచ్చిన డీటీహెచ్, కేబుల్ నెట్‌వర్క్ యాజమాన్యాలు
- 3 నుంచి 9వ తరగతి వరకు డిజిటల్ కంటెంట్.. సిద్ధం చేసిన రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ
- విద్యార్థి ఎక్కడున్నా నేర్చుకునేలా 366 వీడియో పాఠాలు

5 లో



1 నుంచి 'ఉపాధి'కి ఆధార్ చెల్లింపులు

- జాబ్ కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా అనుసంధానం తప్పనిసరి
- ఆ మూడు లింక్ అయితేనే సెప్టెంబర్ నుంచి వేతనాలు జమ
- ఉపాధిలో అక్రమాలకు తావులేకుండా కేంద్రం ఆదేశాలు
- అనుసంధానంలో అగ్రస్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్
- కూలీలు ఇబ్బంది పడకుండా ముందునుంచే జాగ్రత్తలు

- వివరాలు 2లో



కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు

- ఏరియా ఆస్పత్రిలో అధునాతన సేవలు
- అందుబాటులో న్యూటెక్నాలజీ రక్త పరీక్షల యంత్రాలు
- గంటలో 640 రక్త పరీక్షలు చేసే ఫుల్లీ ఆటో ఎనలైజర్
- బ్లడ్ బ్యాంకు ఫ్రీజర్, ఈఎస్ఆర్ వంటి పరికరాలు
- సుమారు 800లకు పైగా గ్రామాల్లో 30 వేల మందికి ఆస్పత్రి సేవలు
- ఇతర జిల్లాల నుంచి రోగుల రాక
- రోజుకు 300ల వరకు ఓపీ
- శిశువులకు ఎస్ఎన్ సీయూ

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్య, వైద్యానికి తొలి ప్రాధాన్యత ఇస్తుంది. ఈ క్రమంలో ప్రజారోగ్యానికి భరోసానిస్తుంది. గతంలో ప్రభుత్వ ఆస్పత్రులంటే భయపడే రోగులు ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సేవలు పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. నాడు – నేడు కార్యక్రమంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సకల సదుపాయాలు ప్రభుత్వం కల్పించింది. అవసరమైనంత వైద్య సిబ్బంది, ప్రత్యేక వైద్యులు నియమించి అన్ని రకాల వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టి రోగుల్లో నమ్మకాన్ని కల్పించింది.

సీతంపేట: కార్పొరేట్‌కు దీటుగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు అందుతున్నాయి. పూర్తి స్థాయిలో అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులు ఉండడంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. సీతంపేటతో పాటు భామిని సరిహద్దు పరిధిలో ఉన్న దాదాపు 800ల గ్రామాల్లో ఉన్న సుమారు 30 వేల మంది ప్రజానీకానికి ఈ ప్రాంతీయ ఆస్పత్రే ఆధారం. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు, మెళియాపుట్టి, పాతపట్నం ప్రాంతాల నుంచి కూడా రోగులు ఇక్కడకు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. ప్రతీ రోజు 300ల వరకు ఓపీ ఉంటుంది. ప్రతీ సోమవారం వారపు సంత రోజున దాదాపు 400ల వరకు రోగుల ఓపీ ఉంటుంది. పిడియాట్రిక్, ఈఎన్‌టీ, గైనకాలజీ, డెంటిస్ట్, జనరల్ మెడిసన్, సర్జన్, నేత్ర వైద్యులు వంటి స్పెషలిస్టులు ఉన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు కూడా అందుతున్నాయి. ఒకప్పుడు సీతంపేట ప్రాంతీయ ఆస్పత్రికి వెళ్లాలంటే భయపడేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. సీతంపేట ఆస్పత్రికి వెళ్తే రోగాలు తగ్గుముఖం పడతాయనే నమ్మకం రోగుల్లో ప్రస్తుత ప్రభుత్వం కల్పించగలిగింది.

అధునాతన పరికరాలు

ఇటీవల ప్రభుత్వం ఇక్కడ ఆస్పత్రిలో అధునాతన రక్త పరీక్షల పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. ఫుల్లీ ఆటో ఎనలైజర్ రక్తపరీక్షల యంత్రం గంటకు 640 పరీక్షలు చేస్తుంది. ఈఎస్ఆర్, బ్లడ్ బ్యాంకు ఫ్రీజర్, 2 అల్ట్రాసౌండ్ స్కానర్, ఎక్సరే వంటివి ఉన్నాయి. అన్ని రక్త పరీక్షలు ఇక్కడే ఉచితంగా చేస్తారు. బయటకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకునే అవసరం లేకుండా అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయి. స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ద్వారా అప్పుడే పుట్టిన నవ జాత శిశువులకు ప్రత్యేక వైద్యం అందుతుంది. ఫొటో థెరపి, సీప్యాప్, వార్మర్లు, వెంటిలేటర్లు వంటి సౌకర్యాలు ఉన్నాయి. పోషకాహార లోప చిన్నారులకు న్యూట్రీషియన్ రిహేబిలిటేషన్ సెంటర్ ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులను ఇక్కడ చేర్పించి సరైన న్యూట్రీషిన్ ఆహారాన్ని ఇవ్వడం ద్వారా పిల్లలకు ఆరోగ్యాన్ని అందజేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ఫిజియోథెరపి యూనిట్‌ను ఏర్పాటు చేసి అవసరమైన ఫిజియోథెరపి చేస్తున్నారు. వార్డులో 37 ఆక్సిజన్ బెడ్లు ఏర్పాటు చేశారు. రూ.20 కోట్లతో అధునాతన భవనాలను నిర్మిస్తున్నారు. త్వరలోనే ఆపరేషన్ థియేటర్లు, పూర్తి స్థాయిలో ఇన్‌పేషెంట్ గదులు అందుబాటులోకి రానున్నాయి.

మెరుగైన వైద్యమే లక్ష్యం

గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సౌకర్యాలు ఆస్పత్రుల్లో కల్పిస్తున్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ప్రతీ నెలా ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ సమీక్షలో సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తున్నాం. ఆస్పత్రికి అవసరమైన పరికరాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. కొద్ది రోజుల కిందట నుంచి ఆస్పత్రిలో ఇన్‌పేషంట్లకు భోజన సౌకర్యం కూడా కల్పిస్తున్నాం.

– విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్

రిఫరల్ లేకుండా ఇక్కడే వైద్యసేవలు

సాధ్యమైనంత వరకు రిఫరల్ కేసులు లేకుండా చూస్తున్నాం. ఇక్కడే అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నాం. మందులన్నీ అందుబాటులో ఉన్నాయి. రోగులు బయటకు వెళ్లి రక్త పరీక్షలు చేసుకోకుండా ఇక్కడే చేస్తున్నాం. గంటల తరబడి వేచి ఉండకుండా రక్త పరీక్షలు ఫలితాలు కూడా వెంటనే వస్తున్నాయి. దానికి తగ్గట్టుగా స్పెషలిస్టు వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నాం.

– బి.శ్రీనివాసరావు, ఏరియా ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి

ఇదండీ సంగతి



దీనికి ష్యూరిటీ ఎవరుంటారని అడుగుతావేం! వెళ్లు వెళ్లు!

క్లుప్తంగా...

130 స్కూళ్లకు క్రీడా ప్రతిభా అవార్డులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 130 పాఠశాలలను క్రీడా ప్రతిభా అవార్డులకు ఎంపిక చేసినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు ఆదివారం తెలిపారు. గత విద్యా సంవత్సరం (2022–23)లో క్రీడా సమాఖ్య పోటీల్లో అత్యధిక పతకాలు సాధించి జిల్లాలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన పాఠశాలలను అవార్డులకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 29న జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయా పాఠశాలలకు అవార్డులను ప్రదానం చేస్తామని వివరించారు. కాగా, క్రీడల్లో అత్యధిక పాయింట్లు సాధించిన విజయవాడ ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవగా, కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ రెండో స్థానంలో, చిలకలూరిపేట ఏఎంజీ హైస్కూల్ మూడో స్థానంలో నిలిచినట్లు వారు వివరించారు.

నేడు ఎన్టీఆర్ స్మారక రూ.100 నాణెం విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు శత జయంతిని పురస్కరించుకుని ఆర్‌బీఐ రూపొందించిన రూ.100 నాణెం సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విడుదల చేయనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి టీడీపీ అధినేత చంద్రబాబు, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, నందమూరి కుటుంబ సభ్యులు హాజరుకానున్నారు.

పేదల చదువు కోసం తపిస్తున్న సీఎం జగన్

- సినీనటుడు ఆర్.నారాయణమూర్తి
- 'యూనివర్సిటీ' సినిమాను ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి



అనంతపురం కల్చరల్: పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో ఉన్నత విద్యను అభ్యసించాలని, ఉన్నతంగా స్థిరపడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపిస్తున్నారని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం గణనీయంగా మెరుగుపడిందన్నారు. అందుకు సీఎం జగన్ చేపట్టిన విప్లవాత్మక చర్యలే కారణమని ఆయన పునరుద్ఘాటించారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో జరిగిన సమావేశంలో నారాయణమూర్తి మాట్లాడుతూ దేశంలో పేద, బలహీన వర్గాల వారికి విద్య, వైద్యం అందుబాటులో లేకుండా పోతున్నాయని చెప్పారు. ఆ సమస్యను ప్రతిబింబించేలా తమ తాజా చిత్రం 'యూనివర్సిటీ'ని చిత్రీకరించామని చెప్పారు. కష్టపడి చదువుకున్న విద్యార్థుల ఆశలకు గండి కొడుతూ కార్పొరేట్ కాలేజీల నిర్వాహకులు పేపర్ లీకేజీ సమస్యను సృష్టించి విద్యను అభాసుపాలు చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ శక్తులను మరింత అదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తాను నిర్మించి, నటించిన 'యూనివర్సిటీ' చిత్రం అక్టోబర్ 6వ తేదీన విడుదలవుతుందని, అందరూ ఆదరించాలని కోరారు. సీనియర్ రచయితలు బండి నారాయణస్వామి, డాక్టర్ శాంతి నారాయణ, తరిమెల అమరనాథరెడ్డి, కైలాస్ ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు గిరిజనులు రుణపడి ఉంటారు..

ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్



సాక్షి, అమరావతి: గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్‌కు గిరిజనులు రుణపడి ఉంటారని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ హర్షం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ నిర్మాణంతో గిరిజనుల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ నిలిచారని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కొనియాడారు. రాష్ట్ర విభజన అనంతరం అనుభవశాలి అని చంద్రబాబుకు అవకాశం ఇస్తే ఐదేళ్ల పాలనలో తాత్కాలిక రాజధానితోనే సరిపెట్టారని మండిపడ్డారు. విభజన హామీల సాధనలో చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని పేర్కొన్నారు. చంద్రబాబు వైఫల్యాలు రాష్ట్రానికి శాపాలుగా మారినప్పటికీ సీఎం వైఎస్ జగన్ వాటన్నింటినీ అధిగమించి సంక్షేమం, అభివృద్ధిని సాధించి చూపిస్తున్నారని ప్రశంసించారు.

ట్రిపుల్ ఐటీల్లో సీట్లన్నీ భర్తీ

నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్లకు కౌన్సెలింగ్ ముగిసింది. మూడు విడతల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మొత్తం 4,400 సీట్లు భర్తీ అయినట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్వీ గోపాలరాజు తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆదివారం నిర్వహించిన మూడో విడత కౌన్సెలింగ్‌లో 70 మందికి అడ్మిషన్లు కల్పించడంతో మొత్తం సీట్లు భర్తీ అయ్యాయని వివరించారు. దీంతో ఒక్కొక్క క్యాంపస్‌లో ఉన్న 1,100 సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తయిందని చెప్పారు.

దగాకోరు.. దబాయింపు!

- వాస్తవాలను వక్రీకరిస్తూ.. పొంతన లేని పోలికలతో రామోజీ కాకి లెక్కలు
- దిగుబడిలో 60 శాతానికిపైగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సొంత అవసరాలుపోనూ మిగతాది బయట మంచి ధరకు విక్రయిస్తున్న రైతన్నలు
- నాడు ధాన్యం సేకరణకు రూ.40,237 కోట్లు.. నేడు రూ.58,766 కోట్లు వ్యయం
- ఇప్పుడు జీఎల్‌టీ రూపంలో ప్రతి రైతుకు టన్నుకు రూ.2,523 అదనపు లబ్ధి
- రైతన్నలపై రవాణా, గోనె సంచుల భారం లేకుండా ఉపశమనం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి:

- కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకన్నా రైతులకు మార్కెట్లోనే అధిక ధరలు లభిస్తున్నప్పుడు ఎవరైనా ఎమ్మెస్పీకి అమ్ముకుంటారా? లేక అంతకంటే ఎక్కువ ధరకు విక్రయిస్తారా? మరి మన రాష్ట్ర రైతులు బహిరంగ మార్కెట్‌లో మంచి ధరలకు అమ్ముకుంటే ఇందులో తప్పు ఏమైనా ఉందా?
- కనీస మద్దతు ధర కన్నా అధిక రేట్లకు రైతులు పంట అమ్ముకుంటే ఆ రాష్ట్రంలో పరిస్థితులు బాగున్నట్లా లేక బాగోలేనట్లా?
- మన దగ్గర పండే ధాన్యానికి దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ధాన్యం దిగుబడుల్లో 60 శాతానికి పైగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తుండగా మిగతాది సొంత అవసరాలు పోనూ బయట మంచి ధరకు రైతులు విక్రయిస్తున్నారు. ఎక్కడ విక్రయిస్తేనేం? అన్నదాతకు మంచి ధర దక్కితే సంతోషించాలి కదా?





గతంలో ఏ గ్రేడ్, సాధారణ రకాలుగా విభజించి ధాన్యం కొనుగోలు చేయడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగేది. ఇప్పుడు ప్రభుత్వం ధాన్యం రంగుమారినా, తడిచినా వెరైటీల ప్రకారం గ్రేడెడ్ ఎంఎస్పీ చెల్లిస్తూ రైతులను ఆదుకుంటోంది. రైతుల సంఖ్య చూసినా, కొనుగోలు చేసిన ధాన్యం లెక్కలు గమనించినా ఇప్పుడెంతో మెరుగ్గా ఉంది. చంద్రబాబు హయాంతో పోలిస్తే ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించిన రైతుల సంఖ్య రెట్టింపైందని చిన్న పిల్లాడైనా చెబుతాడు. ఇదంతా దగాకోరులకు రుచించడం లేదు. రైతులంటే గిట్టని చంద్రబాబు పాలనతో బేరీజు వేస్తే తమకు పుట్టగతులుండవనే భయంతో పక్క రాష్ట్రంతో పోలుస్తూ పొంతన లేని రాతలతో విషం చిమ్ముతున్నారు. ఇందులో భాగంగా 'ధాన్యం రైతుకు దగా' అంటూ వక్రీకరణలతో ఈనాడులో అవాస్తవాలను వడ్డించారు.

ఒక్కో రైతు 34.42 టన్నులు విక్రయించారా?

టీడీపీ హయాంలో ధాన్యం సేకరణ దళారుల దందాగా సాగింది. 2014–15లో గత ప్రభుత్వం రెండు సీజన్లలో (ఖరీఫ్, రబీ) 1.18 లక్షల మంది రైతుల నుంచి 40.62 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించింది. రూ.5,583 కోట్లు చెల్లింపులు చేసింది. అంటే సగటున ఒక్కో రైతు నుంచి సేకరించిన ధాన్యం 34.42 టన్నులు. ఒక్కో రైతు నుంచి ఇంత పెద్ద మొత్తంలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం సాధ్యమేనా? అంటే రైతుల పేరిట దళారులు గత ప్రభుత్వానికి ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర కొట్టేశారన్నది సుస్పష్టం. 2015–16లోనూ ఇదే సీన్ రిపీట్. ఇలాంటి అక్రమాలకు తావులేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత పటిష్టంగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్నారు. 2022–23లో ఒక్క ఖరీఫ్ సీజన్‌లోనే మొత్తం 6.39 లక్షల మంది రైతుల వద్ద నుంచి రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరించారు.

దిగుబడిలో 60 శాతం కొనుగోలు

తెలంగాణలో అత్యధికంగా ఎంటీయూ 1010, 1001 రకం ధాన్యాన్ని సాగు చేస్తారు. వాటికి బహిరంగ మార్కెట్లో ఆశించిన ధర లేకపోవడంతో రైతులు ప్రభుత్వానికి విక్రయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా బీపీటీ, నెల్లూరు, స్వర్ణ రకాలను పండిస్తున్నారు. వీటికి జాతీయ, అంతర్జాతీయంగా మంచి మార్కెట్ ఉంది. ఇవి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు కాకుండా బయటకు వెళ్లిపోతాయి. మిగిలిన రకాల ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ఏపీలో ధాన్యం దిగుబడుల్లో 60 శాతానికి పైగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. గత రబీలో తొలిసారిగా ఐదు లక్షల టన్నుల జయ రకం (బొండాలు) ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించింది. ఫలితంగా దొడ్డు బియ్యానికి మార్కెట్‌లో రేటు పెరిగింది. వ్యాపారులు పొలాల్లోనే ఎగబడి కొనడంతో రైతులకు మేలు జరిగింది.

రైతుల సంఖ్య రెట్టింపు

టీడీపీ హయాంలో ఐదేళ్లలో 17.94 లక్షల మంది రైతుల నుంచి రూ.40,237 కోట్లు విలువైన 2,65,10,747 టన్నుల ధాన్యాన్ని సేకరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలోనే 32.78 లక్షల మంది రైతుల నుంచి రూ.58,766 కోట్లు విలువైన 3.10 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. మరి ఎవరి హయాంలో రైతులకు అన్యాయం చేశారో ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ఇక గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్లు అంటే రైతులకు నరక యాతనే. కేంద్ర ప్రభుత్వ నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఉన్నాయో లేదో గుర్తించేందుకు రోజుల తరబడి నిరీక్షించాల్సిందే. సరైన యంత్రాలు లేక నాణ్యత నిర్ధారణలోనూ రైతులు మోసపోయేవారు. ఇప్పుడు ఆర్బీకేల రాకతో రైతు దగ్గరకే టెక్నికల్ అసిస్టెంట్ వచ్చి ధాన్యం శాంపిళ్లు తీసుకుంటున్నారు. రైతు ఎదురుగానే వివరాలు నమోదు చేసి రశీదు ఇస్తున్నారు. గతంలో ఎక్కడో మండల కేంద్రాల్లో అరకొర వసతుల్లో ధాన్యం కొనుగోళ్లు జరిగేవి. ఇప్పుడు రైతు ఊరిలోనే.. ఆర్బీకే పరిధిలో.. పొలం గట్టు వద్దే ధాన్యాన్ని కొని మిల్లుకు తరలిస్తున్నారు.

జీఎల్‌టీ కింద రైతన్నకు టన్నుకు రూ.2,523

గతంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం లోడు తరలించాలంటే రైతులపై ఆర్థిక భారం పడేది. ధాన్యం సొమ్ములు నెలల తరబడి అందకపోవడంతో బయట అప్పులు చేయాల్సి వచ్చేది. గోనె సంచుల సేకరణను గతంలో మిల్లర్లకు వదిలేసేవారు. ఇప్పుడు పౌరసరఫరాల సంస్థ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలే గోనె సంచులను సమకూరుస్తున్నాయి. ధాన్యం లోడును ప్రభుత్వమే ఎగుమతి చేస్తూ మిల్లులకు తరలిస్తోంది. ఒకవేళ రైతుకు సొంత వాహనం ఉండి సంచులు, హమాలీలను సమకూర్చుకుంటే ఆ ఖర్చులను కూడా మద్దతు ధరతో కలిపి నిర్ణీత 21 రోజుల కంటే ముందుగానే రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇలా క్వింటాల్‌కు అదనంగా రూ.252 రైతులకు లభిస్తోంది. టన్ను గోనె సంచుల వినియోగానికి రూ.85, హమాలీల కూలీ రూ.220, సగటున 25 కిలోమీటర్ల ధాన్యం రవాణాకు రూ.468 చొప్పున మొత్తం జీఎల్‌టీ కింద టన్నుకు రూ.2,523 ప్రభుత్వం అందిస్తోంది. ఇది ఆయా రాష్ట్రాల్లో ఇచ్చే బోనస్‌తో పోలిస్తే అధికంగా ఉండటం విశేషం.

రూ.960 కోట్లు బకాయి పెట్టిన బాబు

చంద్రబాబు హయాంలో ధాన్యం డబ్బుల కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సి వచ్చేది. టీడీపీ సర్కారు దిగిపోతూ అన్నదాతలకు రూ.960 కోట్లు ధాన్యం బకాయిలు పెట్టింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బకాయిలను చెల్లించడంతో పాటు ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోగా మద్దతు ధరను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. గత రబీ సీజన్‌లో రూ.2,884 కోట్లకుగాను రూ.2,595 కోట్లను నిర్ణీత గడువులోగా 90 శాతం చెల్లించేశారు. మిగిలిన చిన్న మొత్తాల చెల్లింపుల్లో జాప్యానికి కారణం రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం ఆలస్యంగా జరగడమే. ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఫిర్యాదు చేసేందుకు ప్రతి జిల్లా కేంద్రంతో పాటు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేశారు. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తూ ప్రభుత్వం రైతులకు బాసటగా నిలుస్తోంది.

ధాన్యం కొనుగోళ్లు నాడు–నేడు ఇలా..

సీజన్	పరిమాణం	విలువ	రైతుల సంఖ్య	సీజన్	పరిమాణం	విలువ	రైతుల సంఖ్య
2014-15	40,62,188	5,583.03	1,17,973	2018-19	27,52,747	4,838.03	1,89,415
2015-16	64,72,204	9,238.41	2,72,014	2019-20	82,57,174	15,037.12	6,75,500
2016-17	55,57,513	8,261.40	5,26,740	2020-21	84,56,200	15,841.41	8,03,867
2017-18	59,72,947	9,352.26	4,96,281	2021-22	66,54,039	12,943.50	8,11,055
2018-19	44,45,895	7,801.81	3,81,271	2022-23	49,48,901	10,105.92	7,98,262
మొత్తం	2,65,10,747	40,236.91	17,94,279	మొత్తం	3,10,69,061	58,765.98	32,78,099

నోట్: పరిమాణం మెట్రిక్ టన్నులలో, విలువ రూ.కోట్లలో

1 నుంచి 'ఉపాధి'కి ఆధార్ చెల్లింపులు

- జాబ్ కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా అనుసంధానం తప్పనిసరి
- ఆ మూడు లింక్ అయితేనే సెప్టెంబర్ నుంచి వేతనాలు జమ



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలకు సెప్టెంబరు 1వతేదీ నుంచి పూర్తి స్థాయిలో ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు అకౌంట్లకు మాత్రమే వేతనాలు చెల్లింపులు చేస్తారు. ఉపాధి హామీ జాబ్ కార్డు నెంబరుతో పాటు ఆధార్, బ్యాంకు ఖాతాలను ఉమ్మడిగా అనుసంధానం చేసుకుంటేనే ఆయా ఖాతాలకు వేతనాలు జమ అవుతాయి. ఈ మూడింటినీ అనుసంధానం చేసుకోని వారికి సెప్టెంబరు ఒకటో తేదీ తర్వాత ఉపాధి పథకం పనులకు హాజరైనా వేతనాలు జమ చేసే పరిస్థితి ఉండదని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈ మేరకు కీలక మార్పులు తెచ్చింది. దీన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 1వతేదీ నుంచే అమలు చేయాలని తొలుత భావించినా చాలా రాష్ట్రాల్లో (మన రాష్ట్రం కాదు) పెద్ద సంఖ్యలో కూలీల జాబ్‌కార్డులను ఆధార్, బ్యాంకు అకౌంట్లతో అనుసంధానించే ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పలు దఫాలు వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా సెప్టెంబరు ఒకటి నుంచి ఖచ్చితంగా నూతన విధానంలోనే కూలీలకు వేతనాల చెల్లింపులు ఉంటాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్రాలకు స్పష్టం చేసినట్టు అధికారులు వెల్లడించారు. కేంద్రం ఈ ప్రతిపాదనలను తేకముందు నుంచే మన రాష్ట్రంలో ఉపాధి కూలీలకు పాక్షికంగా ఆధార్ అనుసంధానంతో కూడిన వేతనాల చెల్లింపులు కొనసాగుతున్నట్టు వివరించారు. రాష్ట్రంలో పథకం అమలులో పారదర్శకత కోసం వీలైనంత మేర కూలీల జాబ్‌కార్డులను బ్యాంకు అకౌంట్లతో అనుసంధానించగా మిగతావారికి కూడా ఇప్పటి వరకు వేతనాలను చెల్లిస్తున్నారు. అయితే సెప్టెంబరు ఒకటి నుంచి మాత్రం వందకు వంద శాతం తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం విధానంలో వేతనాల చెల్లింపుల ప్రక్రియ ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

రాష్ట్రంలో 99.53 శాతం అనుసంధానం

ఆంధ్రప్రదేశ్‌లో 69 లక్షల కుటుంబాలకు చెందిన 1.24 కోట్ల మంది కూలీలు ఉపాధి హామీ పథకంలో పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో ఏటా గరిష్టంగా 47.74 లక్షల కుటుంబాలకు సంబంధించి దాదాపు 79.81 లక్షల మంది కూలీలు ఉపాధి పనులతో లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కలిపి గత ఐదేళ్లుగా ఏటా రూ.ఐదారు వేల కోట్లకు తక్కువ కాకుండా ప్రయోజనం చేకూరుతోంది. వేతనాల చెల్లింపుల్లో కేంద్రం తెచ్చిన నూతన విధానంతో ఉపాధి హామీ కూలీలెవరూ ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకుంది. మొత్తం 1.24 కోట్ల మంది కూలీలలో 99.53 శాతం మంది జాబ్ కార్డులు ఆధార్, బ్యాంకు అకౌంట్లతో అనుసంధానం ప్రక్రియను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. గత మూడేళ్లలో ఒక్క రోజైనా ఉపాధి పనులకు హాజరైన క్రియాశీలక కూలీలలో 97.2 శాతం మందిని కూడా ఇప్పటికే అనుసంధానించారు. ఉపాధి పథకం కూలీల జాబ్‌కార్డులను ఆధార్, బ్యాంకు అకౌంట్లతో అనుసంధానించే ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. త్రిపుర, కేరళ, లడఖ్, పుదుచ్చేరి, చత్తీస్‌గఢ్, సిక్కిం, తమిళనాడు తరువాత స్థానాల్లో ఉన్నాయి. మన రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో పేర్లు నమోదు చేసుకున్న కూలీలలో ఇంకా కేవలం 60 వేల మందికి సంబంధించి మాత్రమే ఆధార్ అనుసంధానం ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. వారు గతంలో పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ ఉపాధి పనులపై పెద్దగా ఆసక్తి చూపని వారే కావచ్చని పేర్కొంటున్నారు.

దళారీ వ్యవస్థకు దన్ను.. బాబే

- చంద్రబాబువి అబ్రకదబ్ర హామీలు: మంత్రి కారుమూరి



సాక్షి, అమరావతి: రైతన్నలు పండించిన ప్రతి ధాన్యం గింజను ఆర్బీకే వ్యవస్థ ద్వారా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తున్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రైతుల దగ్గర నుంచి ఆఖరి గింజ వరకు కొనటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా రైతుల ఖాతాలకే నేరుగా డబ్బులు జమ చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో దళారీ వ్యవస్థను ప్రోత్సహించింది చంద్రబాబేనన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్ ప్రభుత్వంపై ఈనాడు రామోజీరావుకు ఎందుకింత కక్ష? అని ప్రశ్నించారు. రామోజీరావు ఎలాంటి వారో ఆయన తోడల్లుడిని అడిగినా చెబుతారన్నారు. మంత్రి కారుమూరి ఆదివారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబువి అబ్రకదబ్ర హామీలని, నయవంచనకు ఆయన కేరాఫ్ అని ధ్వజమెత్తారు.

- రైతులకు చంద్రబాబు ఎంత ద్రోహం చేసినా రామోజీకి కనపడదు, వినపడదు. టీడీపీ పాలనలో దోచుకో దాచుకో పద్ధతిని అనుసరించారు. చంద్రబాబు హయాంలో 2.65 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తే గత నాలుగేళ్లలో సీఎం జగన్ 3.10 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 2014 – 19 మధ్య 17.94 లక్షల మంది రైతులకు రూ.40,236 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. నాలుగేళ్లలో సీఎం జగన్ 32.78 లక్షల మంది రైతులకు పారదర్శకంగా రూ.58,765 కోట్లు చెల్లింపులు చేశారు.
- రైతులకు చంద్రబాబు ఎంత ద్రోహం చేసినా, గిట్టుబాటు ధర కల్పించకపోయినా రామోజీరావు, దత్తపుత్రుడు ఏనాడూ మాట్లాడలేదు. చంద్రబాబు ఎంత దుర్మార్గాలకు పాల్పడ్డారో రైతులందరికీ తెలుసు. ఇన్‌పుట్ సబ్సిడీని ఎగ్గొట్టారు. 2014 ఇన్‌పుట్ సబ్సిడీ కూడా సీఎం జగన్ వచ్చాకే ఇచ్చారు. ఇప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఆ పంట కాలంలోనే ఇస్తున్నాం.
- తెలంగాణలో ధాన్యాన్ని ఇతరులు ఎవరూ కొనరు. ఆ రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఏపీలో స్వర్ణ రకం, ఇతర అన్ని రకాలను పండిస్తారు. మన దగ్గర పండే ధాన్యాన్ని రైతుల నుంచి ఎంఎస్పీ కంటే ఎక్కువ ధరకు బయ్యర్లు కొనుగోలు చేస్తారు. ఐదేళ్ల నుంచి బాయిల్డ్ రైస్ కొనుగోలు చేయని కేంద్ర ప్రభుత్వంతో కొనిపించే ఏర్పాట్లు చేశాం. బొండాలను కొనుగోలు చేయాలనుకుంటే కొంత మాత్రమే వచ్చింది. విక్రయించాలని రైతులను కోరినా అమ్మలేదు. కేరళ అడిగిన బొండాలు రకం కూడా కొనుగోలు చేశాం. కేరళలో ఓనమ్ పండుగ వరకు మన రైతులు నిల్వ చేస్తారు. అలా నిల్వ చేయటం వల్ల రూ.1900లకు అమ్మటంతో రైతులకు ఎంతో లాభం వచ్చింది.

ఏపీ బీమా.. ది బెస్ట్

మొదటి పేజీ తరువాయి

ఏపీలో అమలవుతున్న ఉచిత పంటల బీమా అమలును అధ్యయనం చేసేందుకు ఆసక్తి చూపాయి. గతంలో పంటల బీమా రైతులకు అందని ద్రాక్షగా ఉండేది. స్వాతంత్య్రం వచ్చాక 1965లో కేంద్రం తీసుకొచ్చిన క్రాప్ ఇన్సూ్యరెన్స్ బిల్లు ఆధారంగా తెచ్చిన మోడల్ ఇన్సూ్యరెన్స్ పథకం.. ప్రస్తుతం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)గా దేశ వ్యాప్తంగా అమలవుతోంది. అధిక ప్రీమియం కారణంగా ఈ పథకంలో చేరేందుకు రైతులు ఆసక్తిచూపే వారు కాదు. లక్షలాది మంది రైతులు బీమాకు దూరంగా ఉండడంతో ఏటా రూ.వేల కోట్ల పెట్టుబడిని నష్టపోయే వారు. బీమా చేయించుకున్న వారు సైతం పరిహారం కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది.

అధికారంలోకి రాగానే శ్రీకారం

పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు.. అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 జూలై 8న ఉచిత పంటల బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. 2019 ఖరీఫ్ సీజన్‌లో ఒక్క రూపాయి ప్రీమియంతో ఈ పథకాన్ని అమలు చేయగా, ఆ తర్వాత సీజన్ నుంచి ఆ భారం కూడా రైతులపై పడకుండా వారు చెల్లించాల్సిన వాటా మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. ఈ-పంటలో నమోదే ప్రామాణికంగా పైసా భారం పడకుండా రైతులందరికీ వర్తింప చేస్తోంది. క్లెయిమ్ సెటిల్‌మెంట్లు, చెల్లింపుల బాధ్యతను కూడా తన భుజాన వేసుకుంది. ఈ-పంటలో నమోదైన నోటిఫైడ్ పంటలకు సీజన్ ముగియకుండానే లబ్ధిదారుల జాబితాలను సామాజిక తనిఖీల్లో భాగంగా ఆర్బీకేల్లో ప్రదర్శిస్తోంది. అభ్యంతరాల పరిష్కారం అనంతరం బీమా పరిహారం చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇంకా ఎవరైనా మిగిలి పోయారేమోనని వెతికి మరీ అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం చెల్లిస్తోంది. ఇలా ఏటా సగటున 13.62 లక్షల మందికి రూ.1,950.51 కోట్ల చొప్పున ఈ నాలుగేళ్లలో 54.48 లక్షల మంది రైతులకు రూ.7,802.05 కోట్ల పరిహారాన్ని వారి ఖాతాల్లో నేరుగా జమ చేసింది. ఇందులో టీడీపీ హయాంలో 6.19 లక్షల మంది రైతులకు చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.715.84 కోట్ల బకాయిలు కూడా ఉన్నాయి.

భేష్ అంటూ ముందుకొచ్చిన కేంద్రం

పీఎంఎఫ్‌బీవైతో అనుసంధానించడం ద్వారా 2019–20లో రైతుల వాటాతో కలిపి రూ.971 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం రూపంలో చెల్లించింది. ఆ తర్వాత రెండేళ్లు బీమా కంపెనీలతో సంబంధం లేకుండా పరిహారం మొత్తం ప్రభుత్వమే చెల్లించింది. యూనివర్సల్ కవరేజ్ విషయంలో ఏపీ స్ఫూర్తిగా కేంద్రం కూడా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. 2022–23లో పీఎంఎఫ్‌బీవైతో కలిసి ఉచిత పంటల బీమా పథకం అమలైంది. దిగుబడి ఆధారిత పంటల కోసం 2022 ఖరీఫ్‌లో రైతుల వాటాతో కలిపి రూ.1,213.37 కోట్లు కంపెనీలకు చెల్లించగా, వాతావరణ ఆధారిత పంటలకు గతంలో మాదిరిగా పరిహారం మొత్తం ప్రభుత్వమే చెల్లించింది. గతంలో ఏటా సగటున 16 లక్షల మంది రైతులు, 48 లక్షల ఎకరాలకు బీమా చేయించు కోగలిగితే.. ఈ ప్రభుత్వం వచ్చాక 2019 – 2022 మధ్య ఏటా సగటున 30 లక్షల రైతులకు చెందిన 71.55 లక్షల ఎకరాలకు ఉచిత బీమా కవరేజ్ కల్పించింది. 2020 ఖరీఫ్‌లో 50 లక్షల ఎకరాలకు కవరేజ్ కల్పిస్తే, 2021 ఖరీఫ్‌లో ఏకంగా 80 లక్షల ఎకరాలకు చేరింది. ఇలా యూనివర్సల్ కవరేజ్ సాధించిన తొలి రాష్ట్రంగా ఏపీ గుర్తింపు పొందింది. ఈ తరహా స్కీమ్ దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే ఎక్కడా లేదని బీమా రంగ నిపుణులే కాదు.. స్వయంగా కేంద్ర ప్రభుత్వం కూడా అధికారికంగా ప్రకటించింది.



ఉత్తరాఖండ్ రుషికేష్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాల వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు

ఏపీ బాటలో పలు రాష్ట్రాలు

'రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత పంటల బీమా పథకాన్ని అధ్యయనం చేశాం. నోటిఫైడ్ పంటలు సాగు చేస్తున్న రైతులందరికీ ఈ క్రాప్ డేటా యూనివర్సల్ కవరేజ్ కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ. అందుకే రైతుల విశాల ప్రయోజనాల దృష్ట్యా ఫసల్ బీమా యోజనలో భాగస్వామి కావాల్సిందిగా ఏపీ ప్రభుత్వాన్ని కోరాం. 2023–24 సీజన్ నుంచి ఏపీ ప్రభుత్వంతో కలిసి ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. ఏపీ స్ఫూర్తితోనే ఫసల్ బీమాలో మార్పులూ తెచ్చాం' అని గత కాన్ఫరెన్స్‌లో కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ ప్రకటించడం తెలిసిందే. ఏపీ బాటలో మిగిలిన రాష్ట్రాలూ అడుగు లేయాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి జాతీయ స్థాయిలో ఎక్కడ ఏ మీటింగ్ జరిగినా కేంద్ర మంత్రితో సహా కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులందరూ ఏపీలో అమలవుతున్న ఉచిత పంటల బీమా అమలు తీరును ప్రస్తావించని సందర్భం లేదంటే అతిశయోక్తి కాదు. 2019లో ఏపీ ప్రభుత్వం అమలు చేసినట్టుగానే రూపాయికే పంటల బీమా అమలు చేస్తున్నామని మహారాష్ట్ర, ఒడిశా, పుదుచ్చేరి, మేఘాలయ రాష్ట్రాలు ప్రకటించాయి. సీఎం జగన్ తెచ్చిన సంస్కరణలు జాతీయ స్థాయిలో అమలు జరుగుతున్నాయనడానికి ఇదో నిదర్శనమని నిపుణులంటున్నారు.

సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా ఏపీ

ఈ-క్రాప్ ప్రామాణికంగా నోటిఫై చేసిన ప్రతి పంటకు ఉచిత పంటల బీమా పథకం అమలు చేస్తూ బీమా రక్షణ కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అంటూ 20 రాష్ట్రాలు పాల్గొన్న నేషనల్ కాన్ఫరెన్స్‌లో పలువురు కొనియాడారు. రైతులపై పైసా భారం పడకూడదన్న ఆలోచనతో సీఎం జగన్ ప్రభుత్వం పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. పంటల బీమా పరిధిలో కవరేజ్ పెంచడానికి ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా వ్యవహరించిందని కేంద్ర ఉన్నతాధికారులు ప్రకటించారు.

సర్వత్రా ప్రశంసలు



వర్క్‌షాపులో ఏపీ ప్రభుత్వంపై ప్రశంసల జల్లు కురిసింది. అతి తక్కువ ప్రీమియంతో యూనివర్సల్ బీమా కవరేజీని అమలు చేస్తుండడం పట్ల రాష్ట్రాలు ప్రశంసించాయి. తగిన మోడల్‌ను ఎంచుకోవడానికి రాష్ట్రాలకు నిర్ణయాధికారం ఇవ్వడం వల్ల 2023–24 సీజన్‌లో దేశంలోనే అతితక్కువ ప్రీమియం రేట్లను ఏపీ ప్రభుత్వం సాధించగలగడాన్ని కూడా ప్రశంసించారు. ఏపీ బాటలోనే తాము కూడా పయనిస్తున్నామంటూ ఆయా రాష్ట్రాలు ప్రకటించడం గొప్ప అచీవ్‌మెంట్. – చేవూరు హరికిరణ్, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్

అరుదైన గౌరవం



రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారు. అందులో ఈ క్రాప్, వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాలు కీలకం. ఈ రెండు పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. వీటిని అనుసరించేందుకు పలు రాష్ట్రాలు క్యూ కడుతున్నాయి. ఒకేసారి నాలుగు రాష్ట్రాలు ఏపీ బాటలో అడుగులు వేస్తున్నట్టు ప్రకటించడం ఏపీ ప్రభుత్వానికి దక్కిన అరుదైన గౌరవం. – కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

క్లుప్తంగా...

11 మంది తెలుగు సేవకులకు 'హంస-2023' పురస్కారాలు

29న నన్నయ వర్సిటీలో ప్రదానం: లక్ష్మీపార్వతి వెల్లడి

సాక్షి, అమరావతి: తెలుగు భాషా సాహిత్యం, సంస్కృతి, వివిధ కళా ప్రక్రియల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖులను 'హంస-2023' పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ తెలుగు-సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీన రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న తెలుగు భాషా దినోత్సవంలో ఈ పురస్కారాలు అందజేస్తామన్నారు. సాహిత్యంలో ఎస్.అబ్దుల్ అజీజ్ (రచయిత, కర్నూలు), మోదుగుల రవికృష్ణ (ఉపాధ్యాయుడు, గుంటూరు), జడా సుబ్బారావు (సహాయ ఆచార్యుడు, నూజివీడు), జక్కు రామకృష్ణ (విశ్రాంత హెచ్ఎం, విజయనగరం), వైహెచ్కే మోహనరావు (విలేకరి, పిడుగురాళ్ల), సామాజిక రచనల విభాగంలో ఎండపల్లి భారతి(రచయిత్రి, చిత్తూరు), కవిత్వంలో మాడభూషి సంపత్‌కుమార్(విశ్రాంత ఆచార్యుడు, నెల్లూరు), అవధానంలో సూరం శ్రీనివాసులు (విశ్రాంత హెచ్ఎం, నెల్లూరు), తెలుగు భాషాభివృద్ధికి సాంకేతిక సహకారం అందిస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన సహాయ ఆచార్యులు కేవీఎస్‌డీ వరప్రసాద్‌కు పురస్కారాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు-సంస్కృత అకాడమీ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన గండికోట హిమశ్రీ (బుచ్చిరెడ్డిపాలెం), వి.జస్మితరెడ్డి (మంగళగిరి)లకు కూడా హంస పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు ఆమె తెలిపారు.

60 లక్షల దొంగ ఓట్లు చేర్పించిన చంద్రబాబు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం రూరల్: తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో 60 లక్షల దొంగ ఓట్లను చేర్పించిందని, వాటన్నింటినీ ఎన్నికల సర్వేలో తొలగిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఆదివారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. ఒక్క కుప్పం నియోజకవర్గంలోనే 40 వేల ఓటర్లను పక్కనున్న తమిళనాడు నుంచి తెచ్చి చేర్పించారని విమర్శించారు. చంద్రబాబు దుర్మార్గం బయటపడటంతో ఎన్నికల కమిషన్‌ను కలిసేందుకు వెళ్తున్నారని విమర్శించారు.

చంద్రబాబు దమనకాండలో మృతుల సంస్మరణ నేడు

విద్యుత్ ఉద్యమంలో అమరులకు నివాళులర్పించాలని వామపక్షాల పిలుపు

సాక్షి, అమరావతి: గత టీడీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని చేసిన పోరాటంలో అశువులుబాసిన అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీలు ఓ ప్రకటన విడుదల చేశాయి. 'ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి 23 ఏళ్ల కిందట నాటి సీఎం చంద్రబాబు భారీగా విద్యుత్ చార్జీలు పెంచారు. దానికి వ్యతిరేకంగా వామపక్షాలు పెద్ద ఎత్తున ఉద్యమించడంతో చంద్రబాబు ప్రభుత్వం బషీర్‌బాగ్ వద్ద జరిపించిన పోలీస్ కాల్పుల్లో ముగ్గురు మరణించారు. వారి త్యాగాలను స్మరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నివాళులర్పించే కార్యక్రమాలు నిర్వహించాలి' అని వామపక్షాలు పిలుపునిచ్చాయి.

నేటి నుంచి ఇసుకపై టీడీపీ నిరసనలు

సాక్షి, అమరావతి: ఇసుక సంబంధిత అంశాలపై ఈ నెల 28, 29, 30 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు టీడీపీ పిలుపునిచ్చింది. 28వ తేదీన అక్రమంగా మైనింగ్ చేస్తున్న ఇసుక రీచ్‌లు, ఇసుక డంపింగ్ యార్డుల వద్ద పార్టీ శ్రేణులు నిరసనలు చేపట్టి మీడియా సమావేశాలు నిర్వహించాలని నాయకులకు సూచించింది. 29వ తేదీన తహశీల్దార్, పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని కోరింది. 30వ తేదీన అన్ని నియోజకవర్గాల నాయకులు విజయవాడ ఇబ్రహీంపట్నంలో ఉన్న మైనింగ్ డైరెక్టర్ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించేందుకు తరలి రావాలని కోరింది. వైఎస్సార్‌సీపీ చేస్తున్న ఇసుక దోపిడీపై ఈ సందర్భంగా మైనింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామని టీడీపీ నేతలు తెలిపారు.

అడవి బిడ్డలకు అక్షర యజ్ఞం

గిరిజన విద్యపై సర్కారు ఫోకస్

- రాష్ట్రంలో 2,506 గిరిజన సంక్షేమ విద్యాసంస్థలు
- 371 ఆశ్రమ పాఠశాలలు, 18 ప్రీమెట్రిక్ హాస్టళ్లు, 159 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, 1,958 పాఠశాలలు
- చదువుల ఒడిలో 1,55,599 లక్షల మంది విద్యార్థులు
- ఆహారం, సౌందర్య సాధనాలు, సౌకర్యాలు, వసతికి రూ.920.31 కోట్లు



భోజనాలు చేస్తున్న గిరిజన విద్యార్థులు

సాక్షి, అమరావతి: పచ్చని తివాచీ కప్పుకున్నట్టు ఉండే ఎత్తైన కొండలు.. దట్టమైన చెట్లు.. నడుమ పచ్చిక మైదానంలో కళ్లు చెదిరేలా రంగురంగుల భవంతులు. వాటిలోనే గిరిజన విద్యా కుసుమాలు వికసిస్తున్నాయి. అదే ఏజెన్సీ ప్రాంతంలోని మారేడుమిల్లి గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయం. అత్యంత బలహీన తెగల(పీవీటీజీ)కు చెందిన గిరిజన బాలల కోసం ఉద్దేశించిన ఈ గురుకులం మూడు నుంచి పదవ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం చదువులతో కార్పొరేట్ విద్యాలయాలను తలదన్నుతోంది. దీనిలో ఆధునిక హంగులతో కూడిన క్లాస్ రూమ్ నుంచి భోజనశాల, బాత్‌రూమ్, ఆర్వో ప్లాంట్, వసతి వరకు ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన నాడు-నేడు ద్వారా 2020లో ప్రభుత్వం సకల సౌకర్యాలు సమకూర్చింది. రాష్ట్రంలో గిరిజన విద్యపై సర్కారు ప్రత్యేక ఫోకస్ పెట్టిందనేందుకు ఇదే గొప్ప నిదర్శనం. ఇదే కాదు.. రాష్ట్రంలోని అడవి బిడ్డల కోసం ప్రభుత్వం పెద్దఎత్తున అక్షర యజ్ఞాన్ని విజయవంతంగా నిర్వహిస్తోంది. ఇందుకోసం రూ.వందల కోట్లు ఖర్చు చేస్తోంది.

2,506 గిరిజన సంక్షేమ విద్యాసంస్థలు

రాష్ట్రంలో మొత్తం 2,506 గిరిజన సంక్షేమ విద్యాసంస్థలు పనిచేస్తున్నాయి. అందులో 1,958 గిరిజన పాఠశాలలు, 371 ఆశ్రమ పాఠశాలలు, 18 ప్రీ మెట్రిక్ హాస్టళ్లు, 159 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో 1,55,599 మంది విద్యార్థులు చదువుతున్నారు. వాటి పరిధిలోని హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ఆహారం, సౌందర్య సాధనాలు, ఇతర సౌకర్యాలతో పాటు ఉచిత వసతి తదితర వాటికి ఈ ఏడాది(2023-24) ప్రభుత్వం రూ.920.31 కోట్లు కేటాయించింది. నూరు శాతం గిరిజన జనాభా ఉన్న షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని విద్యాలయాల్లో మొత్తం సీట్లు అన్నీ వారికే కేటాయిస్తోంది. 70 శాతం లోపు గిరిజన జనాభా కలిగిన నాన్ షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని విద్యాసంస్థల్లో ఎస్టీలకు 70 శాతం, ఎస్సీ, బీసీ, ఇతరులకు పది శాతం చొప్పున సీట్లు కేటాయిస్తున్నారు.

ఎన్నో పథకాల ద్వారా

జగనన్న విద్యా కానుక పథకం ద్వారా 1నుంచి 10వ తరగతి వరకు చదివే గిరిజన విద్యార్థులకు సైతం ప్రభుత్వం కిట్‌లు అందిస్తోంది. మూడు జతల యూనిఫామ్ క్లాత్, టెక్స్ట్‌బుక్స్, నోట్ బుక్స్ సెట్, ఒక జత షూ, రెండు జతల సాక్స్, స్కూల్ బ్యాగ్, బెల్ట్, మూడు మాస్కులు అందిస్తున్నారు. గత విద్యా సంవత్సరం(2022-23)లో ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 1,25,901 మంది గిరిజన విద్యార్థులు ప్రయోజనం పొందారు. స్వచ్ఛ కార్యక్రమం కింద కౌమార బాలికలకు రుతుస్రావ సమయంలో అత్యంత భద్రత, పరిశుభ్రతను నిర్ధారించడానికి నాణ్యమైన(బ్రాండెడ్) శానిటరీ న్యాప్‌కిన్‌లు నెలకు 10 చొప్పున 17,060 మంది బాలికలకు అందజేస్తున్నారు. మరోవైపు గిరిజన పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి పిల్లలకు నిజమైన అభ్యాస కేంద్రాలుగా తీర్చిదిద్దుతోంది. నాడు-నేడు మొదటి దశలో ప్రభుత్వం రూ.140 కోట్లుతో 352 పాఠశాలల్లో సమగ్ర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసింది.



మారేడుమిల్లి గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలోని మరుగుదొడ్లు



బుట్టాయగూడెం ఈఆర్ఎం స్కూల్

ఉన్నత విద్యాలయాలకు శ్రీకారం

- రూ.153.853 కోట్లతో కురుపాంలో ఇంజనీరింగ్ కళాశాలకు 2020 అక్టోబర్ 2న సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు. అకడమిక్ బ్లాక్, హాస్టల్ బ్లాకుల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి.
- విజయనగరం జిల్లా సాలూరు నియోజకవర్గంలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి ప్రభుత్వం 561.88 ఎకరాలు కేటాయించింది. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఈ విశ్వవిద్యాలయం కొండకరకంలో ఏయూ పాత క్యాంపస్‌లో కొనసాగుతోంది.
- అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో రూ.500 కోట్లతో గిరిజన వైద్య కళాశాల మంజూరైంది. వంద వైద్య విద్యా సీట్లు కేటాయించిన ఈ కళాశాల గిరిజనుల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి వైద్య సేవలు అందించడంతో పాటు వైద్య పరిశోధనలకు, వైద్య వృత్తిని స్వీకరించేలా గిరిజన యువతను ప్రోత్సహించేందుకు దోహదం చేస్తుంది.

సంవత్సరాల వారీగా ఐఐటీ, ఎన్ఐటీ సీట్లు సాధించిన గిరిజన విద్యార్థుల వివరాలు ఇలా..

సంవత్సరం	ఐఐటీ	ఎన్ఐటీ
2018-19	2	13
2019-20	0	41
2020-21	9	59
2021-22	10	30
2022-23	13	17
మొత్తం	34	160

ఐఐటీ, ఎన్ఐటీ ప్రవేశాల్లో గిరిజన బిడ్డల సత్తా



బుట్టాయగూడెం ఈఆర్ఎం స్కూలులోని తరగతి గదులు



గురుకులాల్లో చదివే గిరిజన బిడ్డలు ఐఐటీ, ఎన్ఐటీ, మెడిసిన్ సీట్లు సాధించేలా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తోంది.

గిరిజన పాఠశాలల రూపురేఖలు మారాయి



గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యావకాశాలను అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రధానంగా నాడు-నేడు ద్వారా ప్రభుత్వం చేపడుతున్న పనులతో గిరిజన విద్యాలయాల రూపురేఖలు మారిపోతున్నాయి. గతంలో అరకొర వసతులు, ఎప్పుడు పడిపోతాయో తెలియనట్టు ఉండే భవనాల్లో చదువుకోవాలంటేనే గిరిజన పిల్లలకు ఆసక్తి ఉండేదికాదు. ఇప్పుడు కార్పొరేట్ విద్యా సంస్థలను తలదన్నే సౌకర్యాలను గిరిజన విద్యాలయాల్లో చూస్తే గిరిజనుల్లో ఆశ్చర్యంతో కూడిన ఆనందం కలుగుతుంది.

– కంగాల వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, నూతిరామన్నపాలెం

విద్యతోనే గిరిజనులకు గొప్ప పురోగతి



విద్యతోనే పురోగతి అని నమ్మడమే కాకుండా అందుకు అనుగుణంగా గొప్ప సంస్కరణలు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో గిరిజనులకు కూడా విద్యావకాశాలు మెరుగుపరిచారు. గతంలో ఏజెన్సీ ప్రాంతంలో బడులను చూస్తేనే భయం వేసేది. ఇప్పుడు అన్ని సౌకర్యాలతో గిరిజన బిడ్డలకు విద్యను అందించేలా ప్రభుత్వం నిధులకు కూడా వెనుకాడక ఖర్చు చేస్తోంది. గిరిజన విద్యార్థులకు అవసరమైన విద్యతోపాటు వసతి, ఆహారం, సౌందర్య సాధనాలు(కాస్మోటిక్స్) తదితర అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది.

– పీడిక రాజన్నదొర, ఉప ముఖ్యమంత్రి

మాకు ఇంగ్లిష్ చదువులు అందించారు

మా గిరిజన పిల్లలకు మామూలు చదువులు అందడమే కష్టంగా ఉండేది. బడుల్లో సౌకర్యాలు లేక, దూరభారమైన ప్రైవేటు కాన్వెంట్లకు వెళ్లి చదువులు కొనలేక మాలాంటి ఎంతో మంది గిరిజన పిల్లలు చదువుకు దూరమయ్యేవారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ మావయ్య..మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ బడులు, గురుకులాల్లో ఇంగ్లిష్ చదువులు అందించారు. మేము బాగా చదువుకోవాలని అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

–ఇన్నా కరుణ జెస్సీ ప్రియ, 5వ తరగతి(ఇంగ్లిష్ మీడియం), మారేడుమిల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

దొంగ ఓట్లపై నేడు ఈసీని కలుస్తాం

- 2019లో ఓటమి తర్వాత ఇది బాబు నిర్వాకమే
- ఒక్క దొంగ ఓటూ ఉండకూడదనేది మా విధానం
- దళిత సంక్షేమంపై చర్చకు సిద్ధం
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున



మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): రాష్ట్రంలో ఒక్క దొంగ ఓటు కూడా ఉండకూడదని, రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలు జరగాలని.. తమ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీగా కోరుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున స్పష్టం చేశారు. ఈ విషయమై తాము 28వ తేదీన కేంద్ర ఎన్నికల కమిషనర్‌ను కలవనున్నామని చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత టీడీపీ పథకం ప్రకారం రాష్ట్రంలో 60 లక్షల దొంగ ఓట్లు చేర్పించిందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా అధికారంలోకి రాలేమన్న బలమైన అభిప్రాయంతో చంద్రబాబు ఇలా చేశారని విమర్శించారు. దీనికి పూర్తి భిన్నంగా రాష్ట్రంలో అసలు దొంగ ఓట్లే ఉండకూడదనే సదుద్దేశంతో సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. దీంతో ప్రతిపక్ష నేతల కూసాలు కదలిపోతున్నాయని, అందుకే చంద్రబాబు సహా టీడీపీ నేతలంతా మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తాజాగా మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రేలాపనలే ఇందుకు నిదర్శనమని అన్నారు.

దొంగ ఓట్లతోనే కుప్పంలో బాబు గెలుపు

చంద్రబాబు ఇప్పటి వరకు దొంగ ఓట్లతోనే కుప్పంలో గెలుపొందుతూ వచ్చారని మంత్రి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిష్పక్షపాతంగా జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీకి ఘోర పరాభవం ఎదురైన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం కాబోతున్నాయని చెప్పారు. ఈసారి కుప్పంలో చంద్రబాబుకు కూడా ఓటమి తప్పదన్నారు. నాలుగేళ్లలో సంక్షేమాభివృద్ధి నేరుగా దళితుల ఇంటి తలుపులు తడుతోందని స్పష్టం చేశారు. దళిత సంక్షేమంపై తాము చర్చకు సిద్ధం అని చెప్పారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం కుప్పంలోనే కుప్పకూలిపోయిన వాస్తవాన్ని గుర్తించాలని కోరారు. 2024 ఎన్నికల్లో సైతం 2019 ఫలితాలే పునరావృతం అవుతాయని, టీడీపీకి మరోసారి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

నేడు జగనన్న విద్యా దీవెన సాయం

- ఏప్రిల్-జూన్ 2023 త్రైమాసికానికి 9,32,235 మంది విద్యార్థులకు లబ్ధి
- 8,44,336 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.680.44 కోట్లు జమ
- నగరిలో బటన్ నొక్కి విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి/సాక్షి చిత్తూరు: జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా ఏప్రిల్-జూన్ 2023 త్రైమాసికానికి సంబంధించి 9,32,235 మంది విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారు. చిత్తూరు జిల్లా నగరిలో బటన్ నొక్కి రూ.680.44 కోట్లను 8,44,336 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమచేయనున్నారు. ఇదే సందర్భంలో నగరిలో సుమారు రూ.31 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సుల నిమిత్తం ఆయా కళాశాలలకు చెల్లించే ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. హాస్టళ్లలో ఉంటూ చదువుకునే విద్యార్థులు భోజన, వసతి ఖర్చుల కోసం ఇబ్బందిపడకుండా ఏటా రెండు వాయిదాల్లో ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తోంది. తాజాగా విడుదల చేస్తున్న సాయంతో పాటు ఇప్పటివరకు జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.15,593 కోట్లు ఖర్చుచేసింది. మొత్తం మీద నాలుగేళ్లలో విద్యారంగంపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.69,289 కోట్లు ఖర్చుపెట్టింది.

లోఫర్ లోకేశ్.. అని నేననగలను..

- కానీ, సంస్కారం అడ్డొస్తోంది
- యువగళం పాదయాత్ర అట్టర్ ఫ్లాప్
- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడు: లోఫర్ లోకేశ్ అని తానూ అనగలనని, అయితే అలా మాట్లాడే వ్యక్తిత్వం తనది కాదని, ఎందుకంటే తనకు సంస్కారం ఉందని స్థానిక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నారా లోకేశ్‌పై మండిపడ్డారు. ఏలూరు జిల్లా ముసునూరులో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో తన కుమారుడిని కేటుగాడని అనడంపై ఆదివారం ఎమ్మెల్యే విలేకర్ల సమావేశం నిర్వహించి లోకేశ్ తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. దమ్ముంటే నూజివీడు సెంటర్‌కొచ్చి కేటుగాడని మాట్లాడతావా అని సవాల్ చేశారు. తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, నిన్ను ఎన్నికల్లో పోటీచేసిన తొలిసారే ప్రజలు తన్ని తరిమేశారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. నిజానిజాలు తెలుసుకోకుండా నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. నూజివీడు వచ్చి రౌడీయిజం చేయాలని ప్రయత్నించినా, ప్రోత్సహించినా ఉక్కుపాదంతో అణిచివేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

లోకేశ్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్

లోకేశ్ యువగళం పేరుతో నిర్వహించిన పాదయాత్ర నూజివీడు నియోజకవర్గంలో అట్టర్‌ఫ్లాప్ అయిందని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ చెప్పారు. కనీసం వెయ్యి మంది కూడా లోకేశ్ వెంట నడవలేదని ఎద్దేవా చేశారు. ఇక నియోజకవర్గంలో ఇసుకను దోచుకున్నది, నీరు-మట్టి పథకంలో మట్టిని దోచుకున్నదీ ఎవరో కూడా నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. భూకబ్జాలంటూ చెబుతున్నారని, ఎక్కడ భూకబ్జా చేస్తున్నానో చూపిస్తే అదే భూమిని చంద్రబాబుకు, లోకేశ్‌కు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు రాసిస్తానన్నారు. ఇక మాగంటి బాబు సినిమాల్లో నటిస్తే బెటరని, బాగా రాణిస్తారని ఎమ్మెల్యే ప్రతాప్ ఎద్దేవా చేశారు. శనివారపుపేట నుంచి బ్లేడ్ బ్యాచ్‌ను తీసుకొచ్చారని అంటున్నారని, రాష్ట్రంలో బ్లేడ్‌బ్యాచ్‌ల అడ్రస్‌లు, పేకాట క్లబ్‌లు, లిక్కర్ మాఫియా అడ్రస్‌లు మాగంటి బాబుకు తెలిసినంతగా మరెవరికీ తెలియవన్నారు. లోకేష్ రాజకీయాలకు పనికిరాడని, టీడీపీ ఇక అధికారంలోకి రాదని మేకా ప్రతాప్ చెప్పారు.

టీడీపీ నేతలపై చర్యలు తీసుకోండి

చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడిపై వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు



హుకుంపేట ఎస్ఐ సతీష్‌కు ఫిర్యాదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాంబిల్లి (అనకాపల్లి జిల్లా)/హుకుంపేట (అల్లూరి సీతారామరాజు జిల్లా)/సబ్బవరం(అనకాపల్లి): రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఆ పార్టీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం నేతలు పలుచోట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం నేతలు రేబాక రాము, ఐడి బాబు.. అల్లూరి జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్ ఆదివారం వేర్వేరుగా రాంబిల్లి, సబ్బవరం, హుకుంపేట పోలీసులను కలిసి పరిస్థితి వివరించారు. ఉద్దేశ పూర్వకంగా రెచ్చగొట్టేలా మాట్లాడుతూ కుట్రలకు యత్నిస్తున్నారని చెప్పారు. హుకుంపేటలో ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్‌సీపీ నేతలు కోటాన రాము, పాలిశెట్టి సురేష్ రాజ్, పల్ల కృష్ణ, బోరయ్య ఉన్నారు.

పాదయాత్రలో నోరెత్తని లోకేశ్

- గందరగోళం సృష్టిస్తున్న లోకేశ్ వ్యాఖ్యలపై ఫిర్యాదుల నేపథ్యంలో నోటికి తాళం
- 11 కిలోమీటర్ల మేర అభివాదంతో సరి



మహిళతో లోకేశ్ కరచాలనం

లింగపాలెం: యువగళం పాదయాత్ర పేరుతో గందరగోళం సృష్టిస్తున్న టీడీపీ నేత నారా లోకేశ్ వ్యాఖ్యల తీరుపై పోలీసులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆయన నోటికి తాళం పడింది. ఆదివారం ఏలూరు జిల్లాలో జరిపిన యువగళం పాదయాత్రలో ఆయన ఎక్కడా నోరెత్తలేదు. తొలుత ఏలూరు జిల్లా ముసునూరు మండలం వలసపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర చింతలపూడి నియోజకవర్గ పరిధిలోని లింగపాలెం మండలం ధర్మాజీగూడెం నుంచి మఠంగూడెం మీదుగా సాగింది. సుందరావుపేట వద్ద ఏర్పాటు చేసిన బస స్థలానికి రాత్రి 9.15 గంటలకు లోకేశ్ చేరుకున్నారు. సుమారు 11 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర సాగినా.. ఏ ఒక్క గ్రామంలోనూ లోకేశ్ ఉపన్యాసం చేయకుండా ప్రజలకు అభివాదం చేసుకుంటూ.. దండం పెట్టుకుంటూ ముందుకు సాగిపోవడం గమనార్హం. ఇటీవల ఎన్టీఆర్ జిల్లాలో కార్యకర్తలను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ.. కార్యకర్తలపై ఎన్ని కేసులుంటే అంత పెద్ద నామినేటెడ్ పదవి ఇస్తామని, కనీసం ఒక్కొక్కరికీ 100 కేసులైనా ఉండాలని రెచ్చగొట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రీతిలో కార్యకర్తలను ఉసిగొల్పుతున్న నేపథ్యంలో ఎక్కడికక్కడ ఆయనపై భారీ ఎత్తున పోలీసులకు ఫిర్యాదు అందాయి. దీంతో గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలూ తలెత్తకుండా ముందుగానే పోలీసులు పాదయాత్రతో వచ్చిన యువగళం టీమ్ సభ్యుల వెంట ఉండి.. వారు ఎక్కడా ఆగకుండా ముందుకు పంపించివేశారు. టీమ్ సభ్యులు గ్రామాల్లో ప్రజల వద్ద నిలబడటంతో పోలీసులు ఎక్కడికక్కడ వారిని నిలువరించారు. 'ఇక్కడ ఎందుకు నిలబడ్డారు. ముందుకు వెళ్లిపోండి' అని పోలీసులు అనడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వస్తారని ఉన్నాం అని యువగళం టీమ్ సభ్యులు సమాధానం ఇవ్వడం గమనార్హం. 'ఎవరూ రాకుండా.. ఎలాంటి ఘటనలు జరగకుండా మేం చూసుకుంటాం. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించకుండా మీరు వెళ్లిపోండి' అంటూ ఎక్కడికక్కడ డీఎస్పీ, సీఐలు, ఇతర పోలీస్ సిబ్బంది యువగళం టీమ్ సభ్యులను పంపించివేశారు.

టీడీపీ దౌర్జన్యాలు, కుట్రలపై హైకోర్టులో పిల్ వేస్తాం

- చంద్రబాబు, లోకేష్ వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం
- పేదలు ఆర్థికంగా ఎదగడం టీడీపీకి ఇష్టం లేదు
- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్ రెడ్డి



మాట్లాడుతున్న మనోహర్ రెడ్డి

అనంతపురం క్రైం: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించేందుకు చంద్రబాబు, లోకేష్ కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్ రెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్‌ల విద్వేషపూరిత ప్రసంగాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఇటీవల పుంగనూరులో జరిగిన ఘటన ఇందులో భాగమేనని స్పష్టం చేశారు. విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్న చంద్రబాబు, లోకేష్, ఇతర నాయకులపై హైకోర్టులో పిల్ దాఖలు చేస్తామని హెచ్చరించారు. ఆదివారం ఆయన అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పుంగనూరు వద్ద పోలీసులపై టీడీపీ కార్యకర్తలతో దాడి చేయించి, తమపైనే పోలీసులు దాడికి పాల్పడ్డారంటూ రివర్స్ డ్రామాకు తెరలేపారని విమర్శించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశారో.. భవిష్యత్తులో ఏమి చేస్తారో చెప్పకుండా ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడమే లక్ష్యంగా టీడీపీ నీచ రాజకీయం చేస్తోందని ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాలను కోర్టుల ద్వారా అడ్డుకునేందుకు టీడీపీ నిరంతరం కుట్రలు చేస్తోందని, ఈ క్రమంలో దాదాపు 200 వ్యాజ్యాలు వేయించిందని తెలిపారు. పేదలు ఆర్థికంగా ఎదగడం టీడీపీకి ఇష్టం లేదన్నారు. ఉరవకొండలో 4,800 మంది మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలని వైఎస్సార్‌సీపీ విజ్ఞప్తి చేస్తే.. వాటిని కొనసాగించాలని ఎమ్మెల్యే కేశవ్ పట్టుబట్టడం ఎందుకోసమని ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉమాపతి, నాయకులు కే నాగిరెడ్డి, కే నరసింహారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, లీగల్ సెల్ నగరాధ్యక్షుడు వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.



ఒంటరిగా వస్తాము. ఒంటరిగానే పోతాము.
మధ్యలో ఎందుకు మనం ఒంటరిగా ఉండాలి?!
– డైయొజినీజ్

సాక్షి
సోమవారం, 28 ఆగస్టు 2023

కాసింత కపటం

'నిజాన్ని పోలిన అబద్ధమాడి డబ్బు సంపాదించాలి' అంటాడు 'కన్యాశుల్కం'లో రామప్ప పంతులు. అందుకు 'నమ్మినచోట మోసం, నమ్మని చోట లౌక్యం' ప్రదర్శించాలంటాడు. కన్యాశుల్కం మలికూర్పు 1909లో జరిగింది కనుక రచనాకాలం ఇదమిత్థంగా తెలియకపోయినా ఇందులోని పాత్రలన్నీ 1880– 1910 కాలం నాటివి. అంటే నాటి మనుషుల జీవనాన్ని తెలిపేవి. వారు పాటించిన విలువలు, తొక్కగల పాతాళాలు, చూపిన చిత్తవృత్తులు, చేసిన టక్కుటమారాలు, హీనత్వాలు, అల్పత్వాలు... ఇవి తెలియాలంటే కన్యాశుల్కానికి మించిన ఆనవాలు లేదు.

వందేళ్ల కాలం తర్వాత కూడా గురజాడ, ఆయన రచించిన 'కన్యాశుల్కం' వర్తమాన విలువను కలిగి ఉండటానికి నాటకంలో గురజాడ ఎంచుకున్న సాంఘిక సమస్య గాంభీర్యం ఎంత మాత్రం కారణం కాదు. సాంఘిక సంస్కరణ కూడా కాదు. పసిపిల్లలను వృద్ధులకిచ్చి పెళ్లి చేయడం, వితంతువుల పెళ్ళిళ్లు నిరాకరించడం, వేశ్యావృత్తి ప్రబలంగా ఉండటం... వీటి నిరసనగా గురజాడ కన్యాశుల్కాన్ని రాసినా కేవలం ఈ కారణం చేతనైతే నాటకం అవసరం ఏ పదేళ్లకో తీరిపోయి కనుమరుగైపోయేది. కన్యాశుల్కం బతికి ఉన్నదీ... ఇక మీదటా బతికి ఉండేదీ... అది కేవలం మనుషుల నిజ ప్రవర్తనల విశ్వరూపం చూపడం వల్లే!

అగ్నిహోత్రావధాన్లకు మెరకపొలం ఉంది. భార్య వెంకమ్మ పసుపూ కుంకాలతో తెచ్చిన పొలమూ ఉంది. ఇరుగింటి గోడ, పొరుగింటి గోడ తనదేనని దబాయించి కలుపుకుంటున్నాడు. పెద్ద కూతురు బుచ్చమ్మను పదిహేను వందలకు అమ్మి, ఆమె విధవగా మారగా తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. బుచ్చమ్మ (చనిపోయిన) మొగుడి భూముల్లో వాటా కోసం దావా కూడా తెచ్చాడు. ఇన్ని ఉన్నా బంగారం లాంటి, పసిమొగ్గ వంటి చిన్నకూతురు సుబ్బిని పద్దెనిమిది వందలకు అమ్మడానికి సిద్ధమయ్యాడు– అరవై దాటిన, కాటికి కాళ్లుజాపుకున్న లుబ్ధావధాన్లకు! కొడుకు వెంకటేశం పెళ్లి జరగాలంటే చంటిదాన్ని అమ్మాల్సిందేనట. ఈ కాఠిన్యం, కపటత్వం ఎంత వెలపరం!

ఇక కపటుల వరుస చూడండి. డబ్బుపై యావ తప్ప వేరే ఏ లిటిగేషన్ ఎరగని ముసలి లుబ్ధావధాన్లను పెళ్లికి ఎగదోసి, అతగాడు పిల్లకు పుస్తె గట్టి ఇంటికి తెచ్చుకుంటే గనక తన ఇలాకా చేసుకుందామని ఆరాటపడుతుంటాడు ఉమనైజర్ రామప్పపంతులు. అప్పటికే అతడు లుబ్ధావధాన్ల పెద్ద కూతురు మీనాక్షిని లొంగదీసుకున్నాడు. మధురవాణిని ఉంచుకున్నాడు. చాలక అన్నెం పున్నెం ఎరగని పసిపిల్లను కబళించేందుకు లుబ్ధావధాన్ల హితం పలుకుతుంటాడు. గిరీశం ఇంతకన్నా దిగదుడుపు. స్త్రీలపై పడి బతుకుతాడు. పూటకూళ్లమ్మను ఉంచుకుని, ఆమె సరుకుల కోసం దాచుకున్న 20 రూపాయలను కాజేసి మధురవాణికిచ్చి ఆమెను ఉంచుకుంటాడు. సరైన పెద్దమనిషి దొరికితే 'మధురవాణి లాంటి ఇరవై మందిని సప్లై చేస్తానంటా'డు. బుచ్చమ్మ మీద కన్నేసి, విడో మేరేజీ పేరుతో ఆమెను నగానత్రాతో ఉడాయించుకు పోవాలని చూస్తాడు. గిరీశానికి ఇంగ్లిష్ వచ్చు. శ్రమ రాదు. చదువు ఉంది. నీతి లేదు.

మేనకోడలైన సుబ్బిని కాపాడటానికి రంగంలో దిగిన కరటక శాస్త్రికి ఎన్ని సదుద్దేశాలున్నా అతడు మధురవాణికి పాత గిరాకీ. 'ఎవరూ లభ్యం కాకపోతే నేను యాంటీ నాచే' అంటాడు. ఇక ఆవు నెయ్యైనా ఇస్తాగానీ ఖూనీ కేసులో చిక్కుకున్న లుబ్ధావధాన్ల తరఫున సాక్ష్యం చెప్పననే పొలిశెట్టి, లేని దెయ్యాలను సీసాలో బంధించే గవరయ్య, హరిద్వార్‌లో మఠం కడతానని చిల్లర చందాలతో సాయంత్రాలు సారా కొట్లో గడిపే బైరాగి, కేసుంది అనగానే ఎంతొస్తది అనే కానిస్టేబు, చదవక తండ్రిని మోసం చేసే వెంకటేశం... కపటులు.

మనుషులు బతకాలి. బతకడం ముఖ్యమే. అందుకై కాస్తో కూస్తో కపటత్వం అవసరం కావచ్చుగాని అందులోనే సోయి మరిచి కొట్టుకుపోవడమా? తెల్లారి లేస్తే కుత్సితాలు చేస్తూ, ఎదుటివారి నెత్తిన చేయి పెడ్తూ, ఇతరుల కీడు కోరుతూ, బాగా గడుస్తూ ఉన్నా అత్యాశకొద్దీ విలువలు కాలరాస్తూ, పై అంతస్తుకు చేరేందుకు అయినవారిని కాలదంతూ, కేసులూ కోర్టులని తిరుగుతూ... ఆ కాలం మనుషులను తలుచుకుని గురజాడ– సౌజన్యారావు పంతులు రూపంలో కాసింత చింతిస్తూ 'చెడ్డలో కూడా మంచి ఉండదా' అంటాడు. 'ఉన్నవారు వీరే. వీరిలో మంచి వెతికి సర్దుకుపోక తప్పదు' అనే అర్థంలో! కాని నేటి రోజులు చూస్తుంటే ఆనాటి కపటులంతా మహానుభావులు అనిపించక మానదు. నేటి మనుషులకు కిందా మీదా పడి బతకడం రావడం లేదు. కపట జీవన సౌందర్యం తెలియడం లేదు. అసలు అంత ఓర్పు లేదు. చెడి బతికినా, బతికి చెడినా... బతకడం ముఖ్యం అనుకోవడం లేదు. చంపు లేదా చావు... అని క్షణాల్లో క్రూరత్వానికి తెగబడుతున్నారు.

గురజాడ నేడు 'కన్యాశుల్కం' రాస్తే బుచ్చమ్మ, వెంకమ్మ కలిసి అగ్నిహోత్రావధాన్లకు విషం పెడతారు. లుబ్ధావధాన్ల పీక నొక్కి మీనాక్షి ఆస్తిపత్రాలతో పారిపోతుంది. చీటికి మాటికి తార్చి బతుకుతున్నాడని గిరీశం నిద్రలో ఉండగా మధురవాణి ఖూనీ చేస్తుంది. రామప్ప పంతులు 'పోక్సో' కింద అరెస్ట్ అవుతాడు. వెంకటేశం డ్రగ్స్ కేసులో పట్టుబడతాడు. దారుణం అనిపించవచ్చుగాని పేర్లను మారిస్తే ఇవాళ్టి వార్తలు ఇవే! ఆగస్టు – 'కన్యాశుల్కం' మొదటిసారి ప్రదర్శించిన మాసం. సినిమాగా రిలీజైన మాసం. మనుషులు పరిహాసం ఆడదగ్గ అల్పత్వాలతోనే జీవించాలని, ఈసడించుకునే స్థాయి కపటత్వంతోనే బతకాలని, భీతి కలిగించే రాక్షస మనస్తత్వాలకు ఎన్నటికీ చేరకూడదని కోరుకునేందుకు ఈ మాసం కంటే మించిన శుభతిథి ఏముంది – నెలాఖరైనా?

ప్రైమరీలను వేడెక్కిస్తున్న భారతీయులు

విశ్లేషణ



లవ్ పురి

నార్త్ కరొలైనా మాజీ గవర్నరు నిక్కీ హేలీ, 38 ఏళ్ల పారిశ్రామిక వేత్త వివేక్ రామస్వామి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రైమరీ ఎన్నికలకు పోటీ పడుతున్నారు. అధిక సంఖ్యాకవాద రాజకీయాలకు, వివక్షాపూరిత విధానాలకు బాధితులైన మైనారిటీ సమూహాలను డెమొక్రాటిక్ పార్టీ తన ప్రగతిశీల సిద్ధాంతాలతో దరికి చేర్చుకుంటుందన్న వాస్తవానికి విరుద్ధంగా ఉంది – భారతీయ అమెరికన్‌లు ఇలా రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడటం! రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా ఈ భారతీయ అమెరికన్‌లు పోటీకి నిలిచే అవకాశం లేకపోవచ్చు. అయినప్పటికీ వీరి ఆలోచనలు అమెరికా రాజకీయ నేపథ్య దృశ్యానికి భిన్నంగా ప్రాముఖ్యాన్ని కలిగి ఉన్నాయి.

అమెరికా అధ్యక్ష ఎన్నికలకిది ముందరి ఏడాది కావడంతో అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే 'ప్రైమరీ'లు (ప్రాథమిక ఎన్నికలు) రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. యూఎస్‌లో 40 లక్షల మంది భారతీయ అమెరికన్‌లు ఉన్నారు. యూఎస్ మొత్తం జనాభాలో ఇది దాదాపుగా 1.3 శాతం. యూఎస్ కాంగ్రెస్‌లో గత దశాబ్ద కాలంలో ఐదుగురు భారత సంతతి అమెరికన్‌లు ప్రతినిధులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో నార్త్ కరొలైనా మాజీ గవర్నరు, ఐక్యరాజ్యసమితిలో యూఎస్ శాశ్వత ప్రతినిధి అయిన నిక్కీ రణ్‌ధవా హేలీ... రిపబ్లికన్ అభ్యర్థిత్వం కోసం ప్రైమరీ ఎన్నికలకు పోటీ పడుతున్నారు. ఆమె పాలనా సామర్థ్యానికి ఇప్పటికే అనేక నిరూపణలు ఉన్నాయి.

బయోటెక్స్ స్టార్టప్‌ను స్థాపించి, విజయవంతంగా నడిపిస్తున్న 38 ఏళ్ల భారతీయ సంతతి పారిశ్రామిక వేత్త వివేక్ రామస్వామి కూడా ప్రస్తుతం వెలుగులో ఉన్నారు. అతడు డబ్బు వరదలో కొట్టుకుని పోతున్నవాడు. అమెరికా గుండెకాయగా పేర్గాంచిన మిడ్‌వెస్ట్ ప్రాంతంలో పెరిగి పెద్దవాడైనవాడు. ఐవీ లీగ్ ప్రావీణ్యాలతో పరిపుష్టమైనవాడు. ప్రఖ్యాత మీడియా సంస్థలు ఆయన గురించి రాశాయి. ఆయన కథనాల్లో అతిశయోక్తి కనిపించవచ్చు. కానీ ఓటర్లు ఏం కోరుకుంటున్నారన్న విషయమై ఆయనకు చక్కటి అంచనా ఉంది.

అత్యధిక సంఖ్యలో డెమోక్రాట్‌ల వైపున ఉన్న యూఎస్‌లోని ప్రవాస భారతీయులకూ, ఇతర అల్పసంఖ్యాక వర్గాలకూ రామస్వామి ఆలోచనలు గిట్టనివే కావచ్చు. పని ప్రదేశాలలో వైవిధ్యానికి వ్యతిరేకంగా ఆయన మాట్లాడతారు. అదే సమయంలో వైవిధ్యభరితమైన ఆలోచనలను ఇష్టపడతానని చెబుతుంటారు. వైవిధ్య వ్యతిరేకతకు 'తెలివి'ని జోడించడం ఇది. రామస్వామి ఒక రాజ్యాంగ సవరణను కూడా ప్రతిపాదిస్తున్నారు. ఆ ప్రకారం 18–24 ఏళ్ల మధ్య వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే యూఎస్ ప్రభుత్వ స్వరూప స్వభావాలలోని ప్రాథమిక అంశాలపై వారెంత అవగాహనను కలిగి ఉన్నారో నిర్ణయించే 'సివిక్స్ టెస్ట్'ను ఉత్తీర్ణులై ఉండాలి. మళ్లీ ఇదొక పైకి మంచిగా కనిపించే కపటపూరితమైన ఆలోచన. ఈ వయఃపరిమితిలో ఉన్న జనాభాలో ఎక్కువమంది డెమోక్రాట్‌లకు మద్దతు ఇస్తుంటారు. రిపబ్లికన్‌లకు మద్దతు ఇచ్చేవారిలో మధ్య వయస్కులు అత్యధికం. 'సివిక్స్ టెస్ట్' నిర్వహణ ద్వారా యువజనుల ఓటర్లలో తగ్గించగలిగినంత మందిని తగ్గిస్తే రిపబ్లికన్‌లకు ప్రయోజనం చేకూర్చవచ్చన్నది రామస్వామిలోని మరో ఆలోచనా వైవిధ్యం.

అయితే రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా ఈ భారతీయ అమెరికన్‌లు పోటీగా నిలిచే అవకాశం లేకపోవచ్చు. అయినప్పటికీ వీరి ఆలోచనలు అమెరికా రాజకీయ నేపథ్య దృశ్యానికి భిన్నంగా ప్రాముఖ్యాన్ని కలిగి



వివేక్ రామస్వామి, నిక్కీ హేలీ

ఉన్నాయి. సాధారణంగా డెమోక్రాట్‌లకు ఓటు వేస్తుండే భారతీయ అమెరికన్‌లు ఎందుకని రిపబ్లికన్ పార్టీ ద్వారా ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు?

అధిక సంఖ్యాకవాద రాజకీయాలకు, పర్యవసాన వివక్షాపూరిత విధానాలకు బాధితులైన మైనారిటీ సమూహాలను డెమొక్రాటిక్ పార్టీ తన ప్రగతిశీల సిద్ధాంతాలతో దరికి చేర్చుకుంటుందన్న వాస్తవానికి విరుద్ధంగా ఉంది – భారతీయ అమెరికన్‌లు ఇలా రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడటం! ఈ సందర్భంలో ఎవరైనా యూఎస్‌కు భారతీయుల వలస వెనుక ఉన్న ప్రత్యేక అంశాల మీద, వారు ఏ సామాజిక స్థాయుల నుంచి వలస వచ్చారనే దాని మీద దృష్టిపెట్టడం అవసరం.

భారతీయుల వలసల్లోని మొదటి దశ ప్రధానంగా 20వ శతాబ్దపు ప్రారంభ సంవత్సరాలలో శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఆధునిక టెక్ హబ్ ద్వారా మొదలైంది. ఆసియా సంతతి వారిపై ఉన్న చట్టపరమైన పరిమితుల కారణంగా నాటి వలసదారులు సంఖ్యాపరంగా స్వల్పంగా ఉన్నారు. రైలు–రోడ్ల పనులు, కలప డిపోలు, వ్యవసాయ పొలాల్లో ఉపాధిని వెతుక్కున్నారు. ఆఖరికి కాంగ్రెస్ సభ్యుడు దలీప్ సింగ్ సౌంద్ కూడా 1924లో బర్కిలీలోని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందినప్పటికీ, యూఎస్ ప్రభుత్వం పౌరసత్వాన్ని నిరాకరించిన కారణంగా 1949 వరకు రైతుగా పని చేయవలసి వచ్చింది. అమృత్‌సర్‌లో జన్మించిన దలీప్ 1956లో డెమోక్రాటిక్ పార్టీ టికెట్‌పై క్యాలిఫోర్నియా నుంచి యూఎస్ కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. అలా ఎన్నికైన మొదటి ఆసియా – అమెరికన్, మొదటి భారతీయ–అమెరికన్, మొదటి సిక్కు మతస్థుడు దలీప్.

1965 అక్టోబర్ 3న అప్పటి అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్ ఇమిగ్రేషన్ బిల్లుపై సంతకం చేయడంతో ఆసియా దేశాల నుండి వచ్చే వలసలపై ఉన్న నిబంధనలు తొలగిపోయాయి. ఆ తర్వాత వలస వచ్చి తమ విజయాలతో గుర్తింపు పొందిన అనేక ఆసియా సమూహాల పిల్లల్లో భారతీయ అమెరికన్‌ల సమూహంలోని పిల్లలు అధికంగా ఉన్నారు. ఇది భారతీయులలోని ఉన్నత విద్యావంతులు యూఎస్‌లో చదువుకోడానికి, ఉద్యోగాలు చేయడానికి తోడ్పడింది. వారిలో చాలామంది స్కాలర్‌షిప్‌లపై అక్కడికి వెళ్లారు. వారిని జర్నలిస్ట్ అనితా రాఘవన్ తన పుస్తకం 'ది బిలియనీర్స్ అప్రెంటిస్: ది రైజ్ ఆఫ్ ది ఇండియన్ – అమెరికన్ ఎలీట్ అండ్ ది ఫాల్ ఆఫ్ గాలియన్ హెజ్ ఫండ్'లో 'రెండుసార్లు ఆశీర్వదించబడిన తరం'గా చేసిన అభివర్ణన ఎంతో ప్రసిద్ధి చెందినది. యూఎస్ వలస చట్టాల సడలింపు వల్లా, స్వాతంత్ర్యానంతరం విద్యారంగంపై భారత్ అపారంగా పెట్టుబడులు పెట్టడం వల్లా రెండు రకాలుగా లబ్ధి పొందిన తరం అది.

1995 తర్వాతి కాలంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన కార్మికులకు ఏర్పడిన డిమాండు, ఆ తర్వాత వై2కె మైగ్రేషన్ ప్రాజెక్టుతో... వలసలు అకస్మాత్తుగా విస్ఫోట స్థాయిలో పెరిగాయి. దాంతో పాటుగా భారత దేశంలో అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లపై యూఎస్‌లో ఆసక్తి ఏర్పడింది. ఇది చాలామంది ఆర్థిక నిపుణులకు ద్వారాలను తెరిచింది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణిత అంశాలలో బలమైన నేపథ్యం, ఆంగ్ల భాషపై క్రియాత్మక అనర్గళత ఉండి హెచ్–1బి నాన్ ఇమిగ్రెంట్ వీసా ప్రోగ్రామ్ కింద దరఖాస్తు చేసుకుని అమెరికా వెళ్లినవారిలో దాదాపు 75 శాతం మంది భారతీయులే. వారిలో అనేకమంది దశాబ్దకాల వ్యవధిలో అమెరికన్ పౌరులుగా మారారు. 2000 తర్వాత, లేదా గత 10 సంవత్సరాలలో వలసవెళ్లినవారు యూఎస్‌లో శాశ్వత నివాసులుగా ఉంటూ, ప్రస్తుతం పౌరసత్వం పొందే దారిలో ఉన్నారు.

వలసల విశిష్టతల దృష్ట్యా భారతీయ అమెరికన్‌లు రెండు పార్టీలలోనూ ప్రాతినిధ్యం వహించే ధోరణి ఎంత ఎక్కువ మంది పౌరసత్వం పొందితే అంతగా పటిష్ఠం అవుతుంది. ఇతర మైనారిటీ సమూహాల పోరాటం చాలామంది యువ భారతీయ అమెరికన్‌ల జీవితాలలో ప్రతిబింబించదు. ఎందుకంటే వీరంతా ఉన్నత విద్యావంతులైన మొదటి తరం భారతీయ అమెరికన్ తల్లిదండ్రులకు జన్మించినవారు. నాణ్యమైన విద్య, సమయపాలన, అందుబాటులో ఉన్న పర్యావరణ వ్యవస్థల మద్దతుతో ఈ యువ బృందం ఆర్థికంగా లాభదాయకమైన అనేక వృత్తిపరమైన రంగాలలో విజయం సాధించింది.

జెనరేషన్ జడ్, లేదా మిలీనియల్ జనరేషన్ నుంచి కొందరు తక్కువ ఆదాయ పన్ను, ప్రైవేట్ హెల్త్ కేర్ వంటి విధానాలకు మద్దతు ఇస్తున్నారు. ఇతర మైనారిటీ సమూహాలకు భిన్నంగా సంక్షేమ పథకాల పట్ల వీరికి వ్యతిరేకత కూడా ఉండవచ్చు. భారతీయ అమెరికన్‌ల రాజకీయ పొత్తులు యూఎస్‌లోని ఇతర మైనారిటీ సమూహాల రాజకీయాలపై మన అవగాహన నుండి ఉత్పన్నం అయినవైతే కాదు.

వ్యాసకర్త జర్నలిస్టు, రచయిత
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సరైన పోలిక



వ్యక్తిగత జీవితంలోని తమ త్యాగాలను ప్రధాని మోదీ ప్రశంసించారని చెబుతూ... "ఒక తల్లిగా, ఇస్రో సైంటిస్టుగా ప్రజ్ఞాన్ రోవర్ నాకు నా బిడ్డలానే అనిపిస్తోంది..." అని రీమా ఫెుష్ మీడియాతో అనడం నాకు చాలా గొప్పగా అనిపించింది. రీమాకు శుభాభినందనలు.

– రోజీ, న్యాయవాది

అసలు పాయింట్



మోదీజీ చంద్రయాన్–3కి శివశక్తి పాయింట్ అని, చంద్రయాన్–2కి తిరంగా పాయింట్ అని పేరు పెట్టారు. చంద్రయాన్–1కి మాత్రం కాంగ్రెస్ వాళ్లు జవహర్ పాయింట్ అని పేరు పెట్టారు. యూపీఏ కనుక అధికారంలో ఉండి ఉంటే చంద్రయాన్–2,చంద్రయాన్–3లకు ఇందిర, రాజీవ్ పాయింట్‌లు అని నామకరణం జరిగి ఉండేది.

– షెహజాద్ పూనావాలా, బీజేపీ ప్రతినిధి


వేద శాస్త్రాలు



వేదాలు శాస్త్రీయం కాదనే చెత్తను మీ తలలోంచి తొలగించండి. పురావస్తు శాస్త్రం ప్రకారం రుగ్వేదం అత్యంత పురాతన విజ్ఞాన గ్రంథమని ముందుగా తెలుసుకోవాలి. సైన్స్‌కన్నా ముందే వేద మంత్రాలు నిరూపించిన శాస్త్ర విషయాలు ఎన్నో ఉన్నాయి.

– అన్షుల్ పాండే, కాలమిస్ట్

అదే నిజమైతే..!



నేహా పబ్లిక్ స్కూల్‌కు చెందిన తృప్తా త్యాగి తన క్లాస్ రూమ్‌లోని ఒక ముస్లిం విద్యార్థిని కొట్టమని మిగతా హిందూ విద్యార్థులను కోరడం నిజమే అయితే యోగి నోరు విప్పుతారా? మోదీ దీనిని బహిరంగంగా ఖండిస్తారా? ఆ టీచర్‌పై విచారణ జరుగుతుందా? లేక, ద్వేష ప్రేరేపిత సంస్కృతిని ఇలా వృద్ధి చెందనిస్తూనే ఉంటారా?

– కపిల్ సిబల్, రాజ్యసభ ఎంపీ

ఎక్కువ శాతం




మణిపుర్ సంక్షోభానికి కారణం కేంద్ర ప్రభుత్వం అని 30 శాతం మంది అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే దోషి అని 25 శాతం మంది నిందిస్తున్నారు. స్థానిక కారణాలని 20 శాతం అంటున్నారు. మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన ఉండాలని 44 శాతం మంది కోరుకుంటున్నారు.

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

భాషా, సామాజిక సంస్కర్త

వ్యావహారిక భాషోద్యమానికి సారథ్యం వహించిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు సామాజికోద్యమ సారథి కూడా! సామాన్య జనులకు అర్థమయ్యేలా గ్రంథ రచనలు వాడుకభాషలో సాగాలని పోరాటం సాగించడం ద్వారా సామాజిక సంస్కరణోద్యమానికి నాంది పలికారు. 'గ్రాంథికభాష గ్రంథాలలో కనబడేదే కాని వినబడేది కాదని' బల్లగుద్ది మరీ వాదించేవారు. ఏ సమాజం అభివృద్ధి చెందాలన్నా, ముందుగా భాషాభివృద్ధి జరగాలి. అయితే గ్రాంథికంలో భాషాభివృద్ధి జరిగితే పండితులే లబ్ధి పొందుతారు తప్ప, పామరులకు ఎంతమాత్రం ఉపయోగం ఉండదు. అందుకే పామరులకు కూడా అర్థమయ్యే వాడుక భాషలోనే వ్యవహారాలన్నీ జరగాలని ఎలుగెత్తి చాటిన మహనీయుడు గిడుగు.



గిడుగు రామమూర్తి పంతులు

సవరలు, దళితులను అంటరానివారిగా భావించే ఆ కాలంలో సవర విద్యార్థులకు తన ఇంట్లోనే బస ఏర్పాటు చేయించి భాషా బోధన గావించడం ఆయనలోని సంఘ సంస్కరణ కోణాన్నీ చూపుతుంది. సవర గూడేల్లో తిరుగుతూ వారి భాష నేర్చుకొని, ఆ భాషోద్ధరణకు నడుం బిగించారు. సంఘ సంస్కరణాభిలాషతోనే సవరభాషను ఆయన నేర్చుకున్నారనడంలో అతిశయోక్తి లేదు. సవర భాషలో పుస్తకాలు రాయడంతోపాటు, ఆ భాషలోనే వాళ్లకు చదువు చెప్పే ఏర్పాటు చేశారు. ఈ కృషిలో భాగంగా 1931లో ఇంగ్లీష్‌లో సవర భాష వ్యాకరణాన్నీ, 1936లో సవరభాష నిఘంటువునూ రూపొందించారు. వ్యావహారిక భాషలోనే సామాన్యులకు సైతం మేలు జరుగుతుందనే ఆయన నమ్మకం వమ్ముకాలేదు. ఫలితంగా నేడు అన్నిరంగాల్లో వాడుక భాష వినియోగంలో ఉంది. సామాజికాభివృద్ధి మూలస్తంభాల్లో ఒకటైన పత్రికలు కూడా వాడుక భాషలోనే సమాచారాన్ని అందిస్తున్నాయి.

1930లో ఒడిశా ఏర్పడనున్నప్పుడు, పర్లాకిమిడి రాజా తన పర్లాకిమిడి తాలూకా అంతటినీ ఒడిశా రాష్ట్రంలో చేర్పించడానికి ప్రయత్నించినప్పుడు, తెలుగువారికి నాయకునిగా రామమూర్తి నిలిచి ప్రతిఘటించారు. ఆ తాలూకాలో చాలా భాగాన్నీ, పర్లాకిమిడి పట్టణాన్ని ప్రభుత్వం అక్రమంగా ఒడిశాలో చేర్చడం వల్ల, తెలుగువారికి అన్యాయం జరిగిందని తెలియజేస్తూ ఆయన 1936లో ఒడిశా రాష్ట్ర అవతరణ జరిగే రోజున ఉదయమే పర్లాకిమిడిలో ఉండడానికి ఇష్టపడక, రాజమహేంద్రవరం వచ్చారు. అక్కడే తన శేష జీవితాన్ని గడిపారు. ఇది ఆయనలోని పట్టుదలకూ, రాజీపడని వ్యక్తిత్వానికీ గొప్ప నిదర్శనం.

గిడుగు 1863 ఆగష్టు 29వ తేదీ శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేట గ్రామంలో జన్మించారు. విజయనగరంలోని మేనమామగారి ఇంట్లో ఉంటూ మహారాజావారి ఇంగ్లీషు పాఠశాలలో ఉన్నత విద్యను పూర్తిచేశారు. తేటతెలుగులో రచనలు చేసిన గురజాడ అప్పారావు ఆయనకు సహాధ్యాయి కావడం విశేషం. భాష, సామాజిక ఉద్యమానికి ఎంతో సేవ చేసిన గిడుగు రామమూర్తి 1940 జనవరి 22న కన్నుమూశారు. ఆయన స్ఫూర్తి తెలుగు భాష ఉన్నంతవరకూ వెలుగుతూనే ఉంటుంది.

– పగిడి రంగారావు
(రేపు గిడుగు జయంతి: తెలుగు భాషా దినోత్సవం)

నిరాశా నిస్పృహలతోనే విమర్శలు!

అభిప్రాయం



అడుసుమిల్లి జయప్రకాశ్

ప్రతిపక్షాలు ఎప్పుడైనా సద్విమర్శలు చేయాలి. పాలక పక్షం చేసే నిర్ణయాలపై విశ్లేషణ చేయాలి. అది తప్ప కేవలం రంధ్రాన్వేషణ మాత్రమే చేయడం నేటి ప్రతిపక్షాల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. తమ స్వార్థ ప్రయోజనాల కోసం కార్యకర్తలతో కర్రలు, ఇతర మారణాయుధాలు పట్టించడం, గూండాలను కూడా తమ వెంట తిప్పుకోవడం ఇప్పటి ప్రధాన ప్రతిపక్ష శైలి అయ్యింది.

ఇప్పటి వరకూ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఏం మాట్లాడినా 'అంతా నేనే చేశాను' అనే భావం తొంగిచూసేది. భారత్ బయోటెక్ కనిపెట్టిన కరోనా వ్యాక్సిన్‌కు తాను స్థాపించిన 'జీనోమ్ వ్యాలీ' కారణం అని ఆయన చెప్పుకున్నారు. అంతకు ముందు సెల్ ఫోన్ కనిపెట్టింది తానే అన్నారు. ఇలా అన్న నోరు... బషీర్ బాగ్ కాల్పుల అంశంలో వేరే పలుకు పలుకుతోంది.

ఇటీవలి కాలంలో అయితే ఆయన తన మాట తీరును సమూలంగా మార్చుకున్నారు. ఆశ్చర్యపోకండి... మారింది అంటే మంచిగా అని కాదు. మరింత వికృతంగా! ముఖ్యమంత్రిని 'ఒకసారి రా చూసుకుందాం' అంటారు. మరోసారి 'ఖబడ్దార్' అంటారు. 'నవరత్న' పథకాలను తన సొంతం చేసుకుని వేరే పేర్లతో కొత్త పథకాలను ప్రకటిస్తారు. కొత్తదనం ఏముందయ్యా అంటే... అంతకంటే గొప్పగా, మెరుగ్గా అమలు చేస్తామని చెబుతారు. అవే పథకాలకు పేర్లు మార్చి పెడుతున్నారనీ, అది చూసి ప్రజలు నవ్వుకుంటారనీ కూడా ఆయన వెరవరు. ఎందుకంటే అది ఆయన నైజం.

రెండువేల సంవత్సరానికి ముందు 'విజన్ 2020' అంటూ ఓ డాక్యుమెంటును విడుదల చేశారు. ఆ విజన్ పక్కన పెడితే 2014 దాకా ఆయనకు అధికారమే చిక్కలేదు. ఇప్పుడు అలాంటి మరో కొత్త పల్లవిని అందుకున్నారు. అదే 'విజన్ 2047'. ఆయన అధికారంలోకి వచ్చి 2047 నాటికి తన విజన్‌తో రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చాలనేది ఆయన ఉద్దేశ్యం కావచ్చు. దీన్ని ప్రకటించేటప్పుడు ప్రతిపక్ష నేతకు కనీసం తన వయసు కూడా గుర్తుకు రాక పోవడం విడ్డూరం. ఇలాంటి ఆలోచన తీరుకు కారణం తెలుసుకోవడం అంత కష్టమేమీ కాదు. దాన్నే 'నిరాశ' (ఫ్రస్ట్రేషన్) అంటారు. చేతికి అందిరాని కొడుకు ప్రసంగాలు ఒక పక్క, దూసుకుపోతున్న జగన్ మరోపక్క ... ఇవి చూస్తున్నప్పుడు వచ్చేది అదే కదా! అందుకే పుంగనూరులో విద్వేషం రెచ్చగొట్టేలా ప్రసంగించారు. అల్లర్లు సృష్టించారు. ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమం కూడా ఒక ఫార్సులా మార్చారు. ఇదంతా ఫ్రస్ట్రేషన్ కాదా? ఇలాంటి



తీరుతో ప్రజల్లో పలచనవుతున్నామనే ఇంగితం కూడా మన ప్రతిపక్ష నేతలో లేకుండా పోవడం శోచనీయం.

వచ్చేనెల నుంచి విశాఖ నుంచి పాలన ప్రారంభించబోతున్నారు ముఖ్యమంత్రి జగన్. ఈ పరిణామాన్ని బాబు జీర్ణించుకోలేక పోతున్నారు. అందుకే లేనిపోని ఆరోపణలు, రెచ్చగొట్టే ప్రసంగాలను పెంచుతున్నారు. రాష్ట్రంలో అభివృద్ధే లేదంటున్నారు. ఈ నాలుగేళ్లలో ప్రతిపక్షంలో ఉంటూ చేసిన తప్పులు... ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ఎంచుకున్న పద్ధతులూ మిస్ ఫైర్ అవుతాయనే అభిప్రాయంతోనే... అభివృద్ధి లేదంటూ గగ్గోలు పెడుతున్నారు. ప్రాజెక్టుల అభివృద్ధి, కొత్త ఫిష్ హార్బర్లు, విశాఖలో ఐటీ కంపెనీల ఏర్పాటు బాబుకు కనిపించడం లేదు.

ఆయన ధ్యేయం ఒక్కటే – జగన్ ఏమి చేసినా వ్యతిరేకించడమే! నిర్మాణాత్మక ప్రతిపక్షం అనే పదానికే అర్థం మార్చేశారు ఆయన. పాలక పక్ష ఎమ్మెల్యేలు లేదా నాయకులు ఏపీలో అభివృద్ధి గురించి తప్పు చెబుతున్నారు అనుకుందాం... జరుగుతున్న పనులు కళ్ళకు కనిపించడం లేదా? పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఇప్పుడు ఎంతమేరకు ఉపయోగపడుతోందో బాబు కళ్ళకు కనిపించడం లేదా?

బాబు ఎప్పుడూ నైతిక విలువలు ఆచరించిన చరిత్ర లేదు. తాను అధికారంలో ఉన్నప్పుడు సహకరించాలని కోరుతూనే, ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తన వైపునకు లాక్కున్న సంగతి బాబు మరచినట్లుంది. వైసీపీ ఆ పనికి ఎన్నడూ పాల్పడలేదు. పార్టీలోకి రావాలంటే, పదవికి రాజీనామా చేయాల్సిందే అన్న నియమం పెట్టిన సంగతిని కూడా ఆయన విస్మరించారు. వైసీపీకి మేలు చేకూర్చిన నవరత్న పథకాలకు పేర్లు మార్చి, మేనిఫెస్టోలో పెట్టి, ప్రజలను ఏమార్చాలనే ప్రయత్నాన్ని చంద్రబాబు చేస్తున్నారు. ఇందులో భాగంగానే పర్యటనల వేగాన్ని పెంచారు.

సంక్షేమ పథకాలను ఎన్నికల ముంగిట అమలు చేసే సంస్కృతి చంద్రబాబుది. ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి ప్రజా సంక్షేమానికి కట్టుబడ్డ వర్తమానం జగన్‌మోహన్ రెడ్డిది. ఇద్దరిలో ఓటర్లు ఎవరి వైపు మొగ్గుచూపుతారో అన్ని ఎన్నికల సర్వేలు చెబుతూనే ఉన్నాయి. ఏ సర్వే చూసినా జగన్ ప్రాభవమే కనిపిస్తోంది. అన్ని సీట్లలో గెలవడమే లక్ష్యంగా పెట్టుకోవాలని జగన్ అనుకుంటే... కేవలం ఇరవై మూడు సీట్లున్న చంద్రబాబు కూడా అన్ని అసెంబ్లీ సీట్లూ గెలవాలని లక్ష్యంగా పెట్టుకోవడం హాస్యాస్పదం. ఎక్కడికక్కడే టీడీపీ కార్యకర్తలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ విషయాన్ని బాబు ఇంకా గమనించుకోక పోవడం విడ్డూరం.

వ్యాసకర్త మాజీ ఎమ్మెల్యే
మొబైల్: 98481 28844

నేను కాలాన్ని!

ఇటీవల విడుదలై విశ్వవ్యాప్తంగా అఖండ విజయాన్ని సాధించిన హాలీవుడ్ చలనచిత్రం 'ఒపెన్ హైమర్'లో కథానాయకుడు మన భగవద్గీతలో ఉన్న 'కాలోస్మి లోక క్షయ కృత్...' శ్లోకాన్ని ఉట్టంకించడం, భారతీయులెందరికో ఆశ్చర్యాన్నీ, ఆసక్తినీ కలిగించింది.

'సర్వమూ నేనే! ఈ విశ్వమంతా నేనే సృష్టించి ఇందులో అణువణువునా నేనే వ్యాపించి ఉంటాను' అని గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చాలాసార్లు, చాలా విధాలుగా చెబుతాడు. 'నీ విశ్వ రూపం నేను చూడద్దా?' అని అర్జునుడు ప్రార్థిస్తాడు. మామూలు కళ్ళతో చూసేందుకు సాధ్యం కాదు కనుక శ్రీకృష్ణుడు అర్జును డికి దివ్యచక్షువులు ప్రసాదించి, తన విశ్వ రూపాన్ని ప్రదర్శిస్తాడు. ఆ విరాట్ రూపం అర్జునుడికి భయం కలిగిస్తుంది. ముఖ్యంగా, ప్రాణులెన్నో మంటల్లో దూకి నాశనమయ్యే మిడతలలాగా, ఆ విరాట్ రూపాని కున్న వేలాది నోళ్లలో అతి వేగంగా ప్రవేశించడం చూసి, భయపడిన అర్జునుడు, 'స్వామీ! ఇంతటి ఉగ్ర రూపంతో కనిపిస్తున్న తమరెవరు?' అని అడుగుతాడు.



'కాలోస్మి– నేను కాలాన్ని' అంటాడు శ్రీకృష్ణుడు. భూత వర్తమాన భవిష్యత్తులుగా వ్యాపించి ఉన్న కాలంలో... మామూలు చర్మ చక్షువుతో వర్తమాన మొక్కటే కనిపిస్తుంది. దివ్య చక్షువులిచ్చే జ్ఞాన దృష్టి వల్ల అర్జునుడికి త్రికాలాలూ అనుభవమయ్యాయి. 'కాలోస్మి; లోక క్షయకృత్ ప్రవృద్ధః – నేను కాలాన్ని; ప్రస్తుతం లోక క్షయం కోసం ప్రవృద్ధి చెంది ఉన్నాను. లోకాన్ సమాహర్తుం ఇహ ప్రవృత్తః – జనులను సంహరించే ప్రవృత్తిలో ఇప్పుడిక్కడ ఉన్నాను. ఋతేపి త్వాం, న భవిష్యంతి సర్వే / యే అవస్థితాః ప్రత్యనీకేషు యోధాః – నువ్వీ యుద్ధంలో లేకపోయినా కూడా, నీ శత్రుపక్షంలో ఉన్న ఈ భీష్మాది యోధులెవరైతే ఉన్నారో, అందరూ కాల గర్భంలో కలిసిపోవలసిందే! మిగిలి ఉండేవాళ్లెవరూ లేరు. వీళ్ళందరూ కాలరూపుడినైన నా చేత సంహరించబడ్డ వాళ్ళే అని గ్రహించి, నువ్వు నిమిత్త మాత్రుడివై, నీ కర్తవ్యమైన యుద్ధం చేసి, నీ చేతి మీదుగా వీళ్ళను సంహరించి, రాజ్యం గెలుచుకొని, కీర్తి పొందు. నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్!' అని గీతాచార్యుడి బోధ.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.ద్వాదశి ప.3.27 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.1.22 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.10.21 నుండి 11.51 వరకు, తిరిగి తె.5.05 నుండి 6.32 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.25 నుండి 1.15 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.47 వరకు, **అమృతఘడియలు:** రా.7.21 నుండి 8.52 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.16.

క్లుప్తంగా...

సత్యదేవుని సేవలో కేంద్రమంత్రి భగవంత్



కేంద్ర మంత్రి భగవంత్ ఖుబాకు సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న ఈవో ఆజాద్

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరిపై సత్యనారాయణస్వామిని ఆదివారం కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా దర్శించుకున్నారు. అంతకుముందు కేంద్ర మంత్రికి దేవస్థానం ఈవో చంద్రశేఖర్ ఆజాద్, పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం పండితులు వేదాశీస్సులు ఇవ్వగా.. ఈవో స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం 73 కిలోల బియ్యంతో స్వామివారి తులాభారం తూగి.. అందుకు సమానమైన రూ.2,920 నగదును కేంద్ర మంత్రి చెల్లించారు. అలాగే స్వామివారి కంకణాలు, శాలువాలు, కండువాల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించి.. కంకణం ధరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తోందన్నారు. చంద్రయాన్-3 విజయంతో ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయని చెప్పారు.

శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ ఎన్వీ రమణ



తిరుమల: భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఆదివారం రాత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో జస్టిస్ రమణకు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. ఆ తరువాత శ్రీ బేడి ఆంజనేయ స్వామిని జస్టిస్ ఎన్వీ రమణ దర్శించుకున్నారు.

అన్ని శాస్త్రాలకు మూలం సంస్కృతమే: మల్లాది విష్ణు



సత్యనారాయణపురం (విజయవాడసెంట్రల్): అన్ని శాస్త్రాలకూ మూలం సంస్కృతమేనని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చెప్పారు. విజయవాడ సత్యనారాయణపురంలో సంస్కృత భారతీ-ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంస్కృత భారతీఅఖిల భారత కార్యదర్శి సత్యనారాయణభట్, రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ ప్రాంత అధ్యక్షుడు హరికుమార్, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. మల్లాది మాట్లాడుతూ సంస్కృత భాష మన దేశ సంస్కృతిలో ఒక భాగమని, ప్రతి విద్యార్థీ భారతీయ విజ్ఞాన సంపదను వెలికితీసి ముందుకు తీసుకెళ్లేందుకు సంస్కృతాన్ని నేర్చుకోవాలని సూచించారు. సంస్కృత భాషను కాపాడేందుకు కృషి చేస్తున్నవారికి రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలుంటాయని హామీ ఇచ్చారు.

శ్రీవారి పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపుచేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచసూక్తాలను పఠించారు. అనంతరం పవిత్ర ప్రతిష్ఠ జరిగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.


చంపుతానని బెదిరించడంతో.. బావనే చంపేశాడు

పాల్వంచ రూరల్: అక్కను చంపి జైలుకు వెళ్లివచ్చిన బావ.. తననూ చంపుతానని బెదిరించడంతో బావమరిది ఆయనను హత్య చేశాడు. అనంతరం గుట్టుగా వాగులో పూడ్చిపెట్టాడు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం ఉల్వనూరు జీపీ పరిధి గొత్తికోయ గ్రామం పెద్దకలశలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన వెలుగుచూసింది. పెద్దకలశకు చెందిన బాడిసె సురేష్ (45) ఫిబ్రవరిలో తన భార్య జోగమ్మను హత్య చేసి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడు. అప్పటినుంచి సురేష్‌కు ఆయన బావమరిది మొక్కటి జోగాతో గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే జోగా ఈనెల 18వ తేదీన ఒంటరిగా ఉన్న తన బావను హత్యచేసి గుట్టుగా వాగులో పూడ్చిపెట్టాడు. ఈ విషయం ఆదివారం బయటపడటంతో పోలీసులు జోగాను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఇంటికే 'ఈ-పాఠం'

ఆంధ్రప్రదేశ్ ఈ-పాఠశాల యూట్యూబ్ చానల్, ఈ-విద్య డీటీహెచ్ చానళ్ల ద్వారా బోధన

- విద్యార్థి ఎక్కడున్నా నేర్చుకునేలా 366 వీడియో పాఠాలు
- ఈ-పాఠశాల మొబైల్ యాప్‌లోనూ పాఠ్యాంశాలు
- ఐదు మాధ్యమాల్లోనూ ఒకే తరహా బోధన



సాక్షి, అమరావతి: విద్యా రంగంలో ఇప్పటికే అనేక విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టిన ప్రభుత్వం మరిన్ని చర్యలకు శ్రీకారం చుడుతోంది. విద్యార్థి ఎక్కడున్నా నేర్చుకునేలా పాఠాలను అందిస్తోంది. పాఠ్యాంశాలు విద్యార్థికి మరింత అర్థమయ్యేలా, వివిధ మాధ్యమాల ద్వారా నేర్చుకునేలా ఆంధ్రప్రదేశ్ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఏపీ ఎస్‌సీఈఆర్‌టీ) వీడియో కంటెంట్‌ను రూపొందించింది. ఆయా సబ్జెక్టుల్లో నిపుణులైన ప్రభుత్వ ఉపాధ్యాయులతో మూడు నుంచి 9వ తరగతి వరకు అన్ని పాఠ్యాంశాలను సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల (ఐఎఫ్‌పీ) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ బోధనను అందిస్తోంది. మరోవైపు అవే పాఠాలను ట్యాబ్‌ల ద్వారా ఇంటి వద్ద కూడా నేర్చుకునేలా బైజూస్ కంటెంట్‌ను అప్‌లోడ్ చేసి అందించింది. వీటితోపాటు ఆయా తరగతుల అన్ని పాఠ్యాంశాలకు నిపుణులైన ఉపాధ్యాయులతో 366 వీడియోలను రూపొందించిన ఎస్‌సీఈఆర్‌టీ వాటిని యూట్యూబ్ (ఆంధ్రప్రదేశ్ ఈ-పాఠశాల చానల్)లోనూ అప్‌లోడ్ చేసింది. వీటిని మొబైల్ ఫోన్‌లోనూ చూసే అవకాశం కల్పించింది. ఈ వీడియోలను విద్యార్థి ఎప్పుడు కావాలంటే అప్పుడు.. ఎక్కడ కావాలంటే అక్కడ చూడొచ్చు. తద్వారా బడిలో ఉపాధ్యాయులు బోధించినప్పుడు విస్మరించిన, మరిచిపోయిన అంశాలను తిరిగి మననం చేసుకోవచ్చు.

ఐదు డీటీహెచ్ చానళ్ల ద్వారా ప్రసారం

టీవీలకు అలవాటుపడిన విద్యార్థుల్లో కూడా చదువుపై ఆసక్తి కలిగించేలా పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంది. డిజిటల్ పాఠాలను డైరెక్ట్ టు హోమ్ (డీటీహెచ్) విధానంలో ప్రసారం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఐదు ఈ-విద్య డీటీహెచ్ చానళ్లను కేటాయించింది. వీటిలో ఒకటి నుంచి ఐదు తరగతులకు ఒక చానల్ వినియోగిస్తున్నారు. మిగిలిన నాలుగు చానళ్లను ఆరు నుంచి 9వ తరగతి పాఠ్యాంశాల ప్రసారానికి కేటాయించారు. ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన విద్యా క్యాలెండర్, పాఠ్యప్రణాళిక ప్రకారం.. ఆయా నిర్ణీత తేదీల్లో డీటీహెచ్ చానళ్లలో ఆ నెల పాఠ్యాంశాలను నిరంతరం ప్రసారం చేస్తారు. ఇలా 100 శాతం కంటెంట్‌తో ఈ-విద్య డీటీహెచ్ చానళ్ల ద్వారా పూర్తి స్థాయి పాఠాలను అందిస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రైమరీ, జూనియర్ విభాగాల్లో టోఫెల్‌ను ప్రవేశపెట్టడంతో ఆయా పాఠాల బోధనకు మరో మూడు డీటీహెచ్ చానళ్లను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు పాఠశాల విద్యాశాఖ మౌలిక వసతుల కల్పన కమిషనర్ కాటమనేని భాస్కర్ 'సాక్షి'కి తెలిపారు.

మొబైల్ యాప్ సైతం..

ఆన్‌లైన్‌లో కూడా విద్యార్థులు పాఠాలు చదువుకునేందుకు, ఉపాధ్యాయులు చెప్పినవి వినేందుకు అనువుగా 'ఈ-పాఠశాల' మొబైల్ యాప్‌ను సైతం అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ఐఎఫ్‌పీ, ట్యాబ్, డీటీహెచ్, యూట్యూబ్, మొబైల్ యాప్.. ఇలా అన్ని మాధ్యమాల్లోనూ ఒకే తరహా కంటెంట్, బోధన ఉండేలా వీడియోలను రూపొందించారు. దీంతో విద్యార్థి ఎలాంటి గందరగోళం లేకుండా తన తరగతి పాఠాలను ఈ ఐదు మాధ్యమాల్లో సులువుగా నేర్చుకోవచ్చు.

అన్ని కేబుల్ నెట్‌వర్క్‌ల్లోనూ ప్రసారం



బడిలో ఉపాధ్యాయులు బోధించే అన్ని పాఠాలను ఈ-కంటెంట్ రూపంలోకి మార్చాం. నిష్ణాతులైన సబ్జెక్టు ఉపాధ్యాయులతో సిలబస్ వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వీడియో పాఠాలు రూపొందించాం. ఈ-పాఠశాల చానళ్లను అందించేందుకు ప్రైవేటు టీవీ నెట్‌వర్క్ ప్రొవైడర్లు కూడా అంగీకరించారు. ఇప్పటికే కొన్నిచోట్ల ప్రసారమవుతున్నాయి. త్వరలో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో కూడా ఇంట్లో టీవీ ద్వారా విద్యార్థులు పాఠాలు వినొచ్చు. అలాగే యూట్యూబ్‌లో కూడా ఎప్పుడైనా వీటిని చూడొచ్చు.

– కాటమనేని భాస్కర్, కమిషనర్, పాఠశాల విద్యాశాఖ మౌలిక వసతులు

3 నుంచి 9 తరగతి వరకు వీడియో కంటెంట్

పాఠశాల విద్యార్థులకు అవసరమైన సబ్జెక్టుల్లోని కంటెంట్‌ను ఇప్పటికే బైజూస్ రూపొందించి విద్యాశాఖకు అందించింది. వీటిని యథావిధిగా విద్యార్థులకు ఐఎఫ్‌పీల ద్వారా బోధించడంతో పాటు ట్యాబ్‌ల్లోనూ అప్‌లోడ్ చేశారు. అయితే, ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు లాంగ్వేజెస్‌తోపాటు కొన్ని సబ్జెక్టుల వీడియో పాఠాలను ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించింది. ఇందులో ప్రధానంగా మూడో తరగతి విద్యార్థులకు.. తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఈవీఎస్, నాలుగు, ఐదు తరగతులకు.. తెలుగు, ఇంగ్లిష్, ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు.. తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టుల్లో వీడియో పాఠాలను అందుబాటులోకి తెచ్చింది. యూట్యూబ్‌లో పాఠాలు అందరికీ అందుబాటులో ఉండగా.. ప్రైవేటు నెట్‌వర్క్ ప్రొవైడర్లు చాలా ప్రాంతాల్లో డీటీహెచ్ చానళ్లను అందించడం లేదు. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన డీటీహెచ్ చానళ్లను అన్ని ప్రైవేటు కేబుల్ నెట్‌వర్క్ సంస్థలు కూడా అందించేలా పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను రూపొందించనుంది.

చంద్రయాన్-3 మిషన్‌లో పనిచేయడం గొప్ప అనుభూతి

- ఇస్రో సీనియర్ సైంటిస్ట్ మౌనికశ్రీ



బేస్తవారిపేట: భారతదేశం గర్వించదగిన చంద్రయాన్-3 మిషన్‌లో తాను పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందని ఇస్రో సీనియర్ సైంటిస్ట్ మోర్తాల మౌనికశ్రీ తెలిపారు. ప్రకాశం జిల్లా బేస్తవారిపేటలోని నీలం సంజీవరెడ్డి నగర్‌కు చెందిన మోర్తాల బాలిరెడ్డి, అనిత దంపతుల కుమార్తె మౌనికశ్రీ భారత అంతరిక్ష పరీక్ష కేంద్రమైన శ్రీహరికోటలోని షార్‌లో సీనియర్ సైంటిస్ట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె 2011లో గుంటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదివారు. గుంటూరు ఆర్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) పూర్తి చేశారు. అనంతరం షార్‌లో ఉద్యోగం పొందారు. ప్రస్తుతం సీనియర్ సైంటిస్ట్‌గా పని చేస్తున్నారు. చంద్రయాన్-3, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్స్‌లో ఎలక్ట్రికల్ ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ చేయడంలో మౌనికశ్రీ ప్రధాన పాత్ర పోషించారు. చంద్రయాన్-3 మిషన్‌లోనూ ఆమె సేవలు అందించారు. చంద్రయాన్-3 మిషన్‌లో పని చేయడం గొప్ప అనుభూతి అని మౌనికశ్రీ తెలిపారు. తనకు సహకరించిన భర్త, సైంటిస్ట్ పడిగె కాశిరెడ్డి, సహచర శాస్త్రవేత్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

విమర్శలకు భయపడను

- దళితవాడలకు శ్రీవారిని తీసుకెళ్లి కళ్యాణం చేసింది..
- మాడవీధుల్లో చెప్పులతో తిరగడాన్ని నిషేధించిందీ నేనే
- మతాంతీకరణలు ఆపడానికి 30 వేల మందికి కళ్యాణమస్తు ద్వారా సామూహిక వివాహాలు చేయించా
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



సాక్షి, తిరుపతి: దళితవాడలకు శ్రీ వేంకటేశ్వరస్వామిని తీసుకెళ్లి కళ్యాణం చేసింది.. తిరుమల ఆలయ మాడ వీధుల్లో చెప్పులు వేసుకుని తిరగకూడదని నిర్ణయం తీసుకుంది తానేనని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి విమర్శకులకు గట్టిగా సమాధానమిచ్చారు. తాను క్రిస్టియన్ అని, నాస్తికుడినని ఆరోపణలు చేస్తున్న వారికి ఇదే నా సమాధానమన్నారు. ఆరోపణలకు భయపడి మంచి పనులు చేయడం ఆపేవాడిని కాదని.. తాను పోరాటాల నుండి పైకొచ్చిన వాడినని, విమర్శలకు భయపడనని ఆయన స్పష్టంచేశారు. ఆదివారం తిరుపతిలో జరిగిన 'మూడుతరాల మనిషి' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయనతోపాటు ఈఓ ధర్మారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ.. తాను 17ఏళ్ల క్రితమే టీటీడీ చైర్మన్ అయిన వ్యక్తినని గుర్తుచేశారు. దేవుడి దయతో మతాంతీకరణలు ఆపడానికి 30 వేల మందికి కళ్యాణమస్తు ద్వారా సామూహిక వివాహాలు చేయించిన విషయాన్ని ఆయన వివరించారు. తిరుమల ఆలయ నాలుగు మాడవీధుల్లో చెప్పులు వేసుకుని తిరగకూడదనే నిర్ణయం కూడా తనదేనన్నారు. అన్నమయ్య 600వ వర్ధంతి ఉత్సవాలు చేసిన విషయాల గురించి తెలిపిందీ తానేనని ఆయన వెల్లడించారు.

నాలుగేళ్ల అభివృద్ధిపై పీపీటీ ప్రదర్శన..

తిరుమల శ్రీవారిపై ఉన్న భక్తివిశ్వాసాలను దెబ్బతీసేలా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. టీటీడీ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, భక్తుల వసతుల కల్పనపై నెలరోజుల్లో పీపీటీ ప్రదర్శన ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. టీటీడీ మీద విమర్శలు చేస్తున్న వారిలో తిరుపతి వాసులు కూడా ఉన్నారని తెలిపారు. టీటీడీని తిరుపతి వాసులు తమ సొంతంగా భావించాలని కోరారు.

చంద్రయాన్-3లో దేవగుప్తం శాస్త్రవేత్త సురేశ్ బాబు

- లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ క్రయోజెనిక్ విభాగంలో కీలకపాత్ర
- నిరుపేద కుటుంబంలో పుట్టినా ఉన్నత స్థాయికి..
- ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే విద్యాభ్యాసం
- ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్‌ను ఆదర్శంగా తీసుకుని ఎదిగిన వైనం





సురేశ్ బాబు తల్లిదండ్రులు సత్యభారతి, కామేశ్వరరావులను సన్మానిస్తున్న సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు

అల్లవరం: చంద్రుడి దక్షిణ ధ్రువంపైన ల్యాండర్‌ను దించిన తొలి దేశంగా భారత్ రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. మన రాష్ట్రంలోని శ్రీహరికోట నుంచి చంద్రయాన్-3ని ప్రయోగించగా ఈ క్రతువులో ఎంతోమంది శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు పాలుపంచుకున్నారు. వీరిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన శాస్త్రవేత్త బలభద్ర సురేష్‌బాబు ఒకరు. చంద్రయాన్-3 ప్రాజెక్టు లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ) క్రయోజెనిక్ విభాగంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఒక మారుమూల గ్రామంలో నిరుపేద కుటుంబంలో పుట్టినా సురేశ్ బాబు కుంగిపోలేదు. గ్రామంలోనే పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నారు. విఖ్యాత శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్‌ను స్ఫూర్తిగా తీసుకున్నారు. ఆయనలా తాను ప్రముఖ శాస్త్రవేత్తగా పేరు తెచ్చుకోవాలనుకున్నారు. అమలాపురంలోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదివిన సురేశ్ బాబు తణుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివారు. ఆ తర్వాత ట్రిపుల్ ఐటీ బెంగళూరులో విద్యనభ్యసించి త్రివేంద్రంలోని ఇస్రో కేంద్రంలో తొలి పోస్టింగ్ పొందారు. చంద్రయాన్-3లో కీలక పాత్ర పోషించడం ద్వారా ఎట్టకేలకు తన ఆకాంక్షను నెరవేర్చుకున్నారు. ఈ నేపథ్యంలో దేవగుప్తం సచివాలయంలో శాస్త్రవేత్త సురేశ్ బాబు తల్లిదండ్రులు సత్యభారతి, కామేశ్వరరావులను పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు మాట్లాడుతూ.. చంద్రయాన్ విజయంలో గ్రామానికి చెందిన సురేశ్ బాబు కీలక పాత్ర పోషించడం దేశానికే గర్వకారణమని అభివర్ణించారు. నిరుపేద కుటుంబంలో పుట్టినా ఉన్నత స్థాయికి ఎదగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన మరిన్ని విజయాలు సాధించి గ్రామానికే కాకుండా, దేశానికి కూడా కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. సురేశ్ బాబు తండ్రి కామేశ్వరరావు మాట్లాడుతూ.. తన కుమారుడికి చిన్నప్పటి నుంచి ప్రశ్నించే తత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తిక్కిరెడ్డి శ్రీను, సుందరనీడి సాయి, ఎంపీటీసీ ముత్తాబత్తుల రాంబాబు, హెచ్ఎం వేణుగోపాల్, ఏఎంసీ డైరెక్టర్ ఈతకోట సతీష్, జగనన్న గృహ సారథుల కన్వీనర్ కుడుపూడి సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయాల్లో చేనేత అమ్మకాలు

ప్రైవేటుకు దీటుగా ఎయిర్‌పోర్టుల్లో ఆప్కో స్టాల్స్

- సొసైటీల వద్ద ఉన్న నిల్వల అమ్మకాలకు కార్యాచరణ
- చేనేత వస్త్రాలకు బ్రాండింగ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి బ్రాండింగ్ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. ఇప్పటికే ఆర్టీసీ బస్‌స్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రధాన కాంప్లెక్స్‌లలో ఆప్కో స్టాల్స్ ఏర్పాటు చేసింది. తాజాగా విమానాశ్రయాల్లోనూ ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం విశేషం. ఈ నేపథ్యంలో విజయవాడ (గన్నవరం), తిరుపతి (రేణిగుంట) విమానాశ్రాయాల్లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌కు ఆదరణ పెరుగుతోంది. ఇటీవల విశాఖపట్నం విమానాశ్రయంతోపాటు మెహిదీపట్నం (హైదరాబాద్), మృగనాయని(భోపాల్), కర్నూలు జిల్లా లేపాక్షి, మంగళగిరిలోనూ ఆప్కో నూతన షోరూంలను ప్రారంభించారు. ప్రైవేటు వస్త్ర వ్యాపార సంస్థలకు దీటుగా అధునాతన వసతులతో ఆప్కో షోరూంలను ప్రారంభించడం విశేషం. చేనేతను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లేందుకు ఒకవైపు దేశవ్యాప్తంగా ఆప్కో స్టాల్స్, షోరూంలను పెంచడంతో పాటు మరోవైపు స్థానికంగా డిస్కౌంట్ సేల్, చేనేత సంఘాల ఎగ్జిబిషన్‌లు, ఫ్యాషన్ షోలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆకట్టుకునే డిజైన్లతోను, వినూత్నమైన, నాణ్యమైన చేనేత వస్త్రాల తయారీని ప్రోత్సహిస్తున్నారు. ఉద్యోగులు, ప్రజలు వారానికి ఒక్కరోజైనా చేనేత వస్త్రాలు ధరించేలా పెద్ద ఎత్తున చైతన్య కార్యక్రమాలు చేపట్టారు.

చేనేత రంగానికి ఊతమిచ్చేలా సీఎం జగన్ చర్యలు

రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్, ఆప్కో మేనేజింగ్ డైరెక్టర్ ఎంఎం నాయక్ 'సాక్షి'తో మాట్లాడుతూ చేనేత రంగానికి ఊతమిచ్చేలా సీఎం వైఎస్ జగన్ అనేక చర్యలు తీసుకున్నారని తెలిపారు. 'నేతన్న నేస్తం' తదితర కార్యక్రమాల ద్వారా చేనేత కార్మికులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. చేనేత వస్త్రాల విక్రయాలను ప్రోత్సహించి ఆ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన సుమారు 1.75లక్షల కుటుంబాలకు అండగా నిలిచేలా ఆప్కో ద్వారా పలు చర్యలు చేపట్టినట్టు వివరించారు. రాష్ట్రంలోని చేనేత సొసైటీల వద్ద ఉన్న వస్త్రాల నిల్వలను క్లియర్ చేసి సొసైటీలను ఆదుకునేలా విక్రయాలు పెంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆప్కో షోరూంల ద్వారా ఈ ఏడాది రూ.50కోట్ల విక్రయాలు జరపాలని నిర్ణయించినట్లు ఎంఎం నాయక్ తెలిపారు.

ముగ్గురికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు



మేకల భాస్కరరావు



శెట్టెం ఆంజనేయులు



ఎం.ఉమాగాంధీ

సాక్షి, అమరావతి/రాయచోటి/నెల్లూరు(టౌన్): కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఈ ఏడాది రాష్ట్రానికి చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. వీరిలో విశాఖపట్నంలోని శివాజీపాలెం జీవీఎంసీ స్కూల్‌కు చెందిన మురహరరావు ఉమాగాంధీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొండాయపాలెం మున్సిపల్ స్కూల్‌కు చెందిన మేకల భాస్కరరావు, అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం మాసాపేట ఎస్ఆర్ఆర్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన శెట్టెం ఆంజనేయులు ఉన్నారు. కాగా ఉమాగాంధీ సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె కుటుంబంలో తండ్రితో పాటు ఇద్దరు తమ్ముళ్లు, చెల్లి కూడా ఉపాధ్యాయులే. ఉమాగాంధీ 2014లో జిల్లా స్థాయిలో, 2019లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. పాలపుంత పేరుతో బాలల గేయాలతో పుస్తకం రాశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ కూడా చేశారు. ఇక పోలియోతో చిన్నతనంలోనే తన రెండు కాళ్లు కోల్పోయిన మేకల భాస్కరరావు ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నారు. 2012లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. 2018లో రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డును అందుకున్నారు. 2019లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు తీసుకున్నారు. 2022లో మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రం పొందారు. అలాగే శెట్టెం ఆంజనేయులు ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యార్థుల్లో విశ్లేషణాత్మక, ఆలోచనాత్మక సామర్థ్యాన్ని పెంచడానికి కృత్యాధార పద్ధతిలో బోధిస్తున్నారు. కాగా తెలంగాణలో మంచిర్యాల జిల్లా రెబ్బనపల్లి ఎంపీపీ స్కూల్‌కి చెందిన నూగూరి అర్చన, ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపస్ ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన భెండోద్కర్ సంతోష్ కుమార్ కూడా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మొత్తం 50 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రకటించగా.. తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు ఉన్నారు. వీరికి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న న్యూఢిల్లీలో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

కులవాద పార్టీలకు బుద్ధిచెబుతాం

- రిలే నిరాహార దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



తాడికొండ: రాష్ట్రంలో కులవాదమే అజెండాగా ముందుకెళుతూ అధికారం కోసం పాకులాడుతున్న పార్టీలను ఓడిస్తామని బహుజన పరిరక్షణ సమితి నేతలు స్పష్టం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1064వ రోజుకు చేరాయి. దీక్షల శిబిరాన్ని పలువురు ముఖ్యులు సందర్శించి ప్రసంగించారు. గతంలో 7.5గా ఉన్న ప్రజల తలసరి ఆదాయం ఏపీలో ఇప్పుడు 16.88కి చేరిందని కేంద్రం ప్రకటించిందంటే.. గత ప్రభుత్వాలకు భిన్నంగా రాష్ట్రంలో ప్రజల జీవన విధానం మెరుగు పడిందనేందుకు ఇదే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, శ్రీలంకలా మారిందని గగ్గోలు పెడుతున్న ఎల్లో మీడియా, కులవాద పార్టీలకు ఇది చెంపపెట్టని తెలిపారు. అమరావతి పేరుతో రూ.7500 కోట్లు వెచ్చించిన చంద్రబాబు.. ఈ ప్రాంతంలో తాత్కాలిక నివాసాలు, అరకొర వసతులు కల్పించి కాంట్రాక్టర్ల వద్ద నుంచి దొడ్డిదారిలో జేబులు నింపుకొన్నారని ఆరోపించారు. యాత్రల పేరుతో రాష్ట్రంలో తిరుగుతున్న చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌లు కులమతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సమితి నేతలు పులిదాసు, పల్లె బాబు, ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లిపీటలపై ఎదురుతిరిగిన వధువు

- ప్రియుడినే పెళ్లాడతానని పట్టు
- కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో ఘటన



వధూవరులు దివ్య, వెంకటేష్

తుమకూరు: పెళ్లి పీటల మీద వధూవరులు. మరికాసేపట్లో ముహూర్త సమయం. మంగళవాయిద్యాలు, బంధుమిత్రులతో సందడిగా ఉన్న కళ్యాణ మండపంలో ఒక్కసారిగా నిశ్శబ్దం. పెళ్లి కూతురు కోపంగా లేచి 'తాను మరో యువకుణ్ణి ప్రేమించాను. వద్దని చెప్పినా నా తల్లిదండ్రులు ఈ పెళ్లి కుదిర్చారు. ససేమిరా ఈ పెళ్లి నేను చేసుకోను' అని స్పష్టం చేసింది. దీంతో పెళ్లి కొడుకు, అతని బంధువులు దిగ్భ్రాంతికి గురైన ఘటన కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా కొరటిగెరె తాలూకా కోలాల గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే...దొడ్డబళ్లాపూర్ ఇన మద్దకాలేనహళ్లికి చెందిన గోవిందరాజుల కుమారుడు వెంకటేష్, దొడ్డబెలె గ్రామానికి చెందిన నరసింహమూర్తి, అంజనమ్మ కుమార్తె దివ్యకు పెద్దలు పెళ్లి నిశ్చయించారు. తీరా తాళి కట్టే సమయంలో పెళ్లికుమార్తె దివ్య ఈ పెళ్లి ఇష్టంలేదని చెప్పడంతో వరుడు వెంకటేష్ ఆగ్రహానికి లోనయ్యాడు. మమ్మల్ని మోసం చేస్తారా? అని కాబోయే అత్తమామలపై మండిపడ్డాడు. పెద్దలు పెళ్లి కూతురికి నచ్చజెప్పినా ఆమె వినిపించుకోలేదు. మరోవైపు వరుని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వధువు పంతం వీడకపోవడంతో వరుని కుటుంబానికి పెళ్లి ఖర్చులు చెల్లించాలని పోలీసులు సూచించారు. చివరకు ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.

పనామా ట్రాఫిక్‌జామ్!

అంతర్జాతీయ వర్తకానికి అతి కీలకమైన పనామా కాలువ నానాటికీ చిక్కిపోతోంది. దాంతో భారీ సరుకు రవాణా నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కొద్ది రోజులుగా ఎప్పుడు చూసినా వందలాది నౌకలు బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. దాంతో పనామాకు ప్రత్యామ్నాయంగా మరో కాలువ ఉండాలన్న వాదన మళ్లీ తెరమీదకొచ్చింది.


పనామా కాలువ ప్రవేశ మలుపు వద్ద తమ వంతు కోసం వేచి చూస్తున్న వందలాది ఓడలు

పనామా కాలువకు నీటి కరువు
- నిలిచిపోయిన భారీ నౌకలు
- అంతర్జాతీయ వర్తకానికి ఈ కాలువ దారే అతి కీలకం
- ఏటా 270 బిలియన్ డాలర్ల విలువైన సరుకుల రవాణా
- ప్రత్యామ్నాయంగా తెరపైకి నికరాగ్వా కాలువ నిర్మాణం

పసిఫిక్, అట్లాంటిక్ మహా సముద్రాలను కలిపే కీలకమైన పనామా కాలువలో నీటి పరిమాణం కొన్నాళ్లుగా బాగా తగ్గుతోంది. దాంతో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోయి భారీ నౌకల ప్రయాణానికి ప్రతిబంధకంగా మారింది. ఓ మోస్తరు నౌకలు ఆచితూచి, అతి నెమ్మదిగా కదలాల్సి వస్తోంది. దీంతో విపరీత జాప్యం జరుగుతోంది. ఫలితంగా భారీ నౌకలు కాలువను దాటి అటు అట్లాంటిక్, ఇటు పసిఫిక్ వైపు వెళ్లడానికి రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ప్రస్తుతం కనీసం 250కిపైగా భారీ నౌకలు తమవంతు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

కారణమేమిటి?
పనామా కాలువకు ప్రధానంగా నీటిని సరఫరా చేసే రెండు రిజర్వాయర్లు కొద్ది కాలంగా నీటి ఎద్దడితో అల్లాడుతున్నాయి. వాటి పరీవాహక ప్రాంతాల్లో నెలకొన్న తీవ్ర వర్షాభావమే అందుకు అసలు కారణం.

మళ్లీ తెరపైకి 'ఆ కాలువ'
పనామా కాలువ పరిమితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ కాలువ ఉండాలన్న ప్రతిపాదన మళ్లీ తెరమీదికి వస్తోంది. ఇది కొత్తదేమీ కాదు. 1900 తొలినాళ్లలో అమెరికా ముందు రెండు ప్రతిపాదనలు ఉండేవి. ఒకటి పనామా కాగా మరోటి నికరాగ్వా గుండా కాలువ నిర్మాణం. పనామాకే అమెరికా సెనేట్ ఓటు వేయడంతో నికరాగ్వా గుండా నిర్మాణం అనేది ప్రతిపాదనలకే పరిమితమైంది. ఆ మార్గంలో చురుకైన అగ్ని పర్వతాలు ఉండటం సైతం ఆ ప్రాజెక్టు ఆదిలోనే ఆగడానికి ప్రధాన కారణం. అదీ కాక నికరాగ్వా మార్గంతో పోలిస్తే తక్కువ దూరం ఉండటమూ పనామాకు కలిసొచ్చిన అంశాల్లో ఒకటి. దీంతో ఆనాడు కనుమరుగైన ఆ ప్రతిపాదన తాజాగా ఇప్పుడు కొత్త రెక్కలు కట్టుకుని ముందుకు వాలింది.

- ఎలాగైనా దాని నిర్మాణం పూర్తి చేస్తానని చైనాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఒకరు ముందుకొచ్చారు.
- 2013 ఏడాదిలో హెచ్‌కేఎన్‌డీ అనే చైనా కంపెనీ నికరాగ్వా కాలువ నిర్మాణానికి సిద్ధపడింది కూడా. నికరాగ్వా దేశ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. 50 ఏళ్ల పాటు దాని నిర్వహణ అధికారాలు సంపాదించింది. కానీ ఇదీ కాగితాలకే పరిమితం అయింది.

అంత ఈజీ కాదు...
నికరాగ్వా గుండా కాలువ నిర్మాణానికి ఎన్నో అడ్డంకులు ఉన్నాయి. ఎందుకంటే...
- పశ్చిమాన పసిఫిక్, తూర్పున అట్లాంటిక్‌ను కలుపుతూ రెండు కాలువలు తవ్వాలి. ఈ కాలువల మధ్యలోనే నికరాగ్వా సరస్సు ఉంటుంది.
- అట్లాంటిక్ వైపు 25 కిలోమీటర్లు, పసిఫిక్ వైపు 100 కిలోమీటర్ల పొడవునా ఈ కాలువలను తవ్వాల్సి ఉంటుంది.
- దీని నిర్మాణానికి కనీసం 40 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతుందని అంచనా.
- ఇంత భారీ వ్యయంతో కాలువ నిర్మాణం చేపట్టాలంటే దాని ద్వారా అంతకు మించి ఆదాయం ఉంటుందన్న భరోసా కావాలి.
- ఇంత భారీ కాలువ నిర్మాణమంటే పర్యావరణ పరంగా ఎంతో పెద్ద సవాలే.
- నిర్మాణం కారణంగా సతతహరిత అరణ్యాలు తుడిచి పెట్టుకుపోతాయని పర్యావరణవేత్తలు ఆందోళనలు చేశారు.

ఫైల్ ఫొటో


ఇదీ పనామా కథ
- మధ్య అమెరికాలో ఉన్న బుల్లి దేశం పనామా.
- అక్కడ నిర్మించిన కృత్రిమ కాలువే పనామా కాలువ.
- ఇది ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాలను కలుపుతుంది.
- దీని పొడవు 80 కిలోమీటర్లు.
- పనామా కాలువ మధ్యలో గతూన్ అనే కృత్రిమ సరస్సు ఉంటుంది. అలజేలా అనే మరో కృత్రిమ సరస్సు ఈ కాలువకు రిజర్వాయర్‌గా ఉంది.
- ఇటు పసిఫిక్ మహా సముద్రం, అటు అట్లాంటిక్ మహా సముద్రం వైపు కరేబియన్ సముద్రాన్ని విడదీసే ఇస్తుమస్ ఆఫ్ పనామను ఆనుకుని పనామా కాలువ ఉంటుంది.
- పనామా కాలువ గుండా ఏటా 270 బిలియన్ డాలర్ల విలువైన సరుకు రవాణా జరుగుతోంది.
- పనామా గుండా 170 దేశాలకు సరుకులు వెళ్తాయి.

ఏం జరగనుంది?
- సరుకు నౌకలు దీర్ఘ కాలం పాటు ఇలా వేచి ఉండటం కారణంగా రవాణా వ్యయం విపరీతంగా పెరుగుతుంది.
- దాంతో ద్రవీకృత సహజ వాయువు తదితర ఇంధనాల ధరలకు అమాంతం రెక్కలొస్తాయి.
- ఇది అంతిమంగా చాలా దేశాల్లో, అంటే అంతర్జాతీయంగా ధరల పెరుగుదలకు దారి తీస్తుంది.
- చివరకు ద్రవ్యోల్బణం పెరిగి పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు అల్లాడే పరిస్థితి రావచ్చు.

'పనామాలో ఇప్పుడున్నది కనీవినీ ఎరగని అసాధారణ పరిస్థితి. చాలా ఆందోళనకరం కూడా'
– మిషెల్ వైస్ బోక్‌మ్యాన్, లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్‌లో సీనియర్ విశ్లేషకుడు

– సాక్షి, నేషనల్ డెస్క్

భారత్‌తో బంధాలు బలపడితే చైనాపై ఆధారపడనక్కర్లేదు

- ప్రధాని మోదీ మంచి నేత
- భారతీయ మీడియాతో వివేక్ రామస్వామి

లోవా: భారత్‌తో అమెరికా బంధాలు మరింత బలపడితే చైనాపై ఆధారపడే అవసరం ఉండదని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి అభిప్రాయపడ్డారు. అండమాన్ సముద్రంలో మిలటరీ బంధాల్ని భారత్‌తో పటిష్టం చేసుకుంటే చైనా నుంచి దూరం కావచ్చునని వ్యాఖ్యానించారు. 38 ఏళ్ల వయసున్న వివేక్ రామస్వామి రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో నిలిచిన వారిలో పిన్న వయస్కుడు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తర్వాత ఈ బరిలో ముందున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో అత్యంత కీలకమైన లోవా రాష్ట్రంలో పర్యటిస్తున్న వివేక్ రామస్వామి పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. 'చైనాపై అమెరికా ఆర్థికంగా ఆధారపడి ఉంది. భారత్‌తో సంబంధాలు బలపడితే చైనాతో బంధాల నుంచి బయటపడవచ్చు' అని రామస్వామి వివరించారు. 'అండమాన్ సముద్రంలో మిలటరీ బంధాలు సహా భారత్‌తో అమెరికాకు వ్యూహాత్మక సంబంధాలు బలోపేతం కావాలి. పశ్చిమాసియా దేశాల నుంచి చైనాకు చమురు సరఫరా అవుతున్న మలక్కా జలసంధిని భారత్ అడ్డుకోగలదన్న విషయం మనకు తెలిసుండాలి. ఇరు దేశాల బంధాల బలోపేతానికి ఇవే కీలకం. అదే జరిగితే అమెరికాకు మంచే జరుగుతుంది. ఆ దిశగా నేను ముందుకు వెళతాను' అని రామస్వామి చెప్పారు. మొదటిసారిగా భారతీయ మీడియాకి ఇంటర్వ్యూ ఇచ్చిన వివేక్ భారత ప్రధాని మోదీ మంచి నాయకుడని ప్రశంసించారు. మోదీతో కలిసి ఇరు దేశాల సంబంధాల బలోపేతానికి కృషి చేసే రోజు కోసం తాను ఎదురు చూస్తున్నట్లుగా చెప్పారు.

ఆ యాడ్‌తో బాద్‌షాకి చిక్కులు



ముంబై: బాలీవుడ్ బాద్‌షా షారూక్ ఖాన్ చిక్కుల్లో పడ్డారు. ఒక ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించినందుకు ఆయన ఇల్లు ముట్టడికి కొందరు విఫలయత్నం చేశారు. ఆన్‌లైన్ జూదాన్ని ప్రోత్సహించేలా షారూక్ వ్యవహరించడం వారికి మింగుడు పడడం లేదు. అన్‌టచ్ ఇండియా ఫౌండేషన్‌కు చెందిన కొందరు బాంద్రాలోని షారూక్ ఇంటి బయట నిరసనలకు దిగడానికి చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. షారూక్ ఇంటికి గట్టి భద్రత ఏర్పాటు చేసి కొందరు యువకుల్ని అదుపులోనికి తీసుకున్నారు. ఏ23 అనే ఆన్‌లైన్ రమ్మీ పోర్టల్‌కి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న షారూక్ ఇటీవల దానికి సంబంధించిన ఒక వాణిజ్యప్రకటన(యాడ్)లో నటించారు. ఆ యాడ్‌లో 'పదండి కలిసి ఆడదాం' అని షారూక్ వ్యాఖ్యానిస్తారు. ఈ అడ్వర్టయిజ్‌మెంట్‌పై అన్‌టచ్ యూత్ ఫౌండేషన్ తీవ్ర స్థాయిలో మండిపడింది. జంగ్లీ రమ్మీ, జూపీ వంటి ఆన్‌లైన్ గేమింగ్ యాప్స్ యువతని పక్కదారి పట్టిస్తున్నాయని అన్‌టచ్ ఇండియా ఫౌండేషన్ విమర్శించింది.

క్లుప్తంగా...

ఢిల్లీ మెట్రోల్లో ఖలిస్తానీ రాతల కలకలం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఐదు మెట్రో స్టేషన్ల గోడలపై గుర్తు తెలియని వ్యక్తులు ఖలిస్తానీ అనుకూల రాతలు రాశారు. సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో ఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సమ్మేళనం జరగనున్న వేళ ఈ పరిణామం కలకలం రేపింది. శివాజీ పార్క్, పశ్చిమ్ విహార్, ఉద్యోగ్ నగర్, మహారాజా సూరజ్‌మల్ స్టేడియం, మాదిపూర్ మెట్రో స్టేషన్ల గోడలపై 'ఢిల్లీ బనేగా ఖలిస్తాన్, ఖలిస్తాన్ జిందాబాద్' అంటూ రాసినట్లు పోలీసులు తెలిపారు. నంగ్లోయిలోని ఓ ప్రభుత్వ పాఠశాల గోడపైనా ఇవి కనిపించాయన్నారు. దుండగులను గుర్తించేందుకు సీసీటీవీ కెమెరా ఫుటేజీని సేకరించామన్నారు. నిషేధిత సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) విడుదల చేసినట్లుగా భావిస్తున్న భావిస్తున్న వీడియోలో మెట్రో స్టేషన్ల గోడలపై రాతలు కనిపించాయి. ఆ వీడియోలో ఎస్ఎఫ్‌జే ప్రతినిధి గుర్‌పత్వంత్ సింగ్ పన్నున్..జీ20 దేశాల నేతలూ, మీరు ఢిల్లీలో సెప్టెంబర్ 10న సమావేశమయ్యే రోజునే కెనడాలో మేం ఖలిస్తాన్‌పై రెఫరెండం చేపడతాం 'అని అన్నట్లుగా ఉంది. జనవరి 19న ఢిల్లీలోని మెట్రో స్టేషన్ల గోడలపైన ఇలాంటి రాతలే దర్శనమిచ్చాయి.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురు నల్లజాతీయులు మృతి

జాక్సన్‌విల్లె: అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం జాక్సన్‌విల్లెలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకున్న కాల్పుల ఘటన కలకలం రేపింది. ఎడ్వర్డ్ వాటర్స్ యూనివర్సిటీకి సమీపంలోని డాలర్ జనరల్ స్టోర్ వద్ద ఓ యువకుడు(20) జరిపిన కాల్పుల్లో ముగ్గురు నల్ల జాతీయులు ప్రాణాలు కోల్పోయారు. ఇది జాతి విద్వేష ఘటన అని పోలీసులు తెలిపారు. అనంతరం దుండగుడు తనను తాను కాల్చుకుని చనిపోయాడు. నిందితుడు నల్ల జాతీయులను ద్వేషించే వాడని, ఇతర గ్రూపులతో అతడికి సంబంధాలున్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని పోలీసులు స్పష్టం చేశారు. అతడు హ్యాండ్‌గన్‌తో పాటు, సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌తో కాల్పులకు తెగబడ్డాడన్నారు. ఒక తుపాకీపై స్వస్తిక్ గుర్తు ఉందని వివరించారు. పొరుగునే ఉన్న క్లె కౌంటీ నుంచి నల్లజాతీయులు ఎక్కువగా నివసించే ఈ ప్రాంతానికి వచ్చాడు. కాల్పులకు కొద్దిసేపటి ముందు తన తండ్రికి మెసేజీ పంపించాడని, దాని ప్రకారం నిందితుడి కంప్యూటర్ ఓపెన్ చేసి చూడగా విద్వేషపూరిత రాతలు కనిపించాయని పోలీసులు వివరించారు.

బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు.. 8 మంది దుర్మరణం



బరాసత్: పశ్చిమబెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఆదివారం ఉదయం బాణాసంచా కర్మాగారంలో పేలుడు సంభవించి 8 మంది చనిపోయారు. పలువురు గాయాలపాలయ్యారు. దత్తపుకుర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నీల్‌గుంజ్‌లోని కర్మాగారంలో ఘటన జరిగిన సమయంలో పలువురు సిబ్బంది పనుల్లో నిమగ్నమై ఉన్నారు. పేలుడు తీవ్రతకు చుట్టుపక్కలున్న 50 నివాసాలు దెబ్బతిన్నాయని పోలీసు అధికారులు వివరించారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కర్మాగారం యజమాని కొడుకు కూడా పేలుడులో చనిపోయాడన్నారు. మంటలను ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది కృషి చేస్తున్నారని చెప్పారు. అక్రమంగా నడుపుతున్న ఈ కర్మాగారంలో బాణాసంచా పేరుతో బాంబులు తయారు చేస్తున్నారా అన్న అనుమానాలకు దర్యాప్తులోనే సమాధానం దొరుకుతుందని చెప్పారు. పేలుడు అనంతరం స్థానికులు కర్మాగారం యజమాని ఇంటిని ధ్వంసం చేశారు. గత మేలో పూర్వ మేదినీపూర్ జిల్లాలోని ఈగ్రాలో బాణాసంచా కర్మాగారంలో జరిగిన పేలుడులో 12 మంది చనిపోయారు.

ఆస్ట్రేలియాలో కూలిన అమెరికా నేవీ విమానం

ముగ్గురు నౌకాదళ సభ్యులు మృతి

కేన్‌బెర్రా: ఆస్ట్రేలియాలో జరుగుతున్న సైనిక విన్యాసాల్లో అమెరికాకు చెందిన నౌకా దళ విమానం కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు నేవీ సభ్యులు మరణించారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాలతో కలిసి ఆస్ట్రేలియాలోని మెల్విలె ద్వీపంలో విన్యాసాల్లో శిక్షణ ఇస్తుండగా ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో విమానంలో 23 మంది ఉండగా ముగ్గురు మరణించారు. 20 మంది గాయపడ్డారు. వారిలో అయిదుగురి పరిస్థితి విషమంగా ఉంది.


ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై మహిళలకు అవగాహన కల్పించేందుకు ఆదివారం బెంగళూరులో నిర్వహించిన 'శారీ రన్' లో పరుగెత్తుతున్న మహిళలు.

వైన్ నిల్వలు వదిలించుకొనేందుకు రూ. 1,700 కోట్లు

పారిస్: ప్రభుత్వ ఖజానాలో కాసులు గలగలలాడడానికి ఎవరైనా మద్యం అమ్మకాలు పెంచుతారు. కానీ ఫ్రాన్స్ మద్యానికి డిమాండ్ లేకపోవడంతో ఆ నిల్వలను వదిలించుకోవడానికి దాదాపు రూ.1,700 కోట్లు (20 కోట్ల యూరోలు) ఖర్చు చేయాలని నిర్ణయించింది. కోవిడ్ సంక్షోభం, ఆ వెంటనే రష్యా– ఉక్రెయిన్ యుద్ధంతో యూరప్ దేశాలన్నీ ద్రవ్యోల్బణంతో కొట్టుమిట్టాడుతున్నాయి. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో ప్రజలు వైన్ వంటి వాటికి ఖర్చు చెయ్యడం బాగా తగ్గించేశారు. తక్కువ ధరకు లభించే బీర్‌కు అలవాటు పడిపోయారు. దీనికి వాతావరణ పరిస్థితులు తోడయ్యాయి. గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో ఫ్రాన్స్ సహా యూరప్ దేశాల్లో ఇటీవల కాలంలో ఎండలు మండిపోతున్నాయి. ఉక్కబోత భరించలేని ప్రజలు వైన్ బదులుగా బీర్ ఎక్కువగా తాగుతున్నారు. చాలా మంది ఆల్కహాల్ ఉత్పత్తులకు దూరంగా ఉంటున్నారు. ముఖ్యంగా జనరేషన్ జెడ్(1996 నుంచి 2010 మధ్య పుట్టినవారు) మద్యం తాగడానికి ఇష్టపడడం లేదు. ఫలితంగా వైన్‌కి డిమాండ్ పడిపోయింది. మరోవైపు వైన్ ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన బోర్డాక్స్ ప్రాంతంలో వైన్ నిల్వలు భారీగా పేరుకుపోయాయి. దీంతో ప్రభుత్వమే ఆ వైన్‌ను కొనుగోలు చేసేందుకు 20 కోట్ల యూరోలు కేటాయించింది. అదనంగా ఉన్న వైన్‌ను కొనుగోలు చేసి దానిలోని ఆల్కాహాల్‌ను శానిటైజర్లు, శుభ్రతా ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు వంటి వాటి తయారీలో వినియోగించనుంది. ఇలా చేయడం ద్వారా మళ్లీ వైన్‌కు డిమాండ్ పెరుగుతుందనే ఆలోచనతోనే ప్రభుత్వం ముందుకెళ్తోంది. వైన్ వినియోగం యూరప్ దేశాలైన ఇటలీలో ఏడు శాతం, స్పెయిన్‌లో 10 శాతం, ఫ్రాన్స్‌లో 15 శాతం, జర్మనీలో 22 శాతం, పోర్చుగల్‌లో 34 శాతం మేర తగ్గిపోయింది.

నైతిక 'కృత్రిమ మేధ' అత్యావశ్యం

- లేదంటే సమాజంపై ఏఐ ప్రతికూల ప్రభావాలు తప్పవు
- బీ20 సదస్సులో ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: అధునాతన సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ)ను నైతికంగా వినియోగించాలని, లేదంటే విపరిణామాలు తప్పవని ప్రధాని మోదీ హెచ్చరించారు. నూతన సాంకేతికతలో నైతికత లోపిస్తే సమాజంపై ఏఐ ప్రతికూల ప్రభావాలు ఎక్కువ అవుతాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం ఢిల్లీలో కొనసాగుతున్న బీ–20(బిజినెస్ ఫోరమ్–20) సదస్సులో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. 'ఏఐ వినియోగానికి సంబంధించి అంతర్జాతీయ స్థాయి ఏకరూప మార్గనిర్దేశకాలు అవసరం. నిబంధనల చట్రం లేకుంటే క్రిప్టో కరెన్సీ వంటి అంశాల్లో సమస్యలు మరింత ఎక్కువ అయ్యే ప్రమాదముంది. పర్యావరణానికి హాని తలపెట్టని రీతిలో జీవన, వ్యాపార విధానాలకు పారిశ్రామిక వర్గాలు ప్రాధాన్యతనివ్వాలి. ఇందుకు వ్యాపారవర్గాలు, ఆయా దేశాల ప్రభుత్వాలు కలసి కట్టుగా ముందుకు సాగాలి' ఆయన మోదీ కోరారు. 'పర్యావరణ మార్పు, ఇంధన రంగంలో సంక్షోభం, ఆహార గొలుసులో లోపించిన సమతుల్యత, నీటి భద్రత వంటివి అంతర్జాతీయంగా వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ సమస్యలకు దేశాలన్నీ ఉమ్మడిగా పరిష్కరించుకోవాలి' అని ఆయన అభిలషించారు. వ్యాపారవర్గాలు తమ వ్యాపార సంబంధ అంశాలను చర్చించేందుకు జీ20కి అనుబంధంగా ఏర్పాటుచేసుకున్న వేదికే బిజినెస్ 20(బీ20) ఫోరమ్. విధాన నిర్ణేతలు, వ్యాపారదిగ్గజాలు, నిపుణులుసహా జీ20 దేశాల ప్రభుత్వాలు ఉమ్మడిగా బీ20 ఇండియా తీర్మానంపై చర్చలు జరుపుతాయి. ఈ తీర్మానంలో 54 సిఫార్సులు, 172 విధానపర చర్యలు ఉన్నాయి. వీటిని సెప్టెంబర్ 9–10 తేదీల్లో జరిగే జీ20 శిఖరాగ్ర సదస్సులో సమర్పిస్తారు.

వారే ఆర్థికాభివృద్ధి చోదక శక్తులు

'ప్రస్తుతం భారత్‌లో చాలా మంది పేదరికం నుంచి బయటపడి కొత్తగా 'మధ్యతరగతి' వర్గంలో చేరుతున్నారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. 'పేదరికాన్ని నిర్మూలిస్తూ కేంద్రం అవలంభిస్తున్న విప్లవాత్మక విధానాల కారణంగా మరో 5–7 ఏళ్లలో కోట్ల భారీ సంఖ్యలో మధ్యతరగతి జనాభా అవతరించనుంది. వీరే భారత ఆర్థికాభివృద్ధి చోదక శక్తులు. వీరే దేశంలో అతిపెద్ద వినియోగదారులు. కొంగొత్త ఆకాంక్షలతో శ్రమిస్తూ దేశార్థికాన్ని ముందుకు నడిపిస్తారు. ప్రభుత్వం పేదలను పై స్థాయికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తోంది. దీంతో ఆ తర్వాత లబ్ధిపొందేది మధ్యతరగతి, సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల వర్గాలే. మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే వ్యాపారాలు వర్ధిల్లుతాయి. వ్యాపారాలు, వినియోగదారుల మధ్య సమతూకం సాధిస్తే లాభదాయ మార్కెట్ సుస్థిరంగా కొనసాగుతుంది. ప్రపంచ దేశాలకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. వినియోగ దేశాలు బాగుండాలంటే వస్తూత్పత్తి దేశాలను పట్టించుకోవాలి. లేదంటే వస్తూత్పత్తి దేశాలు కష్టాల కడలిలో పడతాయి. అందుకే ఏటా అంతర్జాతీయ వినియోగ సంరక్షణ దినం జరుపుకుందాం' అని వ్యాపార వర్గాలకు మోదీ పిలుపునిచ్చారు.

కోటాలో భవంతులకు వలలు

విద్యార్థుల ఆత్మహత్యల నిరోధానికి చర్యలు



కోటా: పోటీ ప్రవేశ పరీక్షలకు ప్రసిద్ధి చెందిన రాజస్తాన్‌లోని కోటా పట్టణం ఇటీవల విద్యార్థుల ఆత్మహత్యలతో తరచూ వార్తల్లో నిలుస్తోంది. ఈ ఏడాది ఏకంగా 20 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడడంతో జిల్లా యంత్రాంగం ఆత్మహత్యల నిరోధానికి ఎన్నో చర్యలు చేపట్టింది. ఇప్పటికే అన్ని హాస్టల్స్‌లో విద్యార్థులకు కౌన్సెలింగ్‌తోపాటు యోగా తరగతులు ప్రారంభించింది. ఫ్యాన్‌కు ఉరేసుకుని చాలా మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్న ఉదంతాల నేపథ్యంలో ఫ్యాన్‌లను స్ప్రింగ్‌లకు బిగించారు. ఇప్పుడు తాజాగా అన్ని హాస్టల్ భవనాలకు వలలు బిగించాలని జిల్లా యంత్రాంగం హాస్టల్ యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో విద్యార్థులు భవనాలపైకి ఎక్కి దూకకుండా 'సూసైడ్ ప్రూఫ్' వలలు బిగించే కార్యక్రమాన్ని అన్ని హాస్టళ్లు యుద్ధప్రాతిపదికన అమరుస్తున్నాయి. 'భవనాల వెలుపల, బాల్కనీల్లోనూ పెద్ద పెద్ద వలలు బిగించాం. ఇవి 150 కేజీల బరువులను సైతం మోయగలవు. ఎవరైనా విద్యార్థి భవనంపై నుంచి దూకినా ఈ వలలో పడతారు. గాయాలు కావు' అని అమ్మాయిల హాస్టల్ నిర్వహిస్తున్న వినోద్ గౌతమ్ వివరించారు. 'ఫ్యాన్‌లకు స్ప్రింగ్‌లు, భవనాలకు వలల కారణంగా విద్యార్థుల ఆత్మహత్యలను దాదాపు అడ్డుకోవచ్చు. విద్యార్థులను హాస్టల్స్‌లో విడిచి వెళుతున్న తల్లిదండ్రులు ఆందోళనతో ఉంటారు. ఇలాంటి నివారణ చర్యల కారణంగా తల్లిదండ్రుల్లో ధైర్యం కాస్తంత ఎక్కువ అవుతుంది' అని గౌతమ్ అభిప్రాయపడ్డారు. 'ఇలాంటి చర్యలు తాత్కాలికంగా ఆత్మహత్యలను నిరోధించగలవేమో. కానీ విద్యార్థులపై చదువుల ఒత్తిడిని తగ్గించాలి. అదే అసలైన పరిష్కారం' అని కొందరు మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మహిళా సాధికారతకు చంద్రయాన్-3 చిహ్నం

మహిళా శక్తి తోడుంటే అసాధ్యాలను సుసాధ్యం చేయొచ్చు
మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఎటువంటి పరిస్థితుల్లోనైనా విజయం సాధించే నవ భారత స్ఫూర్తికి చంద్రయాన్–3 మిషన్ ఒక ప్రతీక అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా సాధికారతకు ఈ కార్యక్రమం సజీవ ఉదాహరణ అని కొనియాడారు. ప్రతీ నెల చివరి ఆదివారం ఆకాశవాణిలో నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడారు. అనంతమైన అంతరిక్షాన్ని భారతీయ మహిళలు సవాల్ చేస్తున్నారని అన్నారు. 'ఇండియా డాటర్స్ ఇంత ప్రతిష్టాత్మకంగా ఉంటే భారత్ అభివృద్ధిని ఎవరు అడ్డుకోగలరు' అని మోదీ వ్యాఖ్యానించారు. 'మహిళల నేతృత్వంలో జరిగే అభివృద్ధి మన దేశ స్వాభావిక లక్షణంగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో అసాధ్యమైనది ఏదైనా ఉంటే మహిళా శక్తితో సుసాధ్యంగా చేయొచ్చు. చంద్రయాన్–3 మిషన్ దీనికి నిలువెత్తు ఉదాహరణ' అని చెప్పారు. చంద్రయాన్ మిషన్‌లో ఎందరో మహిళా శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు ప్రత్యక్షంగా భాగస్వాములైన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు.

అందరినీ కలుపుకొనిపోయేలా జీ20 సదస్సు
'సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగే జీ20 సదస్సు అందరినీ కలుపుకొని పోయేలా ఉంటుంది. ఈ సదస్సుకు భారత్ నేతృత్వం వహించడమంటే ప్రజల ఆధ్వర్యంలో జరుగుతున్నట్టే. భారత్ సత్తా సెప్టెంబర్‌లో అందరికీ తెలుస్తుంది. ప్రపంచ క్రీడల్లో భారత్ రాణించాలి. అందుకు ప్రోత్సాహం కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. దేశీయ క్రీడలైన హాకీ, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో వంటి క్రీడల్లో మనం వెనకబడకూడదు. సెప్టెంబర్ నుంచి దేశంలో ప్రతీ ఇంటి నుంచి, ప్రతీ గ్రామం నుంచి మట్టిని సేకరించే కార్యక్రమం జరుగుతుంది. ఆ మట్టిని అమృత కలశాల్లో భద్రపరిచి అమృత్ కలశ యాత్ర నిర్వహిస్తాం. ఆ మట్టితో ఢిల్లీలో అమృత వాటిక నిర్మాణం జరుగుతుంది' అని మోదీ అన్నారు.

తెలుగు కూడా ప్రాచీన భాషే
'మన సంస్కృతి సంప్రదాయాలతో మమేకం కావాలంటే మాతృభాష శక్తిమంతమైన మాధ్యమం. తెలుగు భాష సాహిత్యంలో వారసత్వ సంపదలో ఎన్నో వెలకట్టలేని రత్నాలు దాగున్నాయి' అంటూ తెలుగు భాషా ప్రాశస్త్యాన్ని మోదీ కొనియాడారు. 'సంస్కృతం మాదిరిగా తెలుగు ప్రాచీన భాషే. ప్రతీ ఏడాది ఆగస్టు 29న తెలుగు భాష దినోత్సవం జరుపుకుంటున్నాం' అని గుర్తుచేసిన ప్రధాని మోదీ తెలుగువారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

చంద్రుడిపై ఉష్ణోగ్రతల్లో వేగంగా మార్పులు

విక్రమ్ పంపిన వివరాలతో వెల్లడవుతోందన్న ఇస్రో

సూళ్లూరుపేట: చంద్రయాన్–3 ప్రయోగం ద్వారా చంద్రుడికి సంబంధించిన ఎన్నో ఆసక్తికర అంశాలు వెల్లడవుతున్నాయి. చంద్రయాన్–3 మిషన్‌లో అంతర్భాగమైన విక్రమ్ ల్యాండర్‌లో అమర్చిన చంద్రాస్ సర్ఫేస్ థర్మో ఫిజికల్ ఎక్స్‌పెరిమెంట్ అనే పేలోడ్ చంద్రుడి ఉపరితలంపై ఉష్ణ లక్షణాలను ఇస్రోకు పంపిస్తోంది. 'చంద్రుడి ఉపరితలంపై 20 లేదా 30 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు కాస్త అటూఇటూగా ఉష్ణోగ్రతలు ఉండొచ్చని అంచనా వేశాం. కానీ, ఆశ్చర్యకరంగా 70 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు అక్కడున్నాయి. మేం ఊహించిన దానికంటే కూడా చాలా ఎక్కువ' అని ఇస్రో శాస్త్రవేత్త బీహెచ్ఎం దారుకేశ ఆదివారం పీటీఐకి చెప్పారు. 'అదేవిధంగా, ఈ పేలోడ్‌లో అమర్చిన కంట్రోల్డ్ పెన్‌ట్రేషన్ మెకానిజం ద్వారా ఉపరితలానికి 10 సెంటీమీటర్ల లోతు వరకు ఉష్ణోగ్రతలను సెన్సార్లతో కొలవచ్చు. ఉపరితలంపై 70 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉండగా కేవలం రెండు, మూడు సెంటీమీటర్ల లోతు కెళ్లే సరికి రెండు మూడు డిగ్రీల సెంటీగ్రేడ్ మేర ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఇంకాస్త లోతుకెళితే –10 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలున్నాయి. ఉపరితలంతో పోలిస్తే రమారమి 50 డిగ్రీలు తేడాతో ఉండటం చాలా ఆసక్తికరమైన అంశం' అని ఆయన తెలిపారు. 'కేవలం 8 సెంటీమీటర్ల లోతుకు వెళ్లగానే అది 10 డిగ్రీలకు పడిపోయింది. మరింత లోతుకు వెళితే మంచు ఆనవాళ్లు ఉన్నట్టుగా తెలుస్తోంది. తాజా పరిశోధనలను బట్టి చంద్రుడిపై ఉష్ణోగ్రతలు చాలా వేగంగా మారుతున్నట్లు స్పష్టమవుతోందని ఇస్రో పేర్కొంది. దక్షిణ ధ్రువానికి సంబంధించిన ఇలాంటి వివరాలను తెలుసుకోవడం ఇదే మొదటిసారని తెలిపింది. ఈ పేలోడ్‌ను విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో స్పేస్ ఫిజిక్స్ లాబొరేటరీ, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ శాస్త్రవేత్తల బృందం అభివృద్ధి చేసింది.

రోవర్‌పై జాతీయ జెండా, ఇస్రో సింబల్
ల్యాండర్ నుంచి విడిపోయి రోవర్ చంద్రుడిపై నెమ్మదిగా అడుగులు వేస్తూ చంద్రుడిపై పరిశోధనలు ఇప్పటికే ప్రారంభించేసింది. చంద్రుడిపై రోవర్ దిగిన వెంటనే భారత ప్రభుత్వం మూడు సింహాలు గుర్తు, ఇస్రో సింబల్‌ను చంద్రుడిపై ముద్రించింది. జాతీయ జెండా, ఇస్రో సింబల్ రోవర్ మీదున్న ఛాయాచిత్రాన్ని ఇస్రో విడుదల చేసింది. ప్రస్తుతం ల్యాండర్‌లో అమర్చిన పేలోడ్స్, రోవర్‌లో అమర్చిన పేలోడ్స్ తమ పనిని చేసుకుంటూ ఇస్ట్రాక్ కేంద్రానికి సమాచారాన్ని అందిస్తున్నాయి.


మహిళలు మాత్రమే పనిచేసే చాక్లెట్ కర్మాగారంలో చాక్లెట్‌లను తయారుచేస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ. ఇటీవల తమిళనాడులోని ఊటీలో రాహుల్ పర్యటించినపుడు అక్కడి మోడీస్ చాక్లెట్స్ ఫ్యాక్టరీని సందర్శించినపుడు తీసిందీ ఫొటో. సంబంధిత వీడియోను రాహుల్ విడుదలచేశారు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
సోమవారం : 28 : ఆగస్టు : 2023


ఎల్లయమ్మన్ ఆలయ హుండీ ఆదాయం రూ. 14 లక్షలు



వేలూరు: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన వెట్టువనం ఎల్లయమ్మన్ ఆలయ హుండీ లెక్కింపు శనివారం చేపట్టారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. అందులో రూ.14 లక్షల నగదు, 37 గ్రాముల బంగారం, 295 గ్రాముల వెండి ఉన్నట్లు తెలిపారు. ఈ కానుకలను బ్యాంకు అధికారుల సమక్షంలో ప్రభుత్వ ఖాతాలో జమ చేశారు. ఈ లెక్కింపులో విరింజిపురం మార్గబందేశ్వరాలయ ఈఓ శ్రీధర్, ఎల్లయమ్మన్ ఆలయ ఈఓ నరసింహమూర్తి, సూపరింటెండెంట్ శరవణబాబు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

శ్రీరంగంలో పవిత్రోత్సవాలు



శ్రీరంగం ఆలయం

సాక్షి, చెన్నై : తిరుచ్చి శ్రీరంగం రంగనాథ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. యాగ శాలపూజతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. 108 వైష్ణవ క్షేత్రాలలో భూలోక వైకుంఠంగా పేరుగాంచిన తిరుచ్చి శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ఏటా ఆణి(శ్రావణ) మాసంలో పవిత్రోత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతాయి. ఈఏడాది తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకకు వేకువ జామున ఆలయంలో జరిగిన పూజలతో శ్రీకారం చుట్టారు. వేకువజామున స్వామి వారికి ప్రత్యేక అభిషేకాది పూజలు జరిగాయి. యాగ శాలలో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. సాయంత్రం స్వామి వారికి తిరుమంజన సేవ, ప్రత్యేక అలంకరణ జరిగింది. రోజు ఉదయం, రాత్రులలో స్వామి వారు భక్తులను కటాక్షించే విధంగా మాడ వీధుల్లో ఊరేగింపు ద్వారా కనువిందు చేయనున్నారు. ఇదిలాఉండగా, తూత్తుకుడి జిల్లా తిరుచెందూరులో ప్రసిద్ధి చెందిన సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆణి ఉత్సవాలు సెప్టెంబరు నాలుగో తేది ప్రారంభం కానున్నట్టు అధికారులు ప్రకటించారు.

పర్యావరణ కావ్యం నేనిలా.. తానలా



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జేకే రెడ్డి , మధు

కొరుక్కుపేట: నేనిలా.. తానలా.. అనే పుస్తకం పర్యావరణ కావ్యమని అవధానుల మణిబాబు అభిప్రాయ పడ్డారు. వేద విజ్ఞాన వేదిక తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 140వ ప్రసంగం ఆదివారం రాత్రి జరిగింది. దీనికి స్థానిక టి నగర్ ఆంధ్రా క్లబ్ లోని కస్తూ హాల్ వేదికైంది.నేనిలా... తానలా... దీర్ఘ కవిత అనే అంశంపై కాకినాడకు చెందిన అవధానుల మణిబాబు వక్తగా పాల్గొని మాట్లాడారు. స్వీయ కవితాలాపన, విశ్లేషణతో ఆద్యంతం అలరించారు. నేనిలా... తానలా...ఒక సంవాద కవిత అని పేర్కొంటూ ఈ పుస్తకానికి కవిని నేనే, విమర్శకుడి ని నేనే అని అన్నారు. ఇది ఓ పర్యావరణ కావ్యం అని చెప్పారు. సముద్రంతో మాట్లాడిన సంభాషణలు, సముద్రం, కెరటాలు ఇచ్చే సందేశాలను ఆసక్తికరంగా ఉంటాయన్నారు. సముద్రం ఓ ప్రయోగ శాల వంటిందని పేర్కొన్నారు. మానవుని జీవితాన్ని మలుచుకోవడం సముద్ర కెరటాలను చూసి నేర్చుకోవచ్చు అని అభిప్రాయ పడ్డారు. ముందుగా వేదిక ప్రధాన కార్యదర్శి కందనూరు మధు స్వాగతం పలుకగా, వక్త అవధానుల మణిబాబును వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి సభకు పరిచయం చేసి ఘనంగా సత్కరించారు. అంతకు ముందు రచయిత ప్రణవి రచించిన మధువనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని జేకే రెడ్డి పరిచయం చేసి వేద విజ్ఞాన వేదిక సభలో ఘనంగా ఆవిష్కరించారు. ఇందులో ప్రణవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రెండు కార్లు - వ్యాన్ ఢీ

- తల్లీ కుమారుడి మృతి

అన్నానగర్: ఈరోడ్ కరుంగల్ పాలయానికి చెందిన శరవణన్ (27). ఆదివారం ఉదయం తన తల్లిదండ్రులు తిరుమూర్తి–దేవి, సోదరి సౌమ్యతో కలిసి పళని ఆలయానికి బయలుదేరారు. తిరుపూర్ జిల్లా తారాపురం సమీపంలోని మనకడవు ప్రాంతంలో ప్రయాణిస్తుండగా.. ముందున్న కారును ఓవర్ టేక్ చేసేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టడంతో పాటు ఆటు వెళ్తున్న మరో కారును ఢీకొట్టింది. శరవణన్ తో పాటు అతని తల్లిదండ్రులు, సోదరి గాయపడ్డారు. శరవణన్, దేవి అక్కడికక్కడే మృతి చెందారు. మరో కారులోని కాంగేయం ఓలపాళయం ప్రాంతానికి చెందిన డ్రైవర్ ఆనందన్, అభిరామి, అజయ్, హాసిని, లలిత గాయపడ్డారు. గాయపడిన ఏడుగురిని రక్షించి చికిత్స నిమిత్తం తారాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టూర్ వ్యాన్‌లోని ప్రయాణికులు అదృష్టవశాత్తు సురక్షితంగా బయటపడ్డారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ నేతకు బెదిరింపులు

కొరుక్కుపేట: మాజీ ఎమ్మెల్యే, పుదుచ్చేరి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సామినాథన్‌కు అసభ్యకర మెసేజీలు పంపడంతో పాటు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. వివరాలు.. సామినాథన్ ఇల్లు లాస్‌పేట పుదువీధిలో ఉంది. ఈ ఏడాది ఇటీవల ఆయన సెల్‌ఫోన్ వాట్సాప్ ఖాతాకు ఓ మెసేజ్ వచ్చింది. కొద్ది రోజుల తర్వాత ఓ వీడియో కాల్ వచ్చింది. అందులో ఓ మహిళ అసభ్యకరంగా కనిపించడంతో స్వామినాథన్ వెంటనే కాల్ కట్ చేశాడు. అయితే వీడియో కాల్‌ని ముగించిన తర్వాత, సదరు ఫోన్ నంబరు నుంచి వెంటనే రూ.50 వేలు చెల్లించాలని, లేకుంటే స్వామినాథన్ నంబర్‌తో స్క్రీన్‌షాట్ తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని బెదిరించారు. దీంతో స్వామినాథన్ పుదుచ్చేరి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సదరు ఫోన్‌నంబర్ నుంచి రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి మాట్లాడుతున్నాడని తేలింది.

అవినీతి ఊబిలో బీజేపీ

బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అవినీతి ఊబిలో కూరుకు పోయిందని సీఎం ఎంకే స్టాలిన్ ఆరోపించారు. కేంద్రంలో ప్రతి పనిలోనూ లంచగొండి తనం తాండవం చేస్తోందని ధ్వజమెత్తారు. వారు చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే తమ నాయకులపై ఐటీ, ఈడీ, సీబీఐ ద్వారా దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి కక్ష సాధింపు చర్యలు, బెదిరింపులకు తాను భయపడబోనని తేల్చి చెప్పారు.

- కేంద్ర ప్రభుత్వంలో లంచావతారాలు
- తప్పులు కప్పి పుచ్చుకునేందుకే ప్రతిపక్షాలపై దాడులు
- కక్షసాధింపు చర్యలకు భయపడే ప్రసక్తే లేదు
- సీఎం స్టాలిన్ స్పష్టీకరణ
- తిరువారూర్ నుంచి ఎన్నికల ప్రచారం



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

సాక్షి, చెన్నై : డెల్టా జిల్లాల పర్యటనలో భాగంగా తిరువారూర్‌లోని తన స్వస్థలంలో బస చేసిన సీఎం స్టాలిన్ ఆదివారం ఉదయం అక్కడి వీధుల్లో వాకింగ్ చేశారు. సన్నిధి వీధిలోని ఇంటి నుంచి ఆయన బయటకురాగానే అక్కడి ప్రజల్లో ఆనందం వెల్లి విరిసింది. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. తర్వాత వారితో ముచ్చటిస్తూ వాకింగ్ పూర్తి చేశారు. అనంతరం నాగపట్నం సీపీఐ ఎంపీ సెల్వరాజ్ ఇంటి శుభ వేడుకకు హాజరయ్యారు. ఇక్కడ జరిగిన సభలో సీఎం ప్రసంగించారు.

వారికి అర్హత లేదు..

అవినీతి గురించి మాట్లాడే అర్హతను బీజేపీ కోల్పోయిందని ధ్వజమెత్తారు. మతత్వాన్ని చేతిలోకి తీసుకుని ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాల్లో బీజేపీ పాలకులు ఉన్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నామని గుర్తు చేస్తూ, ఈ ఎన్నికలను సమష్టిగా ఎదుర్కొని క్లీన్‌స్వీప్ లక్ష్యంగా కూటమి పార్టీల కార్యకర్తలు శ్రమించాలని పిలుపు నిచ్చారు. బీజేపీ చేతిలో నుంచి భారతదేశాన్ని రక్షించుకోవాల్సిన అవశ్యం ఏర్పడిందన్నారు. అందుకే ఇండియా కూటమిగా అన్ని పార్టీలు గెలుపే లక్ష్యంగా కార్యాచరణలో నిమగ్నమయ్యాయని పేర్కొన్నారు. ముంబైలో నిర్వహించనున్న ఇండియా కూటమి సమావేశంలో కీలక నిర్ణయాలను ప్రకటించే అవకాశం ఉందన్నారు.

సుపరి పాలన దిశగా..

తమిళనాడులో సుపరి పాలన దిశగా తాము పథకాలను విస్తృతం చేస్తుంటే, చూసి ఓర్వలేక, వాళ్లు చేసిని అవీతిని కప్పిపుచ్చుకునేందుకు ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులను ఉసిగొల్పి బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను విస్మరించి కేంద్ర పాలకులకు తమను నిందించే అర్హత లేదన్నారు. ఇచ్చిన, ఇవ్వని హామీలను కూడా తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు. మతతత్వ ముసుగులో దేశాన్ని విభజించే కుట్రలు కేంద్రంలో సాగుతున్నాయని , భారతమాల ప్రాజెక్ట్, ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ ప్రాజెక్ట్, కస్టమ్స్ ఛార్జీలు, ఆయుష్మాన్ భారత్ పథకం తదితర ఏడు కేంద్ర పథకాల్లో కోట్లాది రూపాయల అవినీతి జరిగి ఉందని ఆరోపించారు. వీటన్నింటిపై ప్రధాని నరేంద్రమోదీ పెదవి విప్పాలని, వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాజాగా కాగ్ విడుదల చేసిన నివేదికలో పరనూరుతో పాటు ఐదు టోల్‌గేట్లలో రూ. 132 కోట్ల అవినీతి జరిగినట్లు స్పష్టమైందన్నారు. వీటన్నింటిపై ప్రధాని స్పందించని పక్షంలో, అవినీతి గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదన్న నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామన్నారు.

తిరువారూర్ నుంచే ప్రచారం..

ప్రతి ఎన్నికలలో తానూ తిరువారూర్ నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతానని గుర్తు చేస్తూ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇక్కడి నుంచి మొదలెట్టనున్నట్లు ప్రకటించారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనకు చరమ గీతం పాడేందుకు తిరువారూర్ నుంచి సమర శంఖం పూరించబోతున్నట్లు పేర్కొన్నారు. డీఎంకే కూటమి బలంగా ఉందన్న విషయాన్ని గ్రహించే తీవ్ర కుట్రలు, వ్యూహాలకు పదును పెట్టే పనిలో కేంద్రం పాలకులు ఉన్నారని ధ్వజమెత్తారు. వీరిని చూసి భయపడే పార్టీ డీఎంకే కాదని, ఎలాంటి ప్రతిఘటనకైనా తాము సిద్ధం అన్న విషయాన్ని ఓ మారు చరిత్ర చూసి గుర్తుకు తెచ్చుకోవాలని కేంద్ర పాలకులను హెచ్చరించారు. ఇటీవల తిరుచ్చి విమాన ప్రమాదంలో మరణించిన పోలీసు అధికారి శ్రీధర్ కుటుంబాన్ని సీఎం పరామర్శించి వారికి రూ. 25 లక్షలు సాయం అందజేశారు.





సన్నిధి వీధిలో సీఎం వాకింగ్



పిల్లలతో ముచ్చటిస్తూ..

ఆరోగ్య సిబ్బందిపై మంత్రి ఆగ్రహం

- శాఖాపరమైన చర్యలకు ఆదేశాలు



రికార్డులను పరిశీలిస్తున్నమంత్రి ఎం. సుబ్రమణియన్

సాక్షి, చెన్నై: ఆకస్మిక తనిఖీల సమయంలో విధుల్లో లేని ఆరోగ్య సిబ్బందిపై ఆ శాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో లేని వారందరిపై శాఖ పరంగాచర్యలకు ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. వివరాలు.. ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ తిరునల్వేలి పర్యటనకు వెళ్లారు. ఆదివారం ఉదయం ఆయన దిశయన్ విలైలోని అప్‌గ్రేటెడ్ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో కేవలం నర్సులు మాత్రమే కొందరు అక్కడ ఉన్నారు. వైద్యులు, ఇతర ల్యాబ్ టెక్నీషియన్ తదితర సిబ్బంది ఏఒక్కరూ లేరు. దీంతోమంత్రి ఆగ్రహానికి లోనయ్యారు. విధుల్లో ఉండాల్సినవారంతా ఏమయ్యారని ప్రశ్నించారు. అక్కడున్న నర్సులు మౌనం వహించడంతో తక్షణం ఆరోగ్య శాఖఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పని సమయంలో విధుల్లో లేని వారి వివరాలను సేకరించారు. అందరిపై శాఖ పరమైన చర్యలకు ఆదేశించారు. అలాగే కొత్తగా కొనుగోలు చేసిన మొబైల్ అంబులెన్స్ ఆసుపత్రి వాహనాన్ని మూలన పడేసి ఉండటాన్ని చూసి మంత్రి నివ్వెర పోయారు. అందులో అత్యాధునిక పరికరాలు, మందుల బాక్సులు ఉండటం చూసి ఆగ్రహనికి లోనయ్యాడు. డ్రైవర్ విధులకు హాజరు కాక పోవడంతోనే ఇక్కడే నిలుపుదల చేయాల్సిన పరిస్థితి వచ్చిందని నర్సులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డ్రైవర్‌పైన కూడా శాఖపరంగా చర్యలకు ఆదేశించారు. విధుల్లో లేని వారందరిపై శాఖ పరంగా చర్యలకు ఆదేశించినట్టు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మంత్రి పేర్కొన్నారు. భద్రత లేకుండా మొబైల్ అంబులెన్స్‌ను మూలన పడేశారని, ఇందులో ఉన్న మందులు నిరుపయోగం చేయడాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని, ఏ ఒక్కరినీ ఈ వ్యవహారంలో వదలి పెట్టబోమని హెచ్చరించారు. అలాగే ఆసుపత్రుల ముందు పాము, కుక్కకాటుకు సంబంధించిన మందుల వివరాలతో బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మందుల నిల్వలకు సంబంధించిన సమగ్ర వివరాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక బోర్డులలో పొందు పరిచి ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

ఘనంగా ఒలింపియాడ్ ఫైనల్స్



సాక్షి, చెన్నై : తమిళనాడులోని రాజస్థానీ అసోసియేషన్ నేతృత్వంలో ఒలింపియాడ్ - 2023 గ్రాండ్ ఫైనల్స్ ఆదివారం చెన్నై నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగింది. 1400 మంది విద్యార్థులు ముగింపు వేడుకకు హాజరయ్యారు. ఇందులో కార్పొరేషన్ మేయర్ ప్రియ రాజన్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌లాల్ బజాజ్, తమిళనాడు, పుదుచ్చేరి సరిహద్దు భద్రతా దళం కమాండెంట్ కుల్దీప్ చౌదరి, ఆదాయ పన్ను శాఖ కమిషనర్ సునీల్ మాథుర్, టాబ్లెట్స్ ఇండియా సీఈఓ ఆర్‌కే జాన్వర్, భారత క్రికెట్‌జట్టు సెలెక్టర్ శ్రీధరన్ శరత్‌లు సత్కరించారు.

'చెక్ డ్యాం' పేరిట రూ. 30 లక్షలు హాంఫట్

- ఏడుగురిపై కేసు

సాక్షి, చెన్నై: చెక్ డ్యాం నిర్మాణాల పేరిట రూ. 30 లక్షలను మింగేసిన అధికారుల భరతం పట్టే విధంగా ఏసీబీ ఆదివారం కేసులు నమోదు చేసింది. ముగ్గురు అధికారులు సహా ఏడుగురిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసులను నమోదు చేసి విచారించేందుకు సిద్ధమయ్యారు. వివరాలు.. పెరంబలూరు జిల్లా వేపన్ తట్టై యూనియన్ పరిధిలోని మదురు వాగు, కోటారు వాగు, మురుగన్ ఆలయ వాగులలో మూడు చోట్ల చెక్ డ్యాంల నిర్మాణానికి 2019–20లో రూ. 34.65 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. మమా అనిపించే విధంగా రూ. నాలుగు లక్షలతో పనులు ప్రారంభించినట్టు తొలుత లెక్కలు చూపించారు. ఆ తర్వాత పనులు ముగించినట్టుగా కాంట్రాక్టర్లకు బ్యాంక్‌ల ద్వారా మిగిలిన మొత్తాన్ని అధికారులు మంజూరు చేశారు. అయితే, చెక్ డ్యాంల నిర్మాణాలు ఎక్కడ కనిపించ లేదు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పెరంబలూరు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ రామేశ్వరం నేతృత్వంలోని బృందం రహస్యంగా విచారించింది. ఓ చోట మాత్ర మమా అనిపించే విధంగా పనులు చేపట్టి, మిగిలిన చోట్ల పనులు ముగించినట్లు లెక్కలు చూపించడం విచారణలో తేలింది. రూ. 30.3 లక్షలను పనులు చేయకుండానే మింగేసినట్టు వెలుగు చూసింది. దీంతో అప్పట్లో పెరంబలూరులో పనిచేసిన ఇంజనీరింగ్ అధికారి నాగరాజన్, ఆర్డీఓ అరిలగన్, యూనియన్ కార్యదర్శి మణివణ్ణన్ హస్తం ఇందులో ఉన్నట్టు తేలింది. తమకు కావాల్సిన కాంట్రాక్టర్లు దురైస్వామి, రాణి, సతీష్‌కుమార్, వెట్రివేల్‌కు ఈపనులు అప్పగించి, పనులు చేయకుండానే నిధులు డ్రా చేసి మింగేసినట్లు తేలింది. దీంతో ముగ్గురు అధికారులు, నలుగురు కాంట్రాక్టర్లపై ఏసీబీ కేసు నమోదైంది.

అమ్మడీఎంకే?

- కొత్త పార్టీ కసరతుల్లో పన్నీరు



సాక్షి, చెన్నై: మాజీ సీఎం పన్నీరు సెల్వం కొత్త పార్టీ కసరత్తుల్లో ఉన్నట్టు సంకేతాలు వెలువడ్డాయి.ఈ పార్టీకి అమ్మ డీఎంకే అనే పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. వివరాలు.. అన్నాడీఎంకేను కై వశం చేసుకునేందుకు మాజీ సీఎం పన్నీరు సెల్వం చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టులో, కేంద్ర ఎన్నికల కమిషన్ వద్ద చుక్కెదురైంది. పళని స్వామి అనుకూలంగా తీర్పులు వెలువడ్డాయి. చివరకు సర్వ సభ్య సమావేశ తీర్మానాల విషయంలో తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని ఎదురుచూసి భంగ పడ్డారు. ఈ వ్యవహారంలోనూ పళని స్వామినే విజయం వరించింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఆ పార్టీ పగ్గాలను పూర్తిగా పళని స్వామి తన గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. దీంతో పన్నీరుకు భంగపాటు తప్పలేదు. ఇక, అన్నాడీఎంకే కై వశం ప్రయత్నాలను పక్కన పెట్టి తనను నమ్మి వచ్చిన వారి కోసం, తనకు అండగా ఉన్న కేడర్ చేజారకుండా జాగ్రత్తలకు పన్నీరు సెల్వం సిద్ధమయ్యారు. ఇందుకోసం కొత్త పార్టీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తమ కంటూ ఓ పత్రికను ఏర్పాటు చేశారు. ఈ పత్రిక ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కొత్త వ్యూహాలకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఆయన అన్నాడీఎంకేను ఇరకాటంలో పెట్టే రీతిలో కొత్త పార్టీ వైపుగా అడుగులు వేస్తున్నట్టు మద్దతుదారులు పేర్కొంటున్నారు. ఈ పార్టీకి అమ్మడీఎంకే అన్న పేరును పరిశీలిస్తున్నట్టు సంకేతాలు వెలువడ్డాయి. ఇప్పటికే అన్నాడీఎంకే నుంచి చీలికతో దినకరన్ నేతృత్వంలో అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ఆవిర్భవించి ఉంది. ఇది విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లి ఉంది. ఈ దృష్ట్యా, అన్నా డీఎంకేకు ప్రత్యామ్నాయంగా అమ్మడీఎంకే అన్న పేరును పరిశీలిస్తున్నామని ఓ నేత పేర్కొన్నారు. మరికొద్ది రోజుల్లో పార్టీ ప్రకటన, మహానాడుకు సిద్ధమవుతున్నామని ఆ నేత తెలిపారు. లోక్‌సభ ఎన్నికలలో పన్నీరు పార్టీ పోటీకి దిగడం ఖాయం అని ధీమా వ్యక్తంచేశారు. కేంద్రంలోని బీజేపీ తమను మోసం చేసిందని అందుకే ఆ కూటమికి ప్రత్యామ్నాయంగా అమ్మ డీఎంకే అడుగుల వేగం పెంచడం ఖాయం అని మరో నేత పేర్కొనడం గమనార్హం.

ఆకట్టుకున్న పురాతన కార్ల ప్రదర్శన



సాక్షి, చెన్నై : ది హిస్టారికల్ కార్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(హెచ్‌సీఏఐ) నేతృత్వంలో ఆదివారం చెన్నైలో పురాతన కార్ల ప్రదర్శన జరిగింది. రాయల్ టెక్ పార్క్‌లో జరిగిన ఈ ప్రదర్శనను చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్ ప్రారంభించారు. హెచ్‌సీఏఐ అధ్యక్షుడు రంజిత్ ప్రతాప్, కార్యదర్శి వీఎస్ కై లాష్, ఉపాధ్యక్షుడు రాజేష్ ఈ పురాతన కార్ల ప్రదర్శనకు హాజరయ్యారు. 56 పురాతన కార్లు, 12 పురాతన మోటారు సైకిళ్లను ఈ ప్రదర్శనలో ఉంచారు.

లక్నోకు మృతదేహాల తరలింపు

- 28 మంది బాధితులు కూడా..
- పోలీసుల అదుపులో ముగ్గురు ట్రావెల్ ఏజెన్సీ ప్రతినిధులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన రైల్వే ఉన్నతాధికారులను
- సగం కాలిన స్థితిలో భారీగా రూ.200, రూ. 500 నోట్లు



సంఘటనా స్థలంలో అధికారుల పరిశీలన



మాట్లాడుతున్న చౌదరి

సాక్షి, చెన్నై: మదురై రైలు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను, బాధితులను ప్రత్యేక విమానంలో ఆదివారం లక్నోకు తరలించారు. ఈ ప్రమాదం అనంతరం తప్పించుకెళ్లిన ట్రావెల్ ఏజెన్సీకి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని రైల్వే పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఘటనా స్థలాన్ని మదురై రైల్వే స్టేషన్‌లో రైల్వే ఉన్నతాధికారులు, భద్రతా కమిషన్ వర్గాలు పరిశీలించాయి. దగ్ధమైన బోగీలోని ఓ ఇనుప పెట్టెలో రూ. లక్షలు విలువైన రూ.200, రూ. 500 నోట్ల కట్టలు కాలిన స్థితిలో బయటపడ్డాయి. వివరాలు.. మదురై జంక్షన్ రైల్వే స్టేషన్‌లో శనివారం ఉదయం ప్రత్యేక పర్యాటక రైలు బోగీ గ్యాస్ సిలిండర్ పేలుడుతో దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది ఉత్తరాది వాసులు మరణించారు. వీరి మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి స్వస్థలాలకు ప్రత్యేక బాక్సులలో ఉంచి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. మదురై నుంచి చెన్నైకు రోడ్డు మార్గంలో అంబులెన్స్‌లలో మృతదేహాలను తీసుకొచ్చారు. ప్రమాదం నుంచి బయటపడ్డ బాధితులు 28 మంది ప్రత్యేక బస్సుల్లో చెన్నైకు చేర్చారు. ఇక్కడి నుంచి ప్రత్యేక విమానంలో లక్నోకు వీరందరినీ తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ రైలు బోగీలో లక్నోకు చెందిన ట్రావెల్ ఏజెన్సీకి చెందిన ఎనిమిది మంది సిబ్బంది సమాచారం . ప్రమాదం జరగ్గానే వీరంతా ఉడాయించారు. వీరిలో ముగ్గురిని రైల్వే పోలీసులు ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. లక్నోలో రైలు బయలు దేరిన సమయంలో జరిగిన తనిఖీల సమయంలో సిలిండర్, స్టౌవ్‌లు లేవని, అయితే, ఎలా వీటిని ట్రావెల్ ఏజెన్సీ సిబ్బంది లోనికి తీసుకొచ్చారో అన్న విచారణ జరుగుతోంది. ట్రావెల్ ఏజెన్సీ తప్పిదం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు స్పష్టమవుతోంది. ఈ ప్రమాదం కేసులో తొలి నిందితుడిగా ట్రావెల్ ఏజెన్సీ మేనేజర్ పేరును పోలీసులు చేర్చారు. కాఫీ తయారీ సమయంలోనే మంటలు చెలరేగినట్టు అక్కడే ఉన్న తన భర్త కూడా ఈ ప్రమాదంలో మరణించారని రేణు గుప్తా అనే ప్రయాణికురాలు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. తమతో పాటు వచ్చిన అవ్వతాత ఈ ప్రమాదంలో మరణించిన సమాచారం తెలియక వారి మనవళ్లు, అవ్వతాత ఎక్కడ అంటూ ఇతర కుటుంబ సభ్యులను ప్రశ్నించడం అందరినీ కలచి వేసింది.

ఉన్నతాధికారుల విచారణ..

ప్రమాదం జరిగిన రైలు బోగీని దక్షిణరైల్వే జీఎం ఆర్ఎన్ సింగ్, రైల్వే భద్రతా కమిషనర్ ఏఎం చౌదరి వేర్వేరుగా పరిశీలించారు. బోగీలోపలి భాగాన్ని పరిశీలించారు. సంఘటన గురించిన వివరాలను విచారణ బృందం వారికి వివరించారు. రైలులోకి గ్యాస్ సిలిండర్ ఎలా వచ్చిందో మిస్టరీగా మారడంతో సమగ్ర విచారణపై దృష్టి పెట్టారు. రైలులో చట్ట విరుద్ధంగా సిలిండర్ తీసుకొచ్చారని, ట్రావెల్ ఏజెన్సీ ప్రతినిధులను తొలి నిందితులుగా ఈ కేసులో పేర్కొనడం జరిగిందన్నారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యచికిత్స అందుతోందని పేర్కొన్నారు.

కట్టలు కట్టలుగా నోట్లు..

రైలు బోగీలోని ప్రయాణికులకు సంబంధించిన వస్తువులన్నీ దాదాపుగా దగ్ధమయ్యాయి. కొన్ని ట్రంక్ పెట్టెలు తరహా సూట్ కేసులను తెరిచి అందులో ఉన్న వస్తువులను విచారణ బృందం పరిశీలించింది. ఓ పెట్టెలో రూ. 200 నోట్ల కట్టలు, రూ. 500 నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఇవన్నీ సగానికి సగం కాలిన స్థితిలో ఉన్నాయి. వీటి విలువ కొన్ని లక్షలు ఉండవచ్చునని పేర్కొంటున్నారు. ఈ తనిఖీల సమయంలో హఠాత్తుగా బోగీలో ఓ చోట పొగ రావడంతో అధికారులు కొద్దిసేపు ఆందోళనకు గురయ్యారు. సిబ్బంది అప్రమత్తపై మంటలను ఆపివేశారు. రైలు బోగి ఆపి ఉన్న పరిసరాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు క్షుణ్ణంగా అన్ని రకాల ఆధారాలను పరిశీలించి సేకరిస్తున్నారు.

సిగ్నల్ లోపంతో ఆగిన రైళ్లు

- ప్రయాణికుల అవస్థలు

కొరుక్కుపేట: అరక్కోణం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున సిగ్నల్ లోపం కారణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఎలక్ట్రిక్ రైళ్లు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాలు.. రాణిపేట జిల్లా అరక్కోణం – మేల్‌పాక్కం రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం ఉదయం 5.05 గంటలకు పట్టాల పాయింట్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ఈ మార్గంలో రైళ్లు నడవలేని పరిస్థితి నెలకొంది. దీనిపై సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పాయింట్ల వద్ద లోపాలను సరిదిద్దే పని చేపట్టారు. ఇంతలో సిగ్నల్ రిపేరు కారణంగా కోయంబత్తూరు నుంచి చెన్నైకి వచ్చే చేరన్ ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైలు మధ్యలో ఆగిపోయాయి. అలాగే అరక్కోణం నుంచి తిరుత్తణి వెళ్లే ఎలక్ట్రిక్ రైలు, అరక్కోణం నుంచి కాంచీపురం మీదుగా కాంచీపురం వెళ్లే ఎలక్ట్రిక్ రైలు అరక్కోణం రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయాయి. ఈక్రమంలో రైల్వే సిబ్బంది ఉదయం 6.06 గంటలకు సమస్యను సరిచేశారు. ఫలితంగా చాలా రైళ్లు ఆలస్యంగా బయలుదేరుతాయి. అరక్కోణం, పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. దీంతో పాయింట్ ఏరియాల్లోని విద్యుత్ లైన్లలో వర్షపు నీరు చేరిందా లేక మరేదైనా కారణమా? అనే కోణంలో రైల్వే అధికారులు ఆరా తీస్తున్నారు.

చెన్నై
సోమవారం । 28 । ఆగస్టు । 2023
సాక్షి

క్లుప్తంగా

నీట్ ప్రామాణికం కాదు



సమావేశంలో మాట్లాడుతున్న వీరమణి

తిరుత్తణి: వైద్య విద్యకు నీట్‌ను అర్హతగా చూడరాదని ద్రవిడర్ కళగం అధ్యక్షుడు వీరమణి అన్నారు. తిరుత్తణిలో ద్రవిడకళగం నేత పాదటూరు పువియరసన్ జన్మదినం సందర్భంగా తిరువళ్లువర్ సూక్తులు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ద్రవిడ కళగం అధ్యక్షుడు వీరమణి, ద్రవిడ తమిళర్ పేరవై ఆర్గనైజర్ సుబవీరపాండ్యన్ చేతుల మీదుగా పుస్తకావిష్కణ చేశారు. షణ్ముగం బవాణి, సురేంద్రన్ కుముద తొలి ప్రతిని స్వీకరించారు. ఈ సందర్భంగా వీరమణి మాట్లాడుతూ.. కేంద్రం ఏకపక్షంగా నీట్‌ను విద్యార్థులపై రుద్దడం తగదన్నారు.

స్కూటీ నుంచి పడి మహిళా ఇంజినీర్ మృతి

తిరువొత్తియూరు: చెన్నై పూందమల్లి సమీపంలో స్కూటర్ నుంచి అదుపుతప్పి కిందపడి.. ఓ మహిళ ఇంజినీర్ మృతి చెందింది. వివరాలు.. పూందమల్లి క్వీన్ విక్టోరియా రోడ్డుకు చెందిన హనిగ్రేస్ (30) అంబత్తూరులోని ఓ ప్రైవేటు కంప్యూటర్ సంస్థలో పనిచేస్తున్నారు. శుక్రవారం మధురవాయల్ నుంచి తన బంధువు ఇంటికి వెళ్లి తిరిగి రాత్రి స్కూటీపై ఇంటికి బయలుదేరారు. పూందమల్లి హైవే రోడ్డులోని వానగరం వద్ద వెళ్తుండగా హఠాత్తుగా స్కూటర్ అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో ఆమె తలకు తీవ్రగాయమై ఘటన స్థలంలోని మృతి చెందారు. ఆవడి ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మౌంట్ రోడ్డులో హ్యాపీ స్ట్రీట్ షో

కొరుక్కుపేట: చెన్నైలోని మౌంట్ రోడ్డులో హ్యాపీ స్ట్రీట్ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. మౌంట్ రోడ్డు స్పెన్సర్ జంక్షన్ నుంచి చెన్నైలోని జేపీ రోడ్ జంక్షన్ వరకు ఈ కార్యక్రమం జరిగింది. అందులో పాల్గొన్న వారు ఆడుతూ పాడుతూ గడిపారు. ఇందుకోసం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు ఆ వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. చెన్నై నడిబొడ్డుగా అభివర్ణించే అన్నాసాలై (మౌంట్ రోడ్డు) ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అన్నాసాలైకు ఇరువైపులా ఆట పాటలు వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో చిన్నారుల నుంచి పెద్దల వరకు పాటలు, నృత్యాలతో గడిపారు. యోగా, ఫిట్‌నెస్ వంటి ఇతర ప్రసిద్ధ క్రీడలు వ్యాయామాలు జరిగాయి. చెన్నై వంటి పెద్ద నగరాల్లో రద్దీగా ఉండే వాతావరణంలో అన్నాసాలైపై ఇలాంటి ఘటన జరగడం హర్షణీయమని, ఉల్లాసంగా ఉందని సామాన్య ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

శిల్పకళా ఉత్సవ్ ప్రారంభం



ఆకట్టుకుంటున్న గణపయ్య ప్రతిమలు



ఆభరణాలను తిలకిస్తున్న ప్రజలు

తిరువొత్తియూరు: హస్త కళాకారుల సంక్షేమం కోసం నగరంలో శిల్పకళా ఉత్సవ్ పేరిట చేనేత, హస్తకళా ప్రదర్శన ఆదివారం ఏర్పాటైంది. ఈ ప్రదర్శనకు స్థానిక ఆల్వారుపేట, టీటీకే రోడ్డులోని శ్రీ శంకర హాలు వేదికగా నిలిచింది. ఈ ప్రదర్శనలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన చేనేత, హస్త కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. ఇందులో రాజస్థానీ జ్యువెలరీ, ఇత్తడి విగ్రహాలు, కాశ్మీరీ శాలువలు, చీరలు, డ్రెస్ మెటీరియల్స్, గోల్డ్ పాలిష్ జ్యువలరీ, రాజస్థానీ కుర్తీస్, బెడ్ షీట్లు, కాంత వర్క్ శారీస్, జోధ్పూర్ ఫర్నిచర్, గుజరాతి బెడ్ షీట్స్, తంజావూరు పెయింటింగ్స్, చెన్నపట్నం టాయ్స్, వారణాసి వుడెన్ వర్క్స్ తదితరాలు ఉన్నాయి. ప్రత్యేకంగా వినాయక చవితిని పురస్కరించుకుని గణపయ్య బొమ్మల కొలువు విశేష ఆకర్షణగా ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన సెప్టెంబర్ 3వ తేదీ వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పోలీసు విచారణకు భయపడి విషం తాగిన యువతి

అన్నానగర్: ధర్మపురి సమీపంలో ఆదివారం పోలీసుల విచారణకు భయపడి ఓ యువతి విషం తాగడం సంచలనం కలిగించింది. వివరాలు.. ధర్మపురి జిల్లా పులుదిక్కరై పంచాయతీకి చెందిన చిన్నస్వామి కుమారుడు వెట్రివేల్ (29), జేసీబీ ఆపరేటర్. ఇతని భార్య సోబిక (24). వీరికి ఇద్దరు కుమార్తెలు. కొన్ని రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం సోబిక ఇంటి నుంచి అదృశ్యమైంది. ఈ విషయమై వెట్రివేలు ఫిర్యాదు మేరకు కృష్ణాపురం పోలీసులు కేసు నమోదు చేసి సోబిక సెల్‌ఫోన్‌కు సంప్రదించి శనివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. పోలీసుల విచారణకు భయపడిన సోబిక విషం తాగి స్పృహ తప్పి పడిపోయింది. ఆమెని రక్షించి ధర్మపురి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

హాస్టల్ విద్యార్థులకు సహాయకాలు పంపిణీ



సహాయకాలు అందజేస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: శ్రావణాల పౌర్ణమి సందర్భంగా శ్రేష్ఠ సేవా సంఘం తరఫున స్థానికంగా ఉన్న ఎస్‌కేపీపీడీ ఉచిత హాస్టల్ విద్యార్థులకు ధోతీ, షార్ట్‌లు, సహాయకాలను ఉచితంగా అందజేశారు. ఇందులో సంఘం అధ్యక్షుడు జిల్లా సతీష్ కుమార్, కార్యదర్శి ఉప్పుటూర్ నరసింహన్, కోశాధికారి కె.జయకుమార్, సంఘ వ్యవస్థాపకులు గ్రంధి లక్ష్మి శేఖర్, డాక్టర్ టి.మోహన శ్రీ, బోర్డు సభ్యులు, వాలంటర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రావణ పౌర్ణమి ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు.

విద్యార్థిని ఆత్మహత్య

అన్నానగర్: పుదుకోట్టై జిల్లా కీరనూర్ సమీపం నార్తమలైకి చెందిన పెరియసామి. ఇతని కుమార్తె లత్తికా (19) పుదుకోట్టైలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతోంది. శనివారం ఒడుకత్తలై అనే విషపు ఆకు తిని ఇంట్లో అపస్మారక స్థితిలో పడిపోయింది. దీంతో సభ్యులు ఆమెను పుదుకోట ప్రభుత్వ మెడికల్ యూనివర్సిటీ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ లత్తికా ఆదివారం ఉదయం మృతి చెందింది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలపై కిరణూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా విశ్వజనని వైభవం



సదస్సులో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

కొరుక్కుపేట: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా వీ 502 ఏ రీజన్ – 7 ఆధ్వర్యంలో విశ్వజనని వైభవం రీజనల్ సదస్సు ఘనంగా జరిగింది. స్థానిక ప్యారిస్‌లోని వరదా ముత్తియ్యప్పన్ వీధిలోని పీఎల్‌టీ చారిటీస్‌లో ఆదివారం ఉదయం వాసవీమాత పూజలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రీజియన్ చైర్ పర్సన్ బోగనాథం శివకుమార్ అధ్యక్షత వహించారు. ముందుగా ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ మృతి చెందిన వాసవీ క్లబ్‌ల నిర్వాహకులకు ఓ నిమిషం మౌనం పాటించారు. వీసీఐ వైస్ ప్రెసిడెంట్ డీకే బాలమురుగన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్‌లు చేస్తున్న సామాజిక సేవలు ఎనలేనివని, మరింతగా చేపట్టాలని సూచించారు. ఎం.కృష్ణ కుమార్, ముంజులూరు మురళి మోహన్, కె. భాస్కరన్, డియ సుమ వంశీ తదితరులు పాల్గొని వాసవీ క్లబ్‌ల సేవలను గురించి వివరించారు. వాసవీ క్లబ్ షావుకారుపేట చెన్నై, వనిత క్లబ్‌ల పర్యవేక్షణలో క్లబ్‌ల అధ్యక్షులు ఎస్వీ పద్మనాభం, విష్ణుప్రియా, కోశాధికారులు ఎస్. మోహన్ దాస్, భువనేశ్వరిలు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

అథ్లెటిక్ మీట్‌లో సత్తాచాటిన సెయింట్ జోసెఫ్



పతకాలు, ట్రోఫీలతో క్రీడా చిన్నారులు

కొరుక్కుపేట: రాష్ట్ర స్థాయి కిడ్స్ అంతర్ పాఠశాల అథ్లెటిక్ మీట్‌లో సెయింట్ జోసెఫ్స్ గార్డెన్ స్కూల్ చిన్నారులు పతకాలు మోత మోగించారు. 11 స్వర్ణ పతకాలు, ఐదు రజత పతకాలు, ఐదు కాంస్య పతకాలతో మొత్తం 21 పతకాలు సాధించి సత్తా చాటుకున్నారు. అలాగే రెండు వ్యక్తిగత ఛాంపియన్ షిప్ కప్‌లు, బెస్ట్ స్కూల్ ఛాంపియన్ షిప్ కప్‌లను కైవసం చేసుకోవడం విశేషం. చెన్నై శివారు ప్రాంతం తండలంలోని మేల్కొట్టయ్యూర్‌లో ఉన్న తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ వేదికగా జరిగిన ఈ అథ్లెట్ మీట్‌లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 80 పాఠశాలలు, 15 ప్రైవేట్ క్రీడా అకాడమీలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నాయి. తమదైన శైలిలో విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు.

ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల్లో త్రినాథ్ కుమార్ విజయం



త్రినాథ్‌ను సత్కరిస్తున్న వైశ్య ప్రముఖులు

కొరుక్కుపేట: తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ మద్రాసు జిల్లా యూనిట్ 2023–26 కు కొత్త చైర్మన్ పదవికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో కేకే త్రినాథ్ కుమార్ అఖండ విజయం సాధించారు. స్థానిక బ్రాడ్వే సమీపంలోని వరదాముత్తి యప్పన్ వీధిలో ఉన్న నారాయణ గురవయ్య చెట్టి చారిటీస్ భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ నామా సతీష్ కుమార్ ఆహ్వానం పలికిన ఈ సమావేశంలో కొత్త చైర్మన్ పదవికి ఎన్నికల ఆమోదం తెలిపింది. దీంతో ఎన్నికల అధికారి కె. రవికుమార్ పర్యవేక్షణలో సాగిన ఎన్నికల్లో చైర్మన్ పదవికి కేకే త్రినాథ్ కుమార్, ఇమ్మిడి కిషోర్, డాక్టర్ జె.జయప్రకాష్‌కు మద్దతుగా నమోదు అయిన ఓట్లను లెక్కించి సాయంత్రం 5.30 గంటలకు ఫలితాలు వెల్లడించారు. ఇందులో విజయం సాధించిన త్రినాథ్ కుమార్ చైర్మన్ పదవికి ఎన్నికయ్యారు. ఆయనకు వైశ్య ప్రముఖులు అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకర్ రావు, వామ్ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ, జయరాజ్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ తాడేపల్లి రాజ శేఖర్, మాజీ అధ్యక్షుడు నామా సతీష్ కుమార్, సిహెచ్ వెంకటేశ్వరరావు, రవి కుమార్, ఎంవి నారాయణ గుప్తా, అమరా జయకుమార్, సిఎస్ నాగరాజన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

బాలికలు ఉన్నత విద్యపై ఆసక్తి చూపాలి



డిగ్రీ పట్టాలను అందజేస్తున్న డైరెక్టర్ గీత

వేలూరు: బాలికలు ఉన్నత విద్యపై ఆస్తిక్తి చూపడంతో పాటు పరిశోధనలు చేసి దేశాభివృద్ధికి పాటుపడాలని కళాశాల విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ గీత అన్నారు. వేలూరు ధనభాగ్యం కృష్ణస్వామి మొదలియార్ మహిళా డిగ్రీ కళాశాలలో 48వ స్నాతికోత్సవ కార్యక్రమం కళాశాల కార్యదర్శి మణినాథన్ అధ్యక్షతన ఆదివారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా ఈమె మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, అందుకు కారణం విద్య ఒక్కటే అన్నారు. అధికంగా మహిళలు ప్లస్–2, డిగ్రీల వరకు విద్యను అభ్యసించి ఉన్నత విద్యకు దూరమవుతున్నారని అలా కాకుండా పట్టుదలతో ఉన్నత విద్యకు వెళ్లగలిగితే చేతికి అందనంద శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. మహిళ విద్యను అభ్యసిస్తే ఆ కుటుంబం మొత్తం విద్యావేత్తలుగా ఉంటారన్నారు. చిన్న వయస్సు నుంచి ప్రతి ఒక్కరికీ ఓ లక్ష్యం ఉండాలని దాన్ని అధిగమించేందుకు పట్టుదలతో ప్రయత్నం చేయాలన్నారు. ప్రస్తుతం డిగ్రీలు సాధించిన మీరందరూ ఇంతటితో విద్యను నిలుపుదల చేయకుండా ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం యుజి, పీజీ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శివకుమార్, ప్రిన్సిపల్ భానుమతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

దక్షిణాదిలో బిజీగా

బాలీవుడ్ నటుడు జాన్ కొక్కెన్



తమిళసినిమా: సినిమాకు భాషాబేధం లేదు.. ఇక్కడ ప్రతిభే ప్రధానం. ఇప్పుడు బాలీవుడ్ స్టార్స్ దక్షిణాది చిత్ర పరిశ్రమపై పడిందనే విషయం తెలిసిందే. సంజయ్ దత్, జాకీ ష్రాఫ్‌లో నుంచి అనేకమంది ప్రముఖ బాలీవుడ్ నటులు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం భాషల్లో నటించడానికి మిక్కిలి ఆసక్తి చూపుతున్నారు. అలాంటి వారిలో నటుడు జాన్ కొక్కెన్ ఒకరు. మలయాళ కుటుంబానికి చెందిన ఈయన పుట్టి పెరిగింది మాత్రం ముంబైలో.. అయితే నటుడుగా రంగ ప్రవేశం చేసింది మాత్రం మాతృభాష అయిన మలయాళంలోనే. అయితే మలయాళం, కన్నడం, తెలుగు, తమిళం భాషల్లో నటిస్తూ బహుభాషా నటుడుగా పేరు తెచ్చుకున్నారు. తెలుగులో దరువు ,1 నేనొక్కడినే, బాహుబలి, బ్రూస్ లీ, వీరసింహారెడ్డి వంటి సినిమాల్లో నటించిన జాన్ కొక్కెన్, తమిళంలో వీరం, సర్పట్టా పరంపరై, తుణివు వంటి పలు చిత్రాల్లో సత్తాచాటారు. అదేవిధంగా ధనుష్ హీరోగా నటించిన కెప్టెన్ మిల్లర్ చిత్రంలో ముఖ్య పాత్రను పోషించారు. కాగా ఈయన తాజాగా ది ఫ్రీలన్సర్ అనే హిందీ వెబ్ సిరీస్‌లో నటించడం విశేషం. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో సీబీఐ అధికారిగా పవర్ఫుల్ పాత్రను పోషించినట్లు జాన్ కొక్కెన్ తెలిపారు. తన పాత్ర చాలా సాఫ్ట్ గా వైవిధ్య భరితంగా ఉంటుందన్నారు. తాను నటిస్తున్న తొలి హిందీ వెబ్ సిరీస్ ఇదనీ, తనకు చాలా స్పెషల్ అని పేర్కొన్నారు. నీరజ్ పాండే క్రియేటివ్ దర్శకత్వంలో నటించడం మంచి అనుభవంగా పేర్కొన్నారు. మోహిత్ రైనా, అనుపమ్ ఖేర్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించిన ఈ వెబ్ సిరీస్ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది.

కోలీవుడ్ టాక్స్

నయనతార ఇంట

ఓనం వేడుకలు



పిల్లలకు ప్రసాదాన్ని తినిపిస్తున్న నయనతార, విఘ్నేష్ శివన్ దంపతులు

తమిళసినిమా: అగ్ర కథానాయకిగా రాణిస్తున్న నటి నయనతార. ఈమె దర్శకుడు విగ్నేష్ శివన్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. వీరు సరోగసి విధానం ద్వారా పిల్లలకు తల్లిదండ్రులు అయిన సంగతి కూడా విదితమే. కాగా నయనతార సంస్కృతి, సంప్రదాయాలకు అత్యంత ప్రాముఖ్యతను ఇస్తారు. తమకు సంబంధించిన ముఖ్యమైన రోజులను బ్రహ్మాండంగా జరుపుకుంటారు. అదేవిధంగా పండగలు, పర్వదినాలను వేడుకగా నిర్వహిస్తుంటారు. కాగా మలయాళీలు ఓనం పర్వదినాన్ని విశేషంగా జరుపుకుంటారన్న విషయం తెలిసిందే. ఈనెల 20 నుంచి నుంచి 31వ తేదీ వరకు కాగా ఓనం పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. మలయాళీలు కుటుంబానికి చెందిన నయనతార కూడా భర్త విగ్నేష్ శివన్, పిల్లలు ఉయిర్, ఉలగంతో కలిసి ఆదివారం స్వగృహంలో ఓనం పర్వదినాన్ని జరుపుకున్నారు. తమ పిల్లలకు తెల్లని పట్టు పంచెలు కట్టి అరటి ఆకుల్లో ఫలహారాలను వారికి ప్రేమగా తినిపించి మురిసిపోయారు. ఆ ఫొటోలను దర్శకుడు విగ్నేష్ శివన్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అందులో × మాది సింపుల్ బ్యూటిఫుల్ లైఫ్ . చాలా ప్రత్యేకతో కూడిన ఓనం పండుగను మా ఉయిర్, ఉలగంతో మొదలైంది. అందరికీ ఓనం పండగ శుభాకాంక్షల్లు అని పేర్కొన్నారు. వారి ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కాగా చిత్రాలతో బిజీగా ఉన్న నయనతార తొలిసారిగా నటించిన హిందీ చిత్రం జవాన్ ఆగస్టు 7న తెరపైకి రానుంది.

కుటుంబ సభ్యుల అండతో ఎదుర్కొన్నా..!

తమిళసినిమా: సినీ పరిశ్రమలో సర్దుకుపోవడం అనే పదం ఇటీవల మళ్లీ ఎక్కువగా వినిపిస్తోంది. నటి అను ఇమ్మానుయేల్ కూడా అలాంటి సంఘటనలను ఎదుర్కొన్నాను అని పేర్కొంది. చదువుకునే రోజుల్లోనే బాలనాటిగా సినీ రంగ ప్రవేశం చేసిన ఈ మలయాళీ బ్యూటీ ఆ తర్వాత 2016లో నిఫిన్ బాలికి జంటగా యాక్షన్ హీరో బిజూ అనే చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయం అయింది. ఆ తర్వాత 2017లో విశాల్ కథానాయకుడిగా నటించిన తుప్పరివాలన్ చిత్రంలో చిన్న పాత్ర ద్వారా రంగ ప్రవేశం చేసింది. ఆ తర్వాత శివకార్తికేయన్ సరసన నమ్మవీట్టు పిళ్లై చిత్రంలో కథానాయకిగా నటించింది. ఈ చిత్రం తర్వాత కోలీవుడ్లో మరిన్ని అవకాశాలు వస్తాయని ఆశించింది. అయితే చిత్రం విజయాన్ని సాధించిన అను ఇమ్మానుయేల్‌ను మాత్రం ఇక్కడ ఎవరూ పట్టించుకోలేదు. దీంతో తెలుగు చిత్ర పరిశ్రమపై దృష్టి సారించింది. అక్కడ స్టార్ హీరోలతో నటించే అవకాశాలు వరించాయి. అయితే ఈ అమ్మడిని ఎప్పటికీ స్టార్ ఇమేజ్ వరించలేదని చెప్పాలి. తాజాగా కార్తీక్ జంటగా జపాన్ చిత్రంలో నటించింది. త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతున్న ఈ చిత్రంపై అను ఇమ్మానుయేల్ చాలా ఆశలు పెట్టుకుందనే చెప్పాలి. కాగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సర్దుకుపోవడం అనే అంశంపై స్పందిస్తూ. అను ఇమ్మానుయేల్ తనకూ అలాంటి అనుభవాలు ఎదురయ్యాయని చెప్పింది. అయితే ఇలాంటి ఘటనలను కుటుంబ సభ్యుల అండతో ఎదుర్కొన్నానని చెప్పింది. ఇలాంటి సందర్భాల్లో సమస్యను ఒంటరిగా కాకుండా కుటుంబ సభ్యుల అండతో ఎదుర్కోవడం మంచిదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

నటి అను ఇమ్మానుయేల్



చెన్నైలో మొదలై..

న్యూయార్క్‌లో ముగిసిన కిక్



కిక్ చిత్ర యూనిట్

తమిళసినిమా: డీడీ రిటర్న్స్ చిత్ర సక్సెస్ జోష్‌లో ఉన్న నటుడు సంతానం. తాజాగా ప్రేక్షకులకు మంచి కిక్ ఇవ్వడానికి సిద్ధమయ్యారు. అవును ఈయన తాజాగా నటించిన చిత్రం కిక్. పార్చ్యూన్ ఫిలిమ్స్ పతాకంపై నవీన్ రాజ్ నిర్మించిన ఈ చిత్రం ద్వారా కన్నడ దర్శకుడు ప్రశాంత్ రాజ్ కోలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. నటి తాన్యా హైతిక నటించిన ఇందులో నటి రాగిణి త్రివేది, కోవై సరళ, తంబి రామయ్య, సెంథిల్, మన్సూర్ అలీ ఖాన్, బ్రహ్మానందం, సాధు కోకిల, ముత్తుకాళై, మనోబాల, కింగ్ కాంగ్, క్రేన్ మనోహర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. అర్జున్ జాన్య సంగీతం, సుధాకర్ రాజ్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని సెప్టెంబర్ 1న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్ర విడుదల హక్కులను వైఎంఆర్ క్రియేషన్స్ సంస్థ పొందింది. కాగా ఈ సందర్భంగా చిత్ర యూనిట్ శనివారం సాయంత్రం చెన్నైలోని ఓ స్టార్ హోటల్లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నటుడు సంతానం మాట్లాడుతూ ఒకరోజు ఈ చిత్ర నిర్మాత నవీన్ రాజ్, దర్శకుడు ప్రశాంత్ రాజ్ తనను వెతుక్కుంటూ పాండిచ్చేరి వరకూ వచ్చి కథ వినిపించారన్నారు. కథతో పాటు,వారి తమిళ భాషా నచ్చిందన్నారు. దీంతో చిత్ర షూటింగ్‌ను ఓకే షెడ్యూల్ లో చెన్నైలో ప్రారంభించి న్యూయార్క్‌లో పూర్తి చేసినట్లు చెప్పారు. తాను ఇంతకుముందు నటించిన చిత్రాలకు పూర్తి భిన్నంగా కిక్ చిత్రం ఉంటుందన్నారు. ఇది అబ్బాయికి, అమ్మాయికి మధ్య ఇగో అనే కాన్సెప్ట్‌తో రూపొందించిన చిత్రం ఇదని చెప్పారు. దీన్ని డీడీ రిటర్న్స్ చిత్రంతో పోల్చరాదని, ఇది మరో తరహాలో ఉంటుందన్నారు. దీన్ని సంతానం చిత్రం అనడం కంటే దర్శకుడు ప్రశాంత్ రాజ్ చిత్రం అనే చెప్పాలన్నారు.

వెప్పన్ చిత్ర యూనిట్ ర్యాలీ



తమిళసినిమా: మిలియన్ స్టూడియో పతాకంపై ఎంఎస్ మన్సూర్ నిర్మించిన చిత్రం వెప్పన్. నటుడు సత్యరాజ్ వసంత రవి తాన్య హోప్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి గుహన్ చెన్నియప్పన్ దర్శకత్వం వహించారు. యాక్షన్ కిల్లర్ నేపథ్యంలో కొత్త టెక్నాలజీతో రూపొందిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. కాగా విచిత్ర నిర్మాత ఆదివారం ఉదయం ప్రజా క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వాహనదారులకు అవగాహన కలిగించే విధంగా వేర్ హెల్మెట్ పేరుతో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు వసంత రవి నటి తాన్య హోప్ తదితరులు పాల్గొన్నారు నిర్మాత. మన్సూర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లను ధరించాల్సిన ఆవశ్యకత, సురక్షితంగా వాహనాలను నడపడం గురించి అవగాహన కలిగించే విధంగా ఈ కార్యక్రమం ఉదయం 6 గంటలకు స్థానిక ఓఎంఆర్ రోడ్ లో ప్రారంభమై తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాంతం వరకు సాగింది.

క్లుప్తంగా

తిరువళ్లూరులో భారీ వర్షం



వీరరాఘవుడి ఆలయ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

తిరువళ్లూరు: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత కనిపించింది. సాయంత్రం హఠాత్తుగా ఉరుములు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో బజారువీధి, కాకలూరు తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వీరరాఘవుడి ఆలయ పరిసర ప్రాంతంలో భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వర్షపు నీరుతో కలిసి మురికినీరు ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లింది. పూండి, కడంబత్తూరు, పూందమల్లి, ఆవడి, పొన్నేరి, గుమ్మిడిపూండి, తామరపాక్కం, పెద్దపాళ్యంలోనూ వర్షం కురిసింది.

బస్సులో మహిళకు వేధింపులు

• పోలీసు అరెస్టు

తిరువొత్తియూరు: బస్సులో మహిళతో అసభ్యంగా ప్రవర్తించి వేధించిన పోలీసును అరెస్టు చేశారు. విరుదునగర్ జిల్లా తిరుచ్చి ప్రాంతానికి చెందిన మహిళ(33) ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తోంది. కార్యంపట్టి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ పెరియా తంబి యూనిఫాంలో సిత్తలై గుండు బస్ స్టాపింగ్‌లో ఆ బస్సు ఎక్కాడు. అతను ఆ మహిళ వద్ద అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె మరో బస్సు స్టాపింగ్‌లో దిగి వెళ్లిపోయింది. బస్సులో జరిగిన సంఘటన గురించి మహిళ తన వారితో చెప్పింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు ద్విచక్ర వాహనాలలో మరో బస్ స్టాపింగ్ వద్ద పోలీసును పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. కానీ పోలీసులు సరైన సమయానికి రాకపోవడంతో ఆగ్రహం చెంది రోడ్డుపై ఆందోళన చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. అనంతరం కానిస్టేబుల్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పెరియతంబిని అరెస్టు చేశారు.

భర్తను హత్య చేసి భార్య ఆత్మహత్య

తిరువొత్తియూరు: భర్తను హత్య చేసిన భార్య బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కృష్ణగిరి జిల్లా కూడక్కరసి కొట్టాయి గ్రామానికి చెందిన రంగస్వామి (40) ఎలక్ట్రీషియన్. ఇతనికి భార్య జయంతి (38), కుమారుడు సంతోష్ (18), కుమార్తె దుర్గా (14) ఉన్నారు. సంతోష్ అదే ప్రాంతంలో ఉన్న థియేటర్లో పనిచేస్తున్నాడు. దుర్గా తన అవ్వ ఇంటిలో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. జయంతి మానసిక రుగ్మతతో బాధపడుతోంది. భార్యాభర్తమధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి గొడవ పడ్డారు. జయంతి భర్త గొంతు బిగించి హత్య చేసి మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి దాచింది. ఉదయం అవ్వ ఇంటి నుంచి దుర్గా వచ్చింది. తండ్రి గురించి విచారించింది. ఆ సమయంలో తండ్రి హత్య గురించి తెలుసుకుని బంధువులకు తెలిపింది. దీంతో జయంతి భయపడి ఇంటి సమీపంలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కావేరి పట్టణం పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను కృష్ణగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మోటార్ సైకిళ్లు సహా ఎర్రదుంగలు స్వాధీనం

• ఏడుగురు స్మగ్లర్లు అరెస్ట్



పోలీసులు అరెస్ట్ చేసిన స్మగ్లర్లు

నాగలాపురం: సత్యవేడు సమీపంలోని అడవుల్లో కూంబింగ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు 3 మోటార్ సైకిళ్లతో సహా 43 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఏడుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వివరాలు..టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచుబాబు ఆదేశాల మేరకు రైల్వేకోడూరు ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్ఐ ఆలీబాషా శనివారం సాయంత్రం నుంచి సత్యవేడు సమీపంలోని నాగలాపురం అడవుల్లో కూంబింగ్ నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జామున బీరకుప్పం ప్రాంతంలో కొందరు మోటారు సైకిళ్లతో అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని ప్రశ్నించడంతో పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో వీరు ఎర్రస్మగ్లర్లని తేలింది. వారి నుంచి రాబట్టిన సమాచారంతో 43 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తమిళనాడు తిరువళ్లూరు జిల్లా, గుమ్మిడి పూడి తాలూకాకు చెందిన సభాపతి దర్మన్(45), తిరుపతి జిల్లా తొండవాడకు చెందిన రవి(32), తిరుపతి సత్యనారాయణపురానికి చెందిన యస్.కోదండపాణి(46), సత్యవేడు మండలానికి చెందిన ఎం.నరసింహులు (50), తిరుపతి అవిలాలకు చెందిన బి.రమేష్(42), నాగలాపురం బీరకుప్పంకు చెందిన ఎ.రమేష్(34), ఎ.మారయ్య (65) అని తేలింది. దుంగల బరువు 664 కేజీలు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 లక్షలని డీఎస్పీ తెలిపారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రఫి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చింతాద్రి పేట-వేలచ్చేరి మధ్య రైలు సేవలు ప్రారంభం

కొరుక్కుపేట: చెన్నై బీచ్ స్టేషన్ నుంచి ఎగ్మోర్ వరకు 4వ రైలు మార్గాన్ని నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో చెన్నై బీచ్ - వేలచ్చేరి మధ్య నడిచే ఎలక్ట్రిక్ రైళ్లను చింతాద్రిపేట నుంచి నడపడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నుంచి చింతాద్రి పేట రైల్వే స్టేషన్ నుంచి వేలచ్చేరి వరకు రైళ్ల సేవలను ప్రారంభించారు. కొత్త ట్రాక్ నిర్మాణం కారణంగా రాబోయే 7 నెలలు చెన్నై బీచ్ - చింతాద్రిపేట మధ్య రైలు సర్వీసును రద్దు చేశారు. ప్రజల సౌకర్యం కోసం చింతాద్రి పేట నుంచి చెన్నై బీచ్ వరకు 140 అదనపు బస్సులను నడుపుతున్నట్టు సదరన్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ప్రకటించారు. చెన్నైలో ఎంఆర్‌టీఎస్ రైలు సర్వీస్ 1997లో ప్రారంభించబడింది. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మొదటగా బీచ్ నుంచి మైలాపూర్ వరకు ఈ సర్వీసును ప్రారంభించింది. ప్రయాణికుల నుంచి మంచి స్పందన రావడంతో వేలచ్చేరి వరకు పొడిగించారు.



రైల్వే స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులు

చెన్నై బీచ్ - వేలచ్చేరి మధ్య రోజుకు 150 కంటే ఎక్కువ రైళ్లు నడుస్తున్నాయి. ఇందులో ప్రతిరోజూ 5 వేల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు చెన్నై ఫోర్ట్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణాలు చేస్తున్నారు. చెన్నై బీచ్ - తాంబరం మార్గంలో రోజుకు 250కి పైగా రైలు సర్వీసులు నడపబడుతున్నాయి. ఈ రైళ్లలో ప్రతిరోజూ 3 లక్షల మందికి పైగా ప్రయాణిస్తున్నారు.

పళనితో భేటీ



తీర్మానాలకు ఆమోదం తెలుపుతూ అన్నాడీఎంకే పూర్తిగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి గుప్పెట్లోకి వచ్చే విధంగా హైకోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం సేలంలోని నివాసంలో పళని స్వామిని ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి. సునీల్ నేతృత్వంలో మద్దతుదారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సునీల్‌తో పాటు నేతలు ఎస్ఎంఎస్ జాకీర్ హుస్సేన్, ఎస్. సురేష్‌కుమార్, ఎస్ఎన్ఆర్ రాజేష్, నకీరన్ నగర్ సురేష్, ట్రిప్లికేన్ రామ్‌ప్రసాద్, దేవరాజన్, ఆర్. రాజేశ్‌కుమార్, సంతోష్, అరుణ్ విష్ణు, బాలు, మనోజ్, సెల్వం, ఎం. సురేష్ కలిసి పురట్చి తమిళర్ బిరుదుకు తగ్గట్టుగా ప్రత్యేక కానుకను పళనిస్వామికి బహూకరించారు. - సాక్షి, చెన్నై

ఉపాధ్యాయులకు సన్మానం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కుమార్

తిరువళ్లూరు: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పట్టభద్రుల ఉపాధ్యాయులను జిల్లా యంత్రాంగం సన్మానించి ప్రోత్సహించాలని తమిళనాడు పట్టభద్రుల ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుమార్ కోరారు. పట్టణంలోని డీఆర్‌బీసీసీ పాఠశాలలో ఆదివారం సాయంత్రం తమిళనాడు పట్టభద్రుల ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి ప్రభాకరన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు కుమార్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ హైస్కూల్‌లోని ప్రధానోపాధ్యాయుడి పోస్టులను పట్టభద్ర ఉపాధ్యాయులకు మాత్రమే కేటాయించాలన్నారు. పాఠశాల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు పట్టభద్ర ఉపాధ్యాయులను మాత్రమే అర్హులుగా గుర్తించాలని కోరారు. ప్లస్‌టూ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ఉపాధ్యాయులను సన్మానించాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గణేషన్, బాలసుబ్రమణ్యం, సంఘం సలహాదారుడు పన్నీరుసెల్వం, కోశాధికారి భవాని తదితరులు పాల్గొన్నారు.

నిండు గర్భిణి మృతి

తిరువొత్తియూరు: చెన్నై వ్యాసార్పాడి సమీపంలో నిండు గర్భిణి స్పృహ తప్పి కింద పడి మృతి చెందారు. చెన్నై వ్యాసార్పాడి సమీపంలోని ఎంకేబీ నగర్ ఈస్ట్ 16వ క్రాస్ వీధికి చెందిన కుమార్ కుమార్తె ఇందుమతి (25)ని గత ఏడాది సంతోష్ కుమార్ అనే యువకుడికి ఇచ్చి వివాహం చేశారు. ప్రస్తుతం ఇందుమతి 9 నెలల గర్భిణి. ఆమె ప్రసవం కోసం పుట్టింటికి వచ్చారు. శుక్రవారం రాత్రి ఇంటిలో నీరు రాక పోవడంతో మోటారు స్విచ్ వేయడానికి వెళ్లారు. ఆ సమయంలో ఇందుమతి స్పృహ తప్పి కింద పడ్డారు. తల్లిదండ్రులు ఆమెను స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిశీలించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రావు కేసు నమోదు చేసి ఇందుమతి మోటార్ స్విచ్ ఆన్ చేసిన సమయంలో విద్యుత్ షాక్ కొట్టి మృతి చెందారా లేక స్విచ్ వేయడానికి ముందు వంగిన సమయంలో ఊపిరి ఆడక మృతి చెందారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. వివాహమై సంవత్సరం కావడంతో ఆర్డీవో విచారణకు పోలీసులు సిఫార్సు చేశారు.

పళని ఆలయంలో హిందువులకు మాత్రమే అనుమతి

• హైకోర్టు ఆదేశాలతో బ్యానర్ ఏర్పాటు

తిరువొత్తియూరు: పళని మురగన్ ఆలయంలో హిందువులకు మాత్రమే దర్శనానికి అనుమతి అనే బ్యానర్‌ను హైకోర్టు ఆదేశాల మేరకు తిరిగి ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో హిందూ దేవాదాయ శాఖ నియంత్రణలో ఉన్న ఆలయాల్లో ఇతర మతస్తుల వారికి ప్రవేశానికి అనుమతి లేదని బ్యానర్లను ఏర్పాటుచేశారు. తమిళ్ కడవుల్ మురుగన్ ఆరుపడై వీడుగల్‌లో మూడవ వీడు అయిన పళని ఆలయంలోను, విద్యుత్ రోప్ రైల్వే స్టేషన్ ఎంట్రన్స్ విభాగంలో బ్యానర్ ఏర్పాటుచేశారు. కొన్ని నెలల క్రితం మురుగన్ ఆలయంలో కుంభాభిషేకం పనులను పురస్కరించుకుని అక్కడ ఉంచిన బ్యానర్‌ను తొలగించారు. ఈ క్రమంలో ఇటీవలి కాలంలో ఇతర మతస్తులు రోప్ కారు మూలంగా పళని ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సంఘటన చర్చనీయాంశమైంది. హిందువులు మాత్రమే ఆలయం దర్శనమునకు అనుమతి అని ఉన్న బ్యానర్‌ను ఉంచాలని భక్తులు కోరారు. పళనికి చెందిన సెంథిల్ కుమార్ అనే భక్తుడు పళని మురుగన్ ఆలయంలో హిందువులు మాత్రమే అనుమతించాలని అనే బ్యానర్‌ను తిరిగి ఉంచాలని మదురై హైకోర్టు ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ తరువాత పళని ఆలయంలో హిందువులకు మాత్రమే అనుమతి అనే బ్యానర్‌ను తిరిగి ఏర్పాటుచేయాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలో శనివారం పళని మురుగన్ ఆలయంలో హిందువులకు మాత్రమే దర్శనానికి అనుమతి అన్న బ్యానర్‌ను ఏర్పాటు చేశారు.

తొమ్మిది కిలోల బంగారం స్వాధీనం

• దంపతులు సహా ముగ్గురి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నైకి ప్రభుత్వ బస్సులో తరలిస్తున్న తొమ్మిది కిలోల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని దంపతులు సహా ముగ్గురిని అరెస్టు చేశారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం నుంచి శ్రీలంకకు సముద్రం మార్గంగా బంగారం, గంజాయి, సముద్ర జలగలు, బీడీ ఆకులు, మత్తు పదార్థాలను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ ఇంటలిజెన్స్ విభాగం అధికారులకు శ్రీలంక నుంచి పడవలో రామనాథపురం జిల్లా తొండికి బంగారం తరలించి తర్వాత ప్రభుత్వ బస్సులో చెన్నైకి తరలిస్తున్నట్టు సమాచారం అందింది. అధికారులు తిరుచ్చి సమీపంలోని కల్పాకం గ్రామంలో బస్సును ఆపి తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న దంపతులతోపాటు మరొకరిని విచారించగా వారు పొంతనలేని సమాధానాలిచ్చారు. వారి సంచులను పరిశీలించగా 9 కిలోల 765 గ్రాముల బంగారు కడ్డీలు, రూ.6 లక్షల నగదు గుర్తించారు. వారిని అరెస్టు చేసి బంగారు, నగదును స్వాధీనం చేసుకున్నారు. బంగారం రూ. 5 కోట్ల 89 లక్షల 66 వేలు విలువ చేస్తుంది.

చెన్నై - మలేషియా మధ్య అదనంగా విమాన సేవలు

తిరువొత్తియూరు: చెన్నై - మలేషియా మధ్య అదనంగా రోజువారి విమాన సేవలు ప్రారంభమయ్యాయి. మీనంబాక్కం అన్నా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మలేషియా రాజధాని కౌలాలంపూర్‌కు రోజూ రెండు మలేషియన్ ఎయిర్‌లైన్స్ విమానాలు, 2 ఎయిర్ ఏషియా విమానాలు, ఒక ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం నడుస్తున్నాయి. అలాగే కౌలాలంపూర్ నుంచి చెన్నైకి 5 విమానాలు నడుస్తున్నాయి. అయినా టికెట్లు లభించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో చెన్నై - కౌలాలంపూర్ మధ్య రోజూ అదనంగా విమాన సేవలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా పాటిక్ ఎయిర్‌లైన్స్ విమానం అదనంగా నడుపుతున్నారు. ఈ విమానం ప్రతిరోజూ సాయంత్రం మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో బయలుదేరి రాత్రి 10.25 గంటలకు చెన్నై విమానాశ్రయం చేరుకుంటుంది. తిరిగి రాత్రి 11.15 నిమిషాలకు మలేషియాకు బయలుదేరుతుంది. ఈ విమానంలో 189 మంది ప్రయాణికులు ఒకేసారి ప్రయాణించవచ్చు.

40 కిలోల గంజాయి స్వాధీనం

తిరువొత్తియూరు: నాగై జిల్లా కోడిక్కరై సముద్రతీరంలో 40 కిలోల గంజాయిని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాగై జిల్లా వేదారణ్యం వద్ద కోడికరైలో చోళుల కాలం నాటి లైట్ హౌస్ వుంది. దీని సమీపంలో 20 పార్సిళ్లతో 40 కిలోల గంజాయి సముద్రంలోకి చేరింది. సమాచారం అందుకున్న వేదారణ్యం సముద్రతీర పోలీసులు అక్కడికి చేరుకుని 40 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవర్లను కల్యాణ మండపంలోకి వేంచేపు చేశారు. అక్కడ స్నపన తిరుమంజనం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లు ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ యాగశాలలో సాయంత్రం వైదిక కార్యక్రమాలు నిర్వహించి పవిత్రాల ప్రతిష్ఠ చేశారు. ఏడాది పాటు ఆలయంలో స్వామి వారికి జరిగే నిత్య, వార, పక్ష, మాస, వార్షిక ఉత్సవాల్లో తెలియక జరిగే తప్పిదాలకు ప్రాయశ్చిత్తం కోరుతూ ఆలయంలో మూలమూర్తి నుంచి పరివార దేవతలు, ధ్వజస్తంభంకు పవిత్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ నల్లందుల సుబ్బరామిరెడ్డి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కల్యాణ వెంకన్న ఆలయంలో ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

సెప్టెంబరు 7న గోకులాష్టమి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధ శ్రీకృష్ణస్వామి ఆలయంలో సెప్టెంబరు 7న గోకులాష్టమిని ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోకులాష్టమి రోజున ఉదయం శ్రీకృష్ణస్వామి మూలవర్లకు అభిషేకం, అర్చన చేస్తామని, ముఖ మండపంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీకృష్ణ స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ చేస్తామని వెల్లడించారు. రాత్రి 7 నుంచి 8.15 గంటల వరకు స్వామివారు పెద్దశేష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తారని తెలిపారు. రాత్రి 8.30 నుంచి 9 గంటల వరకు గోపూజ, గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబరు 8న ఉట్లోత్సవాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, తరువాత ఊంజల్‌సేవ ఉంటాయని వెల్లడించారు. సాయంత్రం 6.15 నుంచి రాత్రి 7.30 గంటల వరకు స్వామివారికి ఉట్లోత్సవం, ఆస్థానం నిర్వహిస్తారు. ఈ కారణంగా సెప్టెంబరు 8న ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవను రద్దు చేస్తున్నట్టు వివరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన ఈశ్వరాంబ నృత్యశాల ఆధ్వర్యంలో నాట్య గురువు ప్రీతి మీనన్ పర్యవేక్షణలో కళాకారులు చేసిన కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకుంది. కళాకారులు అనాఘ, శ్రీయ, మీనన్, శ్రీయాస్, గౌరి, విజయ, వేదిక, అర్యన్ నంద, అన్విత ప్రియను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



వల్లలార్ మార్గంతోనే ప్రశాంతత



విద్యార్థులు, వల్లలార్ సేవకులకు ప్రశంసా పత్రాలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీస్

తిరువళ్లూరు: యువతీయువకులు వల్లలార్ మార్గంలోనే నడవడం ద్వారా శాంతియుత జీవనాన్ని పొందవచ్చని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ స్పష్టం చేశారు. వల్లలార్ 200వ జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే తిరువళ్లూరులో ఆదివారం ఉదయం వల్లలార్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ హాజరై ప్రసంగించారు. వల్లలార్ జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని సీఎం సూచించడం హర్షించదగ్గ విషయమన్నారు. వల్లలార్ ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా వల్లలార్ సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్న వారికి బహుమతులు అందజేశారు. వల్లలార్ జయంతి సందర్భంగా నిర్వహించిన వేర్వేరు పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

అనిరుద్ కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం

అన్నానగర్ : చెన్నై మెరీనా బీచ్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో శనివారం మృతి చెందిన బాలుడు అనిరుద్ కుటుంబానికి ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ రూ.3 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చెన్నై మెరీనా బీచ్‌లోని అన్నా స్విమ్మింగ్ పూల్‌కు శనివారం మధ్యాహ్నం కుటుంబంతో కలిసి ఈతకు వచ్చిన పల్లిక్కరనై ప్రాంతానికి చెందిన అనిరుద్ అనే ఐదేళ్ల బాలుడు అనూహ్యంగా నీట మునిగి మృతి చెందాడు. ఈ విషయం తెలిసి తీవ్ర మనస్తాపానికి గురయ్యానని, బాలుడి మృతిపై శాఖాపరమైన విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు సీఎం తెలిపారు. అతని తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని, అతని కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.3 లక్షలు ఇవ్వాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు.

ద్రావిడ సిద్ధాంతాలే ఆదర్శం



చర్చావేదికలో ప్రసంగిస్తున్న డీఎంకే సీనియర్ నేత నాంజిల్ సంపత్

తిరువళ్లూరు: భవిష్యత్తులో ద్రావిడ సిద్ధాంతాలే ప్రపంచానికి ఆదర్శంగా మారతాయని డీఎంకే సీనియర్ నేత నాంజిల్ సంపత్ స్పష్టం చేశారు. తిరువళ్లూరులో శనివారం రాత్రి మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక చర్చావేదిక ఏర్పాటు చేశారు. కరుణానిధి తన రాజకీయ ప్రస్థానంలో ఎదుర్కొన్న ఇబ్బందులు-ప్రజల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అనే అంశంపై చర్చ చేపట్టారు. ఈ కార్యక్రమానికి డీఎంకే జిల్లా కన్వీనర్ తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా నాంజిల్ సంపత్ హాజరయ్యారు. సంపత్ మాట్లాడుతూ దేశానికి భవిష్యత్తులో ద్రావిడ సిద్ధాంతాలతో పాటు కరుణానిధి ఆశయాలు ఆదర్శంగా మారతాయన్నారు. కరుణానిధి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాతే తమిళం భాషకు ప్రాచీన హోదా లభించిందని, మహిళలకు ఆస్తిపై సమాన హక్కులు కల్పించారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో డీఎంకే ద్రావిడ సిద్ధాంతాలు - కరుణానిధి ఆశయాలతోనే ఎన్నికలకు వెళ్లి ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేరిట పేనా చిహ్నాన్ని విమర్శించే వారు మూర్ఖులని, రాజకీయం, సాహిత్యం, పరిపాలన, కళారంగానికి విస్తృత సేవలను అందించిన కరుణానిధికి పేనా చిహ్నం ఏర్పాటు చేయాల్సిందేనన్నారు. తిరువళ్లూరు ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్, నగర కార్యదర్శి రవిచంద్రన్, మున్సిపల్ చైర్ పర్సన్ ఉదయమలర్, వార్డు సభ్యులు అరుణజైకృష్ణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి మహిళ బలి



మృతి చెందిన నిర్మల

తిరువళ్లూరు: భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ వైరు తెగిపడింది. ఆ వైరును మహిళ తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. తిరువళ్లూరు జిల్లా తిరుపందియూర్ గ్రామానికి చెందిన నిర్మల(52) భర్త హరి మృతిచెందడంతో 20 ఏళ్ల కుమార్తె ఐశ్వర్యతో కలిసి జీవనం సాగిస్తోంది. ఆదివారం వేకువజామున తిరువళ్లూరు, కడంబత్తూరు తదితర ప్రాంతాల్లో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. నిర్మల ఇంటి వద్ద వున్న విద్యుత్ వైర్ తెగి గేటుపై పడింది. ఉదయం నిద్రలేచిన నిర్మల ఇంటి గేటుపై పడి వున్న విద్యుత్ వైరును చేతితో ఎత్తడానికి యత్నించడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. విషయాన్ని గుర్తించిన స్థానికులు మప్పేడు పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి నిర్మల మృతదేహాన్ని బయటకు తీసి తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతి చెందిన నిర్మల కుమార్తె ఐశ్వర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఐశ్వర్య ప్రస్తుతం బీకాం చదువుతోంది. ఆమె విద్యను కొనసాగించడానికి ఆర్థిక సాయంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ముండ్రు శ్రీనివాసరావుకు ఘన సత్కారం

కొరుక్కుపేట: చెన్నైలోని ఆంధ్రా క్లబ్‌లో ఆదివారం ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ లిటరేచర్, వెబ్ సైట్, సావనీర్ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్, ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, ఆర్కిటెక్ట్ ఆది శేషయ్య, సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, నటి సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి, నటుడు భానుచందర్ పాల్గొన్నారు. సభలో వక్తులు, అతిథులు ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సామాజిక సేవకులు లయన్ ముండ్రు శ్రీనివాసరావును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



ముండ్రు శ్రీనివాసరావును సత్కరిస్తున్న టీడీ జనార్దన్, నందమూరి రామకృష్ణ

పంటలను కాపాడాలని రైతుల ఆందోళన

తిరువొత్తియూరు: తంజావూరు జిల్లాలో ఖరీఫ్ పంటలను కాపాడాలని కోరుతూ రైతులు ఆందోళన చేశారు. తంజై సమీపంలోని కాటూరు గ్రామంలో రోడ్డు విస్తరణ పనుల కోసం నీటి కాలువ మూసివేశారు. ఈ క్రమంలో ఆ పనులు పూర్తి అయినప్పటికీ నీటిని వదలలేదు. దీంతో 500 ఎకరాలకు పైగా ఖరీఫ్ పంటలు ఎండిపోతున్నాయి. ఈ క్రమంలో నీటిని వదలాలని కోరుతూ రైతులు తంజై మన్నార్‌కుడి రోడ్డులో ధర్నా చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారితో చర్చించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

సత్కారం



ఆదివారం నెల్లూరు జిల్లా కోటలో వున్న గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చెన్నైలోని ఆస్కా అధ్యక్షుడు డాక్టర్ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ నల్లపురెడ్డి జగన్ మోహనరెడ్డి, ఆస్కా మేనేజింగ్ ట్రస్టీ శ్రీనివాసరెడ్డి తదితరులు - సాక్షి, చెన్నై

తెలంగాణ

డా.దేబల్ దేవ్‌కు 'ఆర్గానిక్' పురస్కారం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దేశీ వరి వంగడాల పరిరక్షకుడు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ దేబల్ దేవ్‌కు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ×ఐఫోమ్ ఆసియా ఆర్గానిక్ మెడల్ ఆఫ్ ఆనర్‌'లభించింది. వంద దేశాల్లో సేంద్రియ వ్యవసాయదారుల సంఘాల సమాఖ్య (ఐఫోమ్) ఆర్గానిక్స్ ఆసియా విభాగం, చైనాలోని క్సిచాంగ్ కౌంటీ సంయుక్తంగా 2023వ సంవత్సరపు ఆర్గానిక్ మెడల్ ఆఫ్ ఆనర్ పురస్కారానికి డా. దేబల్ దేవ్‌ను ఎంపిక చేశాయి. వైవిధ్యభరితమైన 1,440కు పైగా అపురూపమైన భారతీయ వరి వంగడాలను సేకరించడంతో పాటు, ఒడిషాలోని తన చిన్న పరిశోధనా క్షేత్రంలో ప్రతి ఏటా సాగుచేస్తూ పరిరక్షిస్తున్న డా. దేబల్ దేవ్ దశాబ్దాలుగా నిస్వార్థ సేవ చేస్తున్నారు. అవార్డులోతోపాటు 5 వేల డాలర్ల నగదుతో పాటు ప్రశంసాపత్రం ప్రదానం చేస్తారు. డా. దేబల్ దేవ్ పరిరక్షిస్తున్న దేశీ వరి వంగడాల్లో వాతావరణ మార్పుల్ని తట్టుకొని నిలిచే వరి రకాలతో పాటు అత్యంత అరుదైన పౌష్టిక విలువలు కలిగిన రకాలు కూడా ఉండటం విశేషం. ప్రకృతి సేద్యానికి అనువైన ఈ వంగడాల ద్వారానే మన ఆహార సార్వభౌమత్వం నిలుస్తుందని డా. దేబల్ దేవ్ 'సాక్షి'తో అన్నారు.

హైదరాబాద్ సైబర్‌క్రైం ఎస్‌ఐ అరెస్టు

గచ్చిబౌలి(హైదరాబాద్): ఓ నైజీరియన్ నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్‌ను ఇంట్లోనే దాచిపెట్టిన కేసులో సైబర్‌క్రైం ఎస్‌ఐ రాజేందర్‌ను అరెస్ట్ చేయడం సైబరాబాద్ కమిషనరేట్‌లో తీవ్రకలకలం రేపుతోంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనపై సీఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... 2009 బ్యాచ్‌కు చెందిన కె.రాజేందర్ రాయదుర్గం, మాదాపూర్ పీఎస్‌లలో ఎస్‌ఐగా విధులు నిర్వర్తించాడు. మాదాపూర్ నుంచి సైబర్‌క్రైంకు బదిలీ అయ్యారు. గత ఫిబ్రవరి నెలలో ఓ సైబర్ క్రైం కేసు విచారణలో భాగంగా ముంబైకి వెళ్లాడు. డ్రగ్స్ సప్లయర్ నైజీరియన్‌ను అదుపులోకి తీసుకున్నాడు. అతడి నుంచి రూ.80లక్షల విలువైన డ్రగ్ (మెథాక్వాలోన్) స్వాధీనం చేసుకున్నాడు. ఈ విషయం ఉన్నతాధికారులకు చెప్పకుండా ఆరు నెలల క్రితం మణికొండలోని తన ఇంట్లో దాచిపెట్టాడు. ఇటీవల నార్కోటిక్ బ్యూరో అధికారులు డ్రగ్స్ కేసుల్లో భాగంగా ఆ నైజీరియన్‌ను విచారించారు. వారు ఇచ్చిన సమాచారంతో శనివారం తెల్లవారుజామున మణికొండలో వాహనంతో రోడ్డుపై వేచి ఉన్న రాజేందర్‌ను అరెస్ట్ చేశారు. రాజేందర్ వాహనంలో ఉన్న 1,750 గ్రాముల మెథాక్వాలోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నయా టమాటా

అందుబాటులోకి యూఎస్-6242, అన్సోల్, జువేల్ రకాలు

- రైతుకు గిట్టుబాటు ధర కల్పనే లక్ష్యం
- హైబ్రీడ్ రకాల సాగుకు ప్రోత్సాహం
- ఎకరాకు 40 టన్నుల దిగుబడి
- సాధారణ రకాల కంటే రెట్టింపు ధర
- రబీలో ఫలించిన పైలట్ ప్రాజెక్ట్
- రబీలో మరింత ప్రోత్సహించాలని ఉద్యాన శాఖ నిర్ణయం



సాక్షి, అమరావతి: కొత్త రకం టమాటా వంగడాలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. యూఎస్–6242, అన్సోల్, జువేల్ వంటి హైబ్రీడ్ రకాలను రబీలో పైలట్ ప్రాజెక్ట్ కింద సాగు చేయగా.. సూపర్ సక్సెస్ కావడంతోపాటు రైతులకు మంచి లాభాలు తెచ్చిపెట్టాయి. దీంతో నూతన వంగడాల సాగును ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ సన్నాహాలు చేస్తోంది. ఏడాది పొడవునా టమాటాలు పండుతున్నా.. మార్కెట్ ధరల్లో తీవ్రమైన వ్యత్యాసాలు ఉంటున్నాయి. కొన్ని రోజులు రైతులకు లాభాలు వస్తుండగా.. కొన్ని రోజులు కనీసం పెట్టుబడి కూడా దక్కడం గగనంగా మారుతోంది. ఈ పరిస్థితికి చెక్ పెడుతూ.. స్థానిక వెరైటీలకు ప్రత్యామ్నాయంగా యూఎస్–6242, అన్సోల్, జువేల్ వంటి హైబ్రీడ్ రకాలను ఉద్యాన శాఖ అందు బాటులోకి తెచ్చింది.



అన్సోల్, జువేల్ హై బ్రీడ్ రకాల టమాటాలు

గుజ్జు ఎక్కువ.. ధర మక్కువ

లోకల్ వెరైటీ టమాటా రకాల్లో గుజ్జు శాతం ఎక్కువ లేకపోవడం వల్ల ప్రాసెసింగ్‌కు పూర్తిస్థాయిలో పనికిరావడం లేదు. విధిలేని పరిస్థితుల్లో రైతుల నుంచి తక్కువ ధరకు ప్రాసెసింగ్ కంపెనీలు వీటిని కొనుగోలు చేస్తున్నాయి. ఈ పరిస్థితికి చెక్ పెడుతూ గుజ్జు శాతం అధికంగా ఉండి ప్రాసెసింగ్‌తోపాటు స్థానికంగా వినియోగించుకునేందుకు వీలుగా ఉండే ఈ హైబ్రీడ్ రకాలను ప్రోత్సహించాలని ఉద్యాన శాఖ సంకల్పించింది. ఒకవేళ మార్కెట్‌లో కనీస ధర లేకపోయినప్పటికీ కిలోకు రూ.6 తక్కువ కాకుండా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా సేకరించి ప్రాసెసింగ్ కంపెనీలకు విక్రయించేలా అవగాహన ఒప్పందం కూడా చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వేసవిలో చిత్తూరు జిల్లా పలమనేరు, వి.కోట మండలాల్లో 136 మంది రైతులను గుర్తించి వారి ద్వారా 250 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా హైబ్రీడ్ రకాలను సాగు చేశారు. సాగును ప్రోత్సహించేందుకు వివిధ రూపాల్లో హెక్టార్‌కు రూ.68,225 సబ్సిడీ ఇచ్చారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా లోకల్ వెరైటీలైన సాహో, సాహితీ రకాలకు ఆశించిన స్థాయిలో పూత రాలేదు. వచ్చిన పూత, పిందె రాలిపోవడంతో ఎకరాకు 15–20 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. ఇదే సమయంలో హైబ్రీడ్ టమాటాలు 35–40 టన్నుల వరకు దిగుబడులొచ్చాయి. వైరస్‌ను తట్టుకుని తీవ్రమైన ఉష్ణోగ్రతల సమయంలో కూడా ఆశించిన స్థాయిలో దిగుబడులొచ్చాయి. మరోవైపు లోకల్ వెరైటీ టమాటాలు 15 కేజీల బాక్స్ రూ.70–రూ.80 ధర లభించగా.. హైబ్రీడ్ వెరైటీలకు రూ.190–రూ.200 వరకు ధర పలికింది. హైబ్రీడ్ రకాలకు రెట్టింపు ధరలు రావడంతో రైతులు మంచి లాభాలను ఆర్జించారు. దీంతో రానున్న రబీలోనూ ఈ రకాలను ప్రోత్సహించాలని ఉద్యాన శాఖ సంకల్పించింది.

హైబ్రీడ్ రకాలకు ఊతం



సంప్రదాయ నాటు వెరైటీలకు ప్రత్యామ్నాయంగా హైబ్రీడ్ వెరైటీలను అందుబాటులోకి తీసుకొచ్చాం. రబీలో పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్ కావడంతో రానున్న రబీలో కూడా హైబ్రీడ్ రకాల సాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకున్నాం. ధర లేకపోతే ప్రాసెసింగ్ కంపెనీల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– డి.మధుసూదనరెడ్డి, డీహెచ్‌ఓ, చిత్తూరు జిల్లా

విశాఖలో విమాన ప్రయాణికుల జోరు

కడపకూ క్యూ కడుతున్నారు

- ఏప్రిల్–జూలై మధ్య భారీగా పెరిగిన ప్రయాణికులు
- దేశ సగటు వృద్ధి కంటే ఎక్కువగా వృద్ధి రేటు నమోదు
- విశాఖలో 33.93 శాతం,, కడపలో 36.1 శాతం పెరుగుదల
- దేశవ్యాప్తంగా సగటు వృద్ధి 22.6 శాతంగా నమోదు
- విశాఖ, విజయవాడ నుంచి గణనీయంగా పెరిగిన విదేశీ ప్రయాణికులు



సాక్షి, అమరావతి: రాష్ట్ర పరిపాలన రాజధానిగా ప్రకటించిన విశాఖపట్నంతో పాటు కడపకు విమాన ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. 2023–24 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలలు అంటే.. ఏప్రిల్ నుంచి జూలై వరకు విమాన ప్రయాణికుల గణాంకాలను గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. విశాఖకు విమాన ప్రయాణికుల సంఖ్యలో 33.93 శాతం వృద్ధి నమోదైనట్లు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో పేర్కొంది. 2022–23 ఏప్రిల్–జూలై మధ్య కాలంలో విశాఖపట్నం నుంచి 7,74,925 మంది ప్రయాణిస్తే ఈ ఏడాది అదే సమయానికి 10,37,656 మంది ప్రయాణించారు. కడప విమానాశ్రయం 36.1 శాతం వృద్ధి నమోదు చేసింది. 2022–23 ఏప్రిల్–జూలై మధ్య 20,289 మంది ప్రయాణించగా.. ఆ సంఖ్య ఈ ఏడాది 27,612కు పెరిగింది. ఇక విజయవాడ ఎయిర్‌పోర్టు 19.3 శాతం వృద్ధి నమోదు చేసింది. ప్రయాణికుల సంఖ్య 3.09 లక్షల నుంచి 3.68 లక్షలకు పెరిగింది. రాజమండ్రి ఎయిర్‌పోర్టుకు కూడా గణనీయంగా ప్రయాణికులు పెరిగారు. కాగా, ఈ సమయంలో దేశవ్యాప్తంగా ప్రయాణికుల సంఖ్యలో 22.6 శాతం వృద్ధి నమోదైంది. తిరుపతి, కర్నూలు ఎయిర్‌పోర్టుల్లో మాత్రం ప్రయాణికుల సంఖ్యలో స్వల్ప క్షీణత నమోదైంది. రాష్ట్రంలోని మొత్తం ఆరు ఎయిర్‌పోర్టుల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో 18,84,926 మంది ప్రయాణించారు. దేశం మొత్తం మీద చూస్తే ఆ నాలుగు నెలల కాలంలో విమాన ప్రయాణికుల సంఖ్య 10.04 కోట్ల నుంచి 12.30 కోట్లకు చేరుకుంది.

పెరిగిన విదేశీ ప్రయాణికులు

రాష్ట్రంలో మూడు విమానాశ్రయాలకు అంతర్జాతీయ హోదా ఉన్నప్పటికీ ప్రస్తుతం విశాఖ, విజయవాడ విమానాశ్రయాల నుంచి మాత్రమే విదేశీ విమాన సర్వీసులు నడుస్తున్నాయి. త్వరలో తిరుపతి నుంచి గల్ఫ్ దేశాలకు సర్వీసులు ప్రారంభించే విధంగా ప్రభుత్వం కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖతో చర్చలు జరుపుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగు నెలల కాలంలో అంతర్జాతీయ విమాన ప్రయాణికుల సంఖ్యలో గణనీయమైన వృద్ధి నమోదయ్యింది. విశాఖ నుంచి విదేశీ ప్రయాణికుల సంఖ్య 20.9 శాతం వృద్ధితో 20,097 నుంచి 24,143కు చేరితే, విజయవాడలో 14.4 శాతం వృద్ధితో 14,978 నుంచి 17,135కు చేరుకుంది.

ఏప్రిల్–జూలై మధ్యలో విమాన ప్రయాణీకుల సంఖ్య

ఎయిర్‌పోర్టు	2023-24	2022-23	వృద్ధి శాతం
విశాఖపట్నం	10,37,656	7,74,925	33.93
కడప	27,612	20,289	36.1
విజయవాడ	3,68,536	3,09,039	19.3
రాజమండ్రి	1,41,132	1,36,454	3.4
తిరుపతి	2,95,657	3,12,107	-5.3
కర్నూలు	14,333	16,487	-13.1
ఇండియా	12,30,90,013	10,04,17,423	22.6

తెలంగాణ

కేసీఆర్ పనైపోయింది

- ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తాం
- ఖమ్మం బహిరంగ సభలో అమిత్‌షా

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'రైతు, దళిత, యువత, మహిళా వ్యతిరేక కేసీఆర్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించాల్సిన సమయం ఆసన్నమైంది. కేసీఆర్‌ను ఇంటికి పంపి బీజేపీని అధికారంలోకి తెద్దాం. గుర్తుపెట్టుకో కేసీఆర్.. నీ పనైపోయింది. నువ్వు కానీ, నీ కొడుకు కానీ ముఖ్యమంత్రి అయ్యే ప్రసక్తే లేదు..' అని కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా అన్నారు. ఖమ్మంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'రైతుగోస–బీజేపీ భరోసా' సభలో మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ పార్టీ నెహ్రూ, ఇందిర, రాజీవ్, రాహుల్ వంశపారంపర్య 4జీ పార్టీ. బీఆర్ఎస్ కేసీఆర్, కేటీఆర్ 2జీ పార్టీ. ఇక మజ్లిస్ 3జీ పార్టీ. ఈ 2జీ, 3జీ, 4జీ పార్టీలకు కాలం చెల్లింది. బీజేపీ ప్రజల పార్టీ. వచ్చే ఎన్నికల తర్వాత తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే' అని స్పష్టం చేశారు. మోదీని మూడోసారి ప్రధానమంత్రిగా చేయడంతోపాటు తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. 'శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం రాముడికి ప్రభుత్వం తరపున వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. కానీ కేసీఆర్ ప్రభుత్వంలో మాత్రం.. కారు భద్రాచలం వరకు వస్తున్నా మందిరంలోకి వెళ్లకుండా ఆగుతోంది. కారు స్టీరింగ్ ఓవైసీ చేతిలో ఉండటమే ఇందుకు కారణం. బీజేపీ ప్రభుత్వం రాగానే.. మా సీఎం ఎవరైనా కమల పుష్పాన్ని భద్రాచల రాముడి పాదపద్మాల ముందు అర్పిస్తాం. కేసీఆర్ ఇక భద్రాచలానికి రావాల్సిన అవసరం లేదు' అని అమిత్‌షా వ్యాఖ్యానించారు. ధాన్యం కొనుగోళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయం చేస్తున్నారన్నారు. మోదీ ప్రభుత్వమే తెలంగాణలో ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించిందని, పంటల కనీస మద్దతు ధరను మా ప్రభుత్వం 65 శాతం పెంచిందని వివరించారు.



గన్నవరం విమానాశ్రయంలో అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత

గన్నవరంలో అమిత్‌షాకు ఘన స్వాగతం

విమానాశ్రయం(గన్నవరం): కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఆదివారం గన్నవరం విమానాశ్రయంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఖమ్మం వెళ్లడానికి న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం చేరుకున్నారు. విమానాశ్రయంలో రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, రాష్ట్రానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. కూడా స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం బీఎస్ఎఫ్ హెలికాప్టర్‌లో అమిత్‌షా ఖమ్మం బయలుదేరివెళ్లారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

సత్యదేవుని దర్శించిన 60 వేల మంది

- 4,500 వ్రతాల నిర్వహణ
- దేవస్థానానికి రూ.60 లక్షల ఆదాయం



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వివాహాల సీజన్‌కు తోడు శ్రావణ శుద్ధ ఏకాదశి, ఆదివారం సెలవు కలసి రావడంతో రత్నగిరి సత్యదేవుని ఆలయం వేలాదిగా వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తుల రాక కొనసాగింది. స్వామి వారిని సుమారు 60 వేల మంది భక్తులు దర్శించి, పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. సత్యదేవుని ప్రదక్షిణ దర్శనానికి గంట, సాధారణ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, ప్రదక్షిణ చేశారు. వ్రతాలు 4,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.60 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో సుమారు 4 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవుడు, అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన, లక్ష తులసీ పూజ నిర్వహించారు.

దసరాకు ముత్యాల వస్త్రం సిద్ధం

సత్యదేవునికి, దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవికి, ఈశ్వరునికి ముత్యాల వస్త్రాన్ని (ముత్తంగి) వచ్చే దసరా నాటికి సిద్ధం చేయాలని తయారీదారు సుధీర్ చరణ్‌కు అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ సూచించారు. ముత్తంగి తయారీకి వ్రత పురోహిత సంఘం నాయకుడు నాగాభట్ల రవిశర్మ ఆధ్వర్యాన పురోహిత సంఘం సూపర్‌వైజర్లు రూ.85 వేల అడ్వాన్స్‌ను ఈఓ సమక్షంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లోనూ విజయదశమి నాటికి స్వామి, అమ్మవార్లకు ముత్తంగి అలంకరించాలని అన్నారు. అందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సుధీర్ చరణ్ చెప్పారు. ముత్తంగి తయారీకి గర్భాలయంలో సత్యదేవుడు, అమ్మవారు, శంకరుల కొలతలను అర్చక స్వాముల సమక్షంలో తీశామని తెలిపారు. మరోసారి వచ్చి, తయారు చేసిన కవచాలను స్వామి, అమ్మవార్లకు అలంకరించి చూసి సరిపోతే మిగిలిన పని పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణారావు, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి, పెండ్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరికి చైన్‌మెష్

రత్నగిరిపై పాత సీఆర్ఓ కార్యాలయం నుంచి రెండో ఘాట్ మూడో మలుపు వరకూ నిర్మిస్తున్న లింక్ రోడ్డులో మట్టి, రాళ్లు పడిపోకుండా కొండకు చైన్ మెష్ ఏర్పాటు చేయనున్నారు. అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ఈ విషయం తెలిపారు. ఈ లింక్ రోడ్డుపై తారు వేయడానికి టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే. దేవదాయ శాఖ ఎస్ఈ జీవీఎస్ శేఖర్ గత వారం ఈ రోడ్డును పరిశీలించారు. వర్షానికి రాళ్లు, మట్టి రోడ్డు పైకి కొట్టుకు వచ్చే ప్రమాదం ఉన్నందున తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో విజయవాడ దుర్గ గుడితో పాటు పలుచోట్ల ఈ విధంగా చైన్ మెష్ ఏర్పాటు చేసిన సుమశ్రీ ఎంటర్‌ప్రైజస్ ఎండీ కేశవరెడ్డిని అన్నవరం పిలిపించారు. ఆయనతో ఈఓ ఆదివారం చర్చించారు. లింక్ రోడ్డుతో పాటు దేవస్థానం ఘాట్ రోడ్లు, మెట్ల దారి, కొత్తగా నిర్మించిన మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, అంతర్గత రోడ్ల వద్ద కూడా రాళ్లు పడిపోకుండా ఈ మెష్ ఏర్పాటు చేయిస్తామని ఈఓ తెలిపారు.

మాణిక్యాంబా అమ్మవారికి స్వర్ణమకర తోరణం

రామచంద్రపురం రూరల్: పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అష్టాదశ శక్తి పీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో స్వర్ణ మకర తోరణం ఏర్పాటు చేశారు. కె.గంగవరం మండలం కుందూరుకు చెందిన దాతలు పంపన లక్ష్మణకుమార్, కృష్ణవేణి దంపతుల సహకారంతో సుమారు రూ.12 లక్షలతో కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ప్రముఖ స్వర్ణకారుడు మురళీ తయారు చేసిన స్వర్ణ మకర తోరణాన్ని మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ రుత్వికులచే సంప్రోక్షణ చేసి అమ్మవారి చెంత అలంకరించారు. దాతలు లక్ష్మణకుమార్, కృష్ణవేణి, వారి కుమార్తెలు అనూష, హరిప్రియ, బంధుమిత్రులకు స్వామి వారి, అమ్మవారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలను ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు అందజేశారు. ఆలయ అర్చకులు కోళ్లపల్లి విశ్వప్రకాశ్, మద్దిరాల రఘునందన్, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణ మకర తోరణంతో దాత పంపన లక్ష్మణకుమార్, శిల్పి మురళీ, ఈఓ తారకేశ్వరరావు

జలకళ.. సాగు భళా

రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- 866 మంది రైతుల పొలాల్లో ఉచిత బోర్లు
- రూ.3.72 కోట్లతో 303 బోర్ల డ్రిల్లింగ్



వేపులబైలు పంచాయతీలో డ్రిల్ చేస్తున్న వైఎస్సార్ జలకళ బోరు

పీలేరు రూరల్: భూగర్భంలో నీరున్నా.. బోర్లు వేయించి పాతాళ గంగను పైకి తెప్పించడం రైతులకు కత్తి మీద సామే. బోర్లు వేయించేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిందే. ఇది గుర్తించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద రైతుల పొలాల్లో పంటలు సాగు చేసుకునేందుకు భూగర్భ జనవరులు పెంచి వారి జీవనోపాధి మెరుగుపరచాలని సంకల్పించింది. జిల్లాలో ఉచితంగా బోర్లు వేయించేందుకు వైఎస్సార్ జలకళ పథకం తీసుకొచ్చింది.

866 మంది పొలాల్లో ఉచిత బోర్లు

అన్నమయ్య జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో వైఎస్సార్ జలకళ పథకం చిన్న, సన్న కారు రైతులకు వరంగా మారింది. ఐదెకరాల భూమి ఉన్న రైతులకు బోరు డ్రిల్లింగ్ చేయడంతోపాటు మోటారు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 866 మంది రైతులకు బోర్లు మంజూరయ్యాయి. 303 చోట్ల రూ.3.72 కోట్లు వెచ్చించి బోర్లు డ్రిల్ చేయించారు. 255 బోర్లలో పాతాళ గంగ పైకి ఉబికి వచ్చింది. దాదాపు పీలేరులో 13, రాయచోటికి 13 మోటార్లు బిగించారు.

అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్ జలకళ కింద వేసిన బోర్ల వివరాలు

నియోజకవర్గం	మంజూరైన బోర్లు	డ్రిల్ అయినవి	విజయవంతమైనవి
పీలేరు	295	121	105
మదనపల్లె	35	04	03
తంబళ్లపల్లె	68	13	12
రాయచోటి	407	117	89
రాజంపేట	06	00	00
రైల్వే కోడూరు	55	48	46

పేద రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పేద రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తోంది. వైఎస్సార్ జలకళ పథకం సన్న, చిన్నకారు రైతులకు వరం. అర్హతగల ప్రతి రైతు పొలంలో ఉచితంగా బోర్లు వేయిస్తున్నారు. రైతులు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయిస్తాం.

– చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే, పీలేరు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి....



వైఎస్సార్ జలకళ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రెండు పద్ధతుల్లోఉచిత బోర్లు వేయడం జరుగుతోంది. ఐదెకరాల లోపు రైతుల పొలాల్లో బోరు వేయించడంతోపాటు మోటారు ఇవ్వడం జరుగుతోంది.

– ఎం.సి.మద్దిలేటి, డ్వామా పీడీ, అన్నమయ్య జిల్లా

ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం



వైఎస్సార్ జలకళ పథకం తీసుకొచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. మా పొలాల్లో ఉచితంగా బోరు వేయించడం సంతోషంగా ఉంది. మా జీవితంలో వెలుగు నింపిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– చెంగల్‌రాయుడు, వేపులబైలు, పీలేరు మండలం

అప్పుల బాధ లేదు



ప్రస్తుతం పొలాల్లో బోర్లు వేయించాలంటే లక్షల రూపాయల ఖర్చు అవుతుంది. అప్పుచేసి బోర్లు వేయలేక పొలాలను బీళ్లుగా పెట్టుకున్నాం. వైఎస్సార్ జలకళ పథకం కింద ఉచితంగా బోరు వేశారు. ఈ పథకం ఉండడం మా అదృష్టం.

– ఎ. నాగరాజ, పుట్టావాండ్లపల్లె, పీలేరు మండలం

ఒక బోరు విఫలమైతే మరో బోరు...

లబ్ధిదారుల పొలాల్లో బోరువేసేందుకు ముందుగా అనుమతినిస్తారు. డ్రిల్లింగ్ కాంట్రాక్టర్ అర్హతగల భూ విజ్ఞాన శాస్త్రవేత్తలతో సర్వే నిర్వహించి వివరాలను సంబంధిత అధికారికి సమర్పిస్తారు. బోరు వేయడం పూర్తయిన తర్వాత జియో ట్యాగింగ్‌తో కూడి డిజిటల్ ఛాయాచిత్రాన్ని లబ్ధిదారుడితో కలిసి అధికారులు తీసుకుంటారు. అనంతరం నిర్ణీత ధర ప్రకారం డ్రిల్లింగ్ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం సొమ్ము చెల్లిస్తుంది.



మంచిమాట

లక్ష్యమే.. శుభమ్

ఏ వ్యక్తికైనా కావాల్సింది ఏమిటి? ఏం ఉన్నా, ఏం లేకపోయినా ఒక వ్యక్తికి ప్రధానంగా ఉండాల్సింది ఏమిటి? ఎలాంటి వ్యక్తి ఐనా, ఎలాంటి స్థితిలో ఉన్న వ్యక్తి ఐనా పొందాల్సింది ఏమిటి? ఎవరి ఆశలు వారివి. ఎవరి ఆకాంక్షలు వారివి. ఎవరి ఆశయాలు వారివి. మన అందరికీ అందాల్సిన వాటిల్లో ఏది అగ్రగణ్యమైంది? ఏది మనల్ని ఎప్పటికీ వీడిపోకుండా ఉండాలి? శుభం... శుభం... శుభం...

‘అథాతో బ్రహ్మ జిజ్ఞాస’ అని బ్రహ్మ సూత్రాల్లో మొట్టమొదటి సూత్రం తెలియజెప్పింది. అంటే శుభం కాబట్టి బ్రహ్మ జిజ్ఞాస అని అర్థం. ఆధ్యాత్మిక పరమైన బ్రహ్మం గురించిన జిజ్ఞాస ఎందుకు అంటే అది శుభం కాబట్టి. లౌకిక జీవనానికైనా, ఆధ్యాత్మిక జీవనానికైనా శుభమే మనిషికి లక్ష్యం; ఆ లక్ష్యానికి మనిషి లక్షణం. లక్ష్య, లక్షణ సమన్వితం జరగాలి. అంటే మనిషికి శుభం సమన్వితం అవ్వాలి.

క్షేమం, మంగళం, మేలు, సౌఖ్యం ఇవి అన్నీ శుభం ఔతాయి. శుభం మనకు నిండుగా ఉండాలి. మనకు శుభం కలగడానికి, మనం శుభంతో మెలగడానికి మనకు మనమే ఆధారం. కనుక మనంత మనమై శుభం కోసం ప్రయత్నం చేసుకోవాలి. ప్రయత్నం వల్ల ప్రయోజనం ఉంటుంది. మనం శుభం కోసం ప్రయత్నిస్తూనే ఉండాలి; మన ప్రయత్నాలకు ఫలితంగా మనం శుభాన్ని పొందుతూ ఉండాలి. శుభాలు ప్రభవించాలని ఎప్పుడైనా అకాంక్షించవచ్చు;

ప్రభవించిన శుభాలు విభవాన్నివ్వాలని ఎవరైనా ఆశించవచ్చు. కానీ ఇంత వరకూ ఆ పని సరిగ్గా జరగలేదు. ఎవరూ ఆ పనిని సరిగ్గా చేసేందుకు ముందుకు రాలేదు. మనం శుభం కోసం పని చెయ్యాలి. మన కోసం శుభం పంట పండాలి. ఇకపైనైనా మనం శుభం కోసం పని చేద్దాం; ఇక అంతా శుభమయం కావడానికి మనల్ని మనం సరిచేసుకుందాం. ఆశపడి, ఆకాంక్షించి, ఆశించి మనం శుభాన్ని సాధించుకుందాం.

కుత్సతం, మత్సరం, దాష్టీకం, దుర్మార్గం, ద్రోహం, వైరం, అసూయ, అక్కసు, బద్ధకం, నీరసం, అభిప్రాయాలు, మనోభావాలు, నమ్మకాలు, అపనమ్మకాలు, అపార్థాలు, అవిద్య, మూర్ఖత్వం, దుశ్చింతన, బుద్ధిమాంద్యం ఇవన్నీ శుభాన్ని మనకు లేకుండా చేశాయి. వీటిని మనం వెనువెంటనే వదిలించేసుకోవాలి. మన చెడు నడతను మనం మార్చుకోవాలి; మనం మనస్తత్త్వంలో మానవత్వాన్ని చేర్చుకోవాలి; మనం మస్తిష్కంలో మంచితనాన్ని కూర్చుకోవాలి. శుభం కోసం మనం ఇకపై సవ్యంగా ఉండాలి. మనమే కాదు, మన పెద్దలు చేసిన తప్పులూ మనకు శుభాన్ని లేకుండా చేస్తున్నాయి; అవి మన సమాజంలో అశుభాన్ని రగిలిస్తున్నాయి; ఎప్పుడో ఎవరో చేసిన కుట్రలు ఇప్పటికీ శుభాన్ని రానివ్వకుండా ఇలాతలాన్ని ఇక్కట్ల పాలు చేస్తున్నాయి. ఈ స్థితిని సరిదిద్దుకుందాం; రానున్న ఆపదల్ని తొలగించుకుందాం; శుభాన్ని ఆవాహన చేసుకుని అందుకుందాం.

> ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలు వీటివల్ల శుభం కలుగుతుంది, జరుగుతుంది అని మనం మన మనసు, మెదడులతో తెలుసుకోవాలి. మన ఆశలు, ఆకాంక్షలు, ఆశయాల వల్ల శుభం మాత్రమే జరిగేట్టు మనం శ్రద్ధ వహించాలి. శుభం కోసం మనం పూనుకోవాలి; శుభంతో మనల్ని మనం పునర్నిర్మించుకోవాలి

‘శుభం కాబట్టి బ్రహ్మ జిజ్ఞాస’ అని ఒక బ్రహ్మసూత్రం మనకు తెలియజెప్పాక ‘సుఖ విశిష్టాభిధానాదేవ చ’ అని మరో బ్రహ్మసూత్రం మనకు ఉండాల్సిన తెలివిడిని ఇస్తూ ఉంది. విశిష్టమైన సుఖం ఇస్తుందని నిశ్చయంగా చెప్పబడినందువల్లే అది బ్రహ్మం అని ఆ సూత్రానికి అర్థం. సుఖం లేదా శుభం విశిష్టమైంది అన్న సత్యాన్ని మనం ఆకళింపు చేసుకోవాలి. ఆ విశిష్టమైన శుభాన్ని మనం పొందుతున్నామా? ఈ ప్రశ్నను మనకు మనమే వేసుకుని సరైన జవాబుగా మనం శుభాన్ని పొందాలి; పొందుదాం. సర్వత్రా శుభం నెలకొనాలి; సర్వులకూ శుభం వెల్లివిరియాలి. శుభం భూయాత్.

– రోచిష్మాన్

వాగ్గేయకార వైభవం - 4

భూమికి తడి తగలాలి

ఊపిరి వాక్కుగా మారిన కారణంగా శరీరం పడిపోయినా, కీర్తి శాశ్వతంగా నిలబడిపోతుంది. నిజానికి మనకు సనాతన ధర్మంలో గొప్పది వేదం. వేదం అపౌరుషేయం. ఈశ్వరుడిచేత చెప్పబడినది. ఈశ్వరుడు ఎంత సనాతనుడో వేదం అంత సనాతనమైనది. నా ఊపిరి రెండు కాదు, ఊపిరి తీస్తున్నంతసేపే ‘నేను’ నేనుగా ఉన్నాను. ఊపిరి తీస్తూ మాట్లాడమంటే మాట్లాడలేను. ఊపిరి విడిచి పెడుతున్నప్పుడు అది వాక్కుగా మారుతుంది. తీసిన ఊపిరులను సమాజ శ్రేయస్సు కోసం వాక్కులుగా మార్చిన వారున్నారు. తామేదీ ఆశించకుండా కేవలం సమాజ శ్రేయస్సే కోరుకున్నారు వారు. భగవంతుడిచ్చిన ఊపిరిని వాక్కుగా మార్చి మాట్లాడుతున్నాను, అది నన్ను శాశ్వతుడిని చేస్తుందన్నాడు పోతన. శాశ్వతమైనది పరబ్రహ్మము. దానిలో చేరిపోతాను... అన్నాడు.

శంకరాచార్యులవారు శివానందలహరి చేస్తూ..అసలు భక్తికి చివరి మాట ఏది అన్నదానికి సమాధానంగా ... ‘‘అంకోలం నిజ బీజ సంతతి రయస్కాంతోపలం సూచికా/ సాధ్వీ నైజ విభుం లతా క్షితి రుహం సింధు స్సరిద్వల్లభమ్/ ప్రాప్నోతీహ యథా తథా పశుపతేః పాదార వింద ద్వయమ్/ చేతో వృత్తి రుపేత్య తిష్ఠతి సదా సా భక్తి రిత్యుచ్యతే ’’ అంటారు. నది సముద్రంలో కలిసిపోయిన తరువాత ఇక నదికి రంగు, రుచి ఇవేం ఉండవు. అటువంటి త్యాగమయ జీవితాన్ని గడిపి భగవంతునిలో ప్రవేశించాడు, నది సముద్రంలో కలసిపోయినట్లు కలిసిపోయాడు. కానీ ఆయన మాత్రం లోకంలో చిరస్థాయిగా ఉండిపోయాడు. ఎలా ... వాక్కు కారణంగా. భారతం ద్వారా నన్నయ అలా ఉండిపోయాడు. ఎర్రాప్రగడ, త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, రామదాసు... వీళ్ళందరూ అలాగే వాక్కుల కారణంగా ఉండిపోయారు. ఆ వాక్కును కొందరు పద్యరూపంగా, కొందరు గద్యరూపంగా, శ్లోకంగా, పాటగా చెప్పారు. పాటకున్న లక్షణం .. అది సంస్కృతికి మూలకందమై నిలబడుతుంది.

భూమినుంచి మొక్కలు పుట్టాలి... అంటే భూమికి ఆర్ద్రత ఉండాలి. అందుకే గ్రీష్మం తరువాత వర్షరుతువు వస్తుంది. దాని ముందు ఆషాఢమాసం ప్రవేశించగానే ప్రతి ఊరిలోనూ అధిష్ఠాన దేవతయిన గ్రామదేవతను దర్శించుకుని నైవేద్యం పెడతారు. ఎందుకు! ఆమె అనుగ్రహంతో నేను ఈ ఊరిలో ఉండి అన్నం తినగలుగుతున్నా... కాబట్టి ఏడాదికొక్కసారి నేను ఆమెకు నైవేద్యం పెట్టాలి. ఆమె భూమికి ఆర్ద్రత కలిగిస్తుంది, వర్ష రూపంలో. తడి తగలగానే ఏడాదికి సరిపడా నేను తినగలిగిన అన్నం నాకు దొరుకుతుంది... అన్న భావన.


భూమికి తడి తగలకపోతే, ఎండి పడిపోయిన జామ గింజలు, బత్తాయి గింజలు, ధాన్యపు గింజలు ఏవీ మొక్కలుగా పైకి లేవవు. తడి తగలగానే గడ్డిపరక నుంచి మొదలుపెట్టి, భూమికి చేరిన గింజలన్నీ మొక్కలై పెరుగుతాయి. అంటే ఆర్ద్రత ఉండాలి. ప్రాణుల మనుగడకు అది ఆధారం. అలాగే ఒక దేశ సంస్కృతి నిలబడాలంటే... భూమి అంతా చెమ్మగిల్లి మొక్కలు పుట్టినట్టు, కళలుండాలి. కళలద్వారా సంస్కృతి పెరుగుతుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



బౌద్ధవాణి

ధర్మతాదృష్టి



శీలభ్రష్టత అంటే వ్యభిచరించడం ఒక్కటే కాదు. అసత్యాలు పలకడం, దొంగిలించడం, నిండు ప్రాణాలు తియ్యడం, మత్తుపానీయాలు సేవించడం. ఇవన్నీ శీలభ్రష్టతలే! ఈ దోషాలు లేని వ్యక్తి గానీ, సమాజం గానీ నైతికంగా దిగజారదు. తప్పు చేయడం తప్పు కాదు. తెలియకుండా కొన్ని తప్పులు జరుగుతూనే ఉంటాయి. కానీ అవి తప్పు అని తెలిశాక కూడా అవే తప్పులు చేయడమే పెద్ద తప్పు.

తప్పు తెలుసుకుని సరిదిద్దుకోవడాన్ని మరలా ఆ తప్పుని చేయకపోవడాన్ని బుద్ధుడు ధర్మతాదృష్టి అంటాడు.

ఒక భిక్షువు వెనుకటి అలవాటుని మానుకోలేక సారాయి సేవించాడు. అతను భిక్ష కోసం వెళ్ళినప్పుడు గృహస్తులు చక్కగా భోజనం పెట్టారు. ధర్మ ప్రవచనం విన్నారు. ఆ తరువాత మోమాటం పెట్టి పానీయానికి బదులు పులిసిన ద్రవాన్ని ఇచ్చారు. అది సారాయి లాంటిదే అని తెలిసి కూడా నిగ్రహించుకోలేక కొద్దిగా సేవించాడు. కానీ.. ఆ తరువాత ఎంతో తప్పుచేసిన వాడిగా మధన పడ్డాడు. ఇంకెప్పుడూ ఇలాంటి తప్పు చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాడు. తిరిగి ఆశ్రమానికి వచ్చాక తన మిత్ర భిక్షువులు ఒకరిద్దరికి చెప్పుకున్నాడు. అయినా ఆ భిక్షువు మనస్సు శాంతించలేదు. ఏదో ఒక మూల తప్పుచేశాను అనే భావన తొలుస్తూనే ఉంది. చివరికి బుద్ధుని చుట్టూ బౌద్ధ సంఘం చేరి ఉంది. అప్పుడు బుద్ధుడు ఆ భిక్షువుని శాంతపరచి, అందరితోపాటు కూర్చోబెట్టి–

‘‘భిక్షువులారా! తెలిసో తెలియకో తప్పులు, దోషాలు కలిగినప్పుడు వాటిని కప్పిపుచ్చుకునే వారు దుశ్శీలురు. కానీ కొందరు తమ దోషాన్ని విజ్ఞులకీ మిత్రులకీ చెప్పుకుంటారు. ఇకపై ఇలాంటి తప్పు జరగకుండా నడుచుకుంటారు. ఇలా సరిదిద్దుకునే పద్ధతిని ‘ధర్మతా దృష్టి’ అంటారు. వీరు పసిపిల్లలతో, ఆవుతో సమానం’’ అంటూ భిక్షు సంఘాన్ని కలయ చూశాడు. ఆ భిక్షువు వంక పరిశీలనగా చూశాడు. అతనిముఖంలో తొంగి చూసే సిగ్గు, బిడియం పోయాయి. మనోనిర్మలత అతని ముఖంలో ప్రస్ఫుటంగా కనిపించింది.

బుద్ధుడు మరలా–

‘‘భిక్షువులారా! ఒక పసిబిడ్డ వెల్లికిలా పడుకుని ఉంటాడు గదా! ఆ పసితనంలో కూడా ఆ బిడ్డ తన చేతితో గానీ, కాలితో గానీ.. అగ్నిని ముట్టుకుంటే ఏం చేస్తాడు? చాలా వేగంగా.. ఆ చేతినో, కాలినో వెనక్కి ముడుచుకుంటాడు. అలాగే ధర్మతాదృష్టి కలిగిన వారూ తమ దోషాన్నుండి అంతే వేగంగా వెనక్కి మళ్ళుతారు. గట్టున మేస్తూ ఉన్న ఆవు ఆకలితో ఉండి, తాను ఆబగా మేస్తూ కూడా తన దూడను గమనిస్తూనే ఉంటుంది. అలాగే ఈ ధర్మతా దృష్టి కలిగిన వారు తమ దోషాల్ని తామే సరిదిద్దుకుంటూ.. ఆవులా జాగ్రత్తగా ఉంటూ తమ జ్ఞానాన్ని, శీలాన్నీ వృద్ధి చేసుకోవాలి’’ అని చెప్పాడు.

ఆ భిక్షువుకి మనస్సులోని అల్లకల్లోలాలు శాంతించాయి. తన మీద తనకు ధైర్యం వచ్చింది. ధర్మసాధనలో అందరికంటే ముందు శిఖరాగ్రానికి చేరాడు. ఇలాంటి దృష్టి సంపన్నుడు ధర్మబలుడై లోకోత్తరుడౌతాడు. మనుషులు మానూ మాకులూ, రాయీ రప్పలూ కాదు ఏం దోషం చేయకుండా పడి ఉండటానికి. తాను సమాజంలో, సమాజం తనలో ఉండి నడిచేవారు. సమాజ హితాన్ని కోరే వారు ధర్మతాదృష్టితో తమని తాము సంస్కరించుకుంటూ, సమాజాన్ని సంస్కరించాలి. ఇదే ఉత్తమ ధర్మం. అత్యుత్తమ ధర్మం.

అలాంటి మార్గాన్ని అందించిన తథాగత బుద్ధుడు సదా స్మరణీయుడు!

–డా. బొర్రా గోవర్ధన్

సినిమా రీల్స్

అంచనాలకు మించి!


● శిరీష్, ‘దిల్’ రాజు, నితిన్, శ్రీరామ్ వేణు

నితిన్ హీరోగా నటించనున్న కొత్త సినిమాకు ‘తమ్ముడు’ టైటిల్ ఖరారైంది. శ్రీరామ్ వేణు దర్శకత్వంలో ‘దిల్’ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేయగా, ఫైనాన్షియర్ ప్రసాద్ క్లాప్ కొట్టారు. దర్శకుడు వంశీ పైడిపల్లి తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ‘‘కొన్ని సినిమా టైటిల్స్ చాలా బాధ్యతతో వస్తుంటాయి. మీ అంచనాలకు మించి ఉండేలా ఈ సినిమా చేస్తాం’’ అని పేర్కొన్నారు నితిన్. ‘‘సెప్టెంబర్ 1నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుంది. ‘దంగల్, కహనీ, తారే జమీన్ పర్’ లాంటి సక్సెస్ ఫుల్ చిత్రాలకు వర్క్ చేసిన సత్యజిత్ పాండే (సేతు) ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తాం’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. అయితే అక్క– తమ్ముళ్ల అనుబంధం నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం ఉండనుందని టాలీవుడ్ టాక్.

పదిహేడేళ్ల తర్వాత...


● అమితాబ్ బచ్చన్
● షారుక్ ఖాన్

బాలీవుడ్ సీనియర్ డాన్స్‌కు నూతన డాన్ రణ్‌వీర్ సింగ్ అండ్ టీమ్ నుంచి ఆహ్వానాలు అందనున్నాయని బాలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. రణ్‌వీర్ సింగ్ హీరోగా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో ‘డాన్ 3’ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇప్పటికే బాలీవుడ్ వెండితెరపై డాన్ పాత్రలు చేసిన అమితాబ్ బచ్చన్(డాన్– 1978), షారుక్ ఖాన్ (డాన్–2006, ‘డాన్ 2’–2011)లు ‘డాన్ 3’ చిత్రంలో అతిథి పాత్రల్లో కనిపించనున్నారట. ఇందుకోసం రణ్‌వీర్, ఫర్హాన్‌లు ప్రయత్నాలు మొదలు పెట్టారని టాక్. అయితే 2006లో వచ్చిన ‘కభీ అల్విదా నా కహెనా’ తర్వాత అమితాబ్, షారుక్ స్క్రీన్ షేర్ చేసుకోలేదు. మరి..‘డాన్ 3’ కోసం దాదాపు 17ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటారా? వేచి చూడాలి.

మూడు రోజులు.. మూడు భాషలు


● శ్రుతీహాసన్

ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన సినిమా ‘సలార్’. విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా, పృథ్వీరాజ్ సుకుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ‘సలార్’ తొలిపార్టు ‘సలార్: సీజ్‌ఫైర్’ చిత్రం సెప్టెంబరు 28న విడుదల కానుంది. రిలీజ్ సమయం దగ్గర పడుతుండటంతో ప్రభాస్, ప్రశాంత్ అండ్ టీమ్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌తో బిజీగా ఉంటున్నారు. రీసెంట్‌గా ‘సలార్: సీజ్‌ఫైర్’ సినిమాకు బెంగళూరులో డబ్బింగ్ చెప్పారట ప్రభాస్. ఈ సినిమాలో ఆద్య అనే జర్నలిస్ట్ పాత్రలో శ్రుతీహాసన్ నటిస్తున్నారని ప్రచారం సాగింది. అయితే ఈ చిత్రంలో ఆమెది జర్నలిస్ట్ పాత్ర కాదని, టీచర్ ఆద్య పాత్ర అని తాజాగా తెరపైకి వచ్చింది. కాగా హిందీ, తెలుగు, తమిళంలో మూడు రోజుల్లో మూడు భాషల్లో డబ్బింగ్ చెప్పారు శ్రుతీహాసన్.

చంద్రముఖి 2 విజయం ఆయనకే దక్కుతుంది

– రాఘవ లారెన్స్


● కంగనా రనౌత్, రాఘవ లారెన్స్, సుభాస్కరన్, కీరవాణి, పి.వాసు

‘‘డైరెక్టర్ వాసుగారు నాలుగు దశాబ్దాల అనుభవంలో ఎన్నో గొప్ప సినిమాలు చేశారు. ‘చంద్రముఖి 2’ను కూడా గొప్పగా తెరకెక్కించారు.. ఈ సినిమా సాధించే విజయం ఆయనకే దక్కుతుంది’’ అని హీరో రాఘవ లారెన్స్ అన్నారు. పి.వాసు దర్శకత్వంలో రాఘవ లారెన్స్ హీరోగా, కంగనా రనౌత్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం ‘చంద్రముఖి 2’. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 15న విడుదలవుతోంది. చెన్నైలో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో రాఘవ లారెన్స్ మాట్లాడుతూ– ‘‘ నేను నిర్వహిస్తున్న చారిటీ సంస్థకు సుభాస్కరన్‌గారు ఎంతో పెద్ద మనసుతో కోటి రూపాయలు విరాళం ఇచ్చారు. ఆ డబ్బుతో ఓ స్థలం కొని భవనం కడతాను. ఇకపై నా చారిటీకి డబ్బులు ఇవ్వకండి.. నా చారిటీకి నేను ఉన్నాను. సాయం చేయాలనుకుంటే చాలా చారిటీ సంస్థలు ఉన్నాయి.. వాటికి ఇవ్వండి’’ అన్నారు. ‘‘నేను నటిగా కెరీర్ స్టార్ట్ చేసిన ఇన్నేళ్లలో ‘చంద్రముఖి 2’ వంటి గొప్ప చిత్రం చేయలేదు’’ అన్నారు కంగన. ‘‘చంద్రముఖి 2’ ని లారెన్స్‌తో చేస్తున్నామని రజనీకాంత్‌గారికి చెప్పగానే.. సినిమా హిట్ అవుతుందని చెప్పారు’’ అని పి.వాసు అన్నారు.

ఓటు మన బాధ్యత

హృతిక్ శౌర్య, తన్వి నేగి జంటగా రవి దర్శకత్వం వహించిన చిత్రం ‘ఓటు’. ఫ్లిక్ నైన్ స్టూడియోస్‌పై ఫ్లిక్ ఫిలిమ్స్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని నటుడు, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, సినిమా హిట్ కావాలని ఆకాంక్షించారు. ‘‘మన దేశంలో కుల, మత, ప్రాంతీయ అభిప్రాయ బేధాలు లేకుండా జరుపుకునే ఏకైక పండగ.. ఎన్నికల పండగ’ అనే డైలాగ్‌తో టీజర్ మొదలవుతుంది. ‘‘మందుకు, నోటుకు ఓటు అమ్ముకోవడం కరెక్ట్ కాదు కదా?’, ‘ఓటు అనేది హక్కు కాదు.. మన బాధ్యత’’ వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. హృతిక్ శౌర్య మాట్లాడుతూ– ‘‘ఫ్యామిలీ, లవ్ ఎమోషన్స్‌తో పాటు చాలా ముఖ్యమైన కథతో ‘ఓటు’ రూపొందింది’’ అన్నారు. ‘‘మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి’’ అన్నారు తన్వి నేగి. నటుడు గోపరాజు రమణ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: అగస్త్య, కెమెరా: ఎస్. రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రామకృష్ణ.


● హృతిక్, తన్వి

ఖుషి గొప్ప అనుభూతినిచ్చింది

– హేషమ్ అబ్దుల్ వాహబ్



‘‘ఓ సినిమాకు సంగీతం బాగుంటే ప్రేక్షకులు థియేటర్స్‌కు వస్తారనే నమ్మకం నాకు ఉంది. మంచి సంగీతం కోసం తాపత్రయపడే ఇండస్ట్రీ టాలీవుడ్’’ అని సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్ అన్నారు. విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వం వహించిన చిత్రం ‘ఖుషి’. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా హేషమ్ అబ్దుల్ వాహబ్ మాట్లాడుతూ– ‘‘నేను సంగీతం అందించిన మలయాళ హిట్ ఫిల్మ్ ‘హృదయం’ విడుదల తర్వాత ‘ఖుషి’ అవకాశం వచ్చింది. ‘ఖుషి’ టైటిల్‌సాంగ్‌కు ఎక్కువగా కష్టపడ్డాను. ‘నా రోజా నువ్వే..’ పాటలో మణిరత్నంగారి సినిమాల టైటిల్స్‌తో లిరిక్స్ ఉండేలా శివ నిర్వాణగారే ప్లాన్ చేసి, ఆయనే లిరిక్స్ కూడా రాశారు. సంగీతం పరంగా విజయ్‌గారు కూడా కొన్ని ఇన్‌పుట్స్ ఇచ్చారు. ‘ఖుషి’ ప్రయాణం నాకు గొప్ప అనుభూతినిచ్చింది.. విదేశాలకు వెళ్లినా ‘ఖుషి’ పాటల గురించి మాట్లాడుతున్నారు. ఈ సినిమా మ్యూజికల్ బ్లాక్‌బస్టర్ అవుతుంది. ప్రస్తుతం నాని ‘హాయ్ నాన్న’, శర్వానంద్ కొత్త సినిమాకు సంగీతం అందిస్తున్నా’’ అన్నారు.

సరికొత్త సికాడా..


● వందన, చందు మొండేటి, శ్రీజిత్

రజిత్ సీఆర్, గాయత్రి మయూర, జైస్ జోస్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘సికాడా’. శ్రీజిత్ ఎడవనా దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాని తీర్నా ఫిల్మ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వందనా మీనన్, గోపకుమార్ పి.నిర్మిస్తున్నారు. తెలుగు, కన్నడ, తమిళ్, మలయాళ భాషల్లో రూపొందిన ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని దర్శకుడు చందు మొండేటి, హీరో సోహెల్ విడుదల చేశారు. ‘‘సరికొత్త కథాంశంతో రూపొందిన చిత్రం ‘సికాడా’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీజిత్ ఎడవనా.

సూపర్ హీరో


● ‘ఏ మాస్టర్ పీస్’ పోస్టర్

అరవింద్ కృష్ణ, అషు రెడ్డి జంటగా సుకు పూర్వజ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ‘ఏ మాస్టర్ పీస్’. శ్రీకాంత్ కండ్రేగుల నిర్మిస్తున్న ఈ సినిమా ప్రీ టీజర్‌ను రిలీజ్ చేశారు. సూపర్ హీరోను పరిచయం చేస్తూ స్టన్నింగ్ విజువల్స్, డైలాగ్స్‌తో టీజర్ విడుదలైంది. ‘బలమున్న వాడిని పట్టుకోవాలంటే పవర్ కావాలి.. కానీ, నీలా బలం ప్లస్ పవర్ ఉన్నవాడిని పట్టుకోవాలంటే ఎమోషన్ కావాలి..’ వంటి డైలాగులు ప్రీ టీజర్‌లో ఉన్నాయి. ‘‘ఏ మాస్టర్ పీస్’ న్యూ కాన్సెప్ట్ సూపర్ హీరో మూవీ అనుభూతిని తెలుగు ప్రేక్షకులకు అందించబోతోంది. ప్రస్తుతం మా సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణ తుది దశలో ఉంది’’ అని చిత్రయూనిట్ పేర్కొంది.

తండ్రీకొడుకుల యాక్షన్


● శాంతి చంద్ర, సిమ్రితి

శాంతి చంద్ర, దీపికా సింగ్, సిమ్రితి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘డర్టీ ఫెలో’. మూర్తి సాయి అడారి డైరెక్షన్‌లో జి. శాంతిబాబు నిర్మించిన ఈ సినిమా అక్టోబరులో విడుదల కానుంది. ‘‘తండ్రీకొడుకుల యాక్షన్ డ్రామా ఈ చిత్రం. కొడుకు తప్పుడు మార్గంలో వెళ్తున్నాడని గ్రహించిన ఓ తండ్రి ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడు? అన్నదే ఈ చిత్ర కథాంశం’’ అన్నారు. ‘‘ప్రేక్షకులు మెచ్చుకునే అన్ని అంశాలు మా సినిమాలో ఉన్నాయి’’ అన్నారు మూర్తి సాయి. ఈ సినిమాకు సంగీతం: సతీష్.

హలో బేబీ షురూ


● అరోరా శ్రీ

అరోరా శ్రీ టైటిల్ రోల్‌లో ‘హలో బేబీ’ సినిమా షురూ అయింది. ఈ చిత్రం ద్వారా రాంగోపాల్ రత్నం దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎస్‌కేఎమ్ఎల్ మోషన్ పిక్చర్స్‌పై కాండ్రేగుల ఆదినారాయణ నిర్మిస్తున్న ఈ సినిమా ఆదివారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు యాదకుమార్ క్లాప్ కొట్టారు. ‘‘సరికొత్త కథ, మంచి కథా బలం ఉన్న సినిమా ‘హలో బేబీ’’ అన్నారు కాండ్రేగుల ఆదినారాయణ, రాంగోపాల్ రత్నం. ‘‘విభిన్నమైన కథా చిత్రమిది. ఇలాంటి సవాల్‌తో కూడుకున్న పాత్ర చేయడం హ్యాపీ’’ అన్నారు అరోరా శ్రీ. ఈ చిత్రానికి కెమెరా: రమణ, సంగీతం: నితిన్.



ఆసియా క్రీడల్లో టీమిండియా హెడ్ కోచ్‌గా లక్ష్మణ్

జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) చైర్మన్, మేటి క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత పురుషుల జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ప్రస్తుతం లక్ష్మణ్ బెంగళూరు శివారు ఆలూరులో వర్ధమాన క్రికెటర్లకు ఏర్పాటు చేసిన హైపెర్ఫార్మెన్స్ శిబిరాన్ని పర్యవేక్షిస్తున్నాడు. మాజీ ఆల్‌రౌండర్ హృషికేశ్ కనిత్కర్‌కు మహిళల జట్టు తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆసియా క్రీడలు వచ్చే నెల 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనాలో జరుగుతాయి.

లైల్స్ 'ట్రిపుల్' ధమాకా

కార్ల్ లూయిస్, మౌరిస్ గ్రీన్, టైసన్ గే (అమెరికా), ఉసేన్ బోల్ట్(జమైకా) తర్వాత ఒకే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్ప్రింట్ రేసుల విభాగంలో మూడు స్వర్ణ పతకాలు గెలిచిన ఐదో అథ్లెట్‌గా అమెరికా స్టార్ నోవా గుర్తింపు పొందాడు. ఇప్పటికే 100, 200 మీటర్ల స్ప్రింట్ రేసుల్లో స్వర్ణ పతకాలు గెలిచిన నోవా లైల్స్ 4×100 మీటర్ల రిలేలోనూ బంగారు పతకం సొంతం చేసుకొని దిగ్గజాల సరసన చేరాడు.



వెర్‌స్టాపెన్ రికార్డు

సీజన్‌లో వరుసగా తొమ్మిదో విజయం



జాండ్‌వూర్ట్ (నెదర్లాండ్స్): ఫార్ములావన్ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ 11వ విజయం సాధించాడు. ఆదివారం జరిగిన డచ్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచి ఈ సీజన్‌లో వరుసగా తొమ్మిదో విజయం అందుకున్నాడు. తద్వారా ఫార్ములావన్ చరిత్రలో అత్యధిక వరుస విజయాలు సాధించిన డ్రైవర్‌గా సెబాస్టియన్ వెటెల్ (2013లో వరుసగా 9) పేరిట ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ సమం చేశాడు. వర్షం పలుమార్లు అంతరాయం కలిగించిన ఈ రేసులో నిర్ణీత 72 ల్యాప్‌లను వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా 2 గంటల 24 నిమిషాల 04.411 సెకన్లలో ముగించి అగ్రస్థానం దక్కించుకున్నాడు. అలోన్సో (ఆస్టన్ మార్టిన్) రెండో స్థానంలో, పియరీ గాస్లీ (అల్పైన్) మూడో స్థానంలో నిలిచారు. 22 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 13 రేసులు జరగ్గా 13 రేసుల్లోనూ రెడ్‌బుల్ డ్రైవర్లే విజేతలుగా నిలిచారు. వెర్‌స్టాపెన్ 11 రేసుల్లో గెలుపొందగా, మిగిలిన రెండు రేసుల్లో రెడ్‌బుల్‌కే చెందిన సెర్జియో పెరెజ్ టైటిల్స్ సాధించాడు. ప్రస్తుతం డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో వెర్‌స్టాపెన్ 339 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... పెరెజ్ 201 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. సీజన్‌లోని తదుపరి రేసు ఇటలీ గ్రాండ్‌ప్రి సెప్టెంబర్ 3న జరుగుతుంది.



భారత జట్టు చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, కోచ్ గురుసాయిదత్‌లతో ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ కాంస్య పతక విజేత హెచ్‌ఎస్ ప్రణయ్





- జావెలిన్ త్రోలో పసిడి పతకం
- ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం నెగ్గిన తొలి భారతీయ అథ్లెట్‌గా రికార్డు
- ఈటెను 88.17 మీటర్లు విసిరిన భారత స్టార్

నీరజ్ స్వర్ణ చరిత్ర

నాలుగు దశాబ్దాల ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో ఏ భారతీయ అథ్లెట్‌కు సాధ్యంకాని ఘనతను జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా సాధించాడు. ఈ మెగా ఈవెంట్ చివరిరోజు ఆదివారం నీరజ్ చోప్రా భారత అభిమానుల్లో పసిడి కాంతులు నింపాడు. అందరి అంచనాలను నిజం చేస్తూ నీరజ్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. తద్వారా ఈ ప్రతిష్టాత్మక చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా కొత్త చరిత్రను లిఖించాడు.

బుడాపెస్ట్ (హంగేరి): భారతీయులు కూడా ఇక సగర్వంగా చెప్పవచ్చు... ప్రపంచ అథ్లెటిక్స్‌లో మాకు ఉన్నాడు ఒక ప్రపంచ చాంపియన్ అని... గత ఏడాది ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం నెగ్గిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఈసారి పతకం రంగు మార్చాడు. 'రజత'ధీరుడి నుంచి 'పసిడి'వీరుడిగా మారాడు. ఆదివారం ముగిసిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నీరజ్ చోప్రా స్వర్ణ పతకం సాధించాడు. నీరజ్ రెండో ప్రయత్నంలో విసిరిన జావెలిన్ అత్యధికంగా 88.17 మీటర్ల దూరం వెళ్లింది. మొత్తం ఆరు ప్రయత్నాల్లో ఈ దూరాన్ని మరో అథ్లెట్ అధిగమించలేకపోయాడు. ఫలితంగా నీరజ్‌కు బంగారు పతకం ఖరారైంది. పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ 87.82 మీటర్లతో రజత పతకం దక్కించుకోగా... జాకుబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్) 86.67 మీటర్లతో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన కిశోర్ కుమార్ జేనా 84.77 మీటర్లతో ఐదో స్థానంలో, మనూ 84.14 మీటర్లతో ఆరో స్థానంలో నిలిచారు.

ఫౌల్‌తో మొదలు...

క్వాలిఫయింగ్‌లో అగ్రస్థానంలో నిలిచిన నీరజ్ చోప్రా ఫైనల్‌ను నిరాశాజనకంగా ప్రారంభించాడు. నీరజ్ తొలి ప్రయత్నమే ఫౌల్ అయింది. దాంతో భారత అభిమానులు కాస్త ఆందోళన చెందారు. కానీ నీరజ్ వెంటనే తేరుకున్నాడు. రెండో ప్రయత్నంలో నీరజ్ జావెలిన్‌ను ఏకంగా 88.17 మీటర్ల దూరం విసిరాడు. ఈ ప్రదర్శనతో నీరజ్ చివరిదైన 12వ స్థానం నుంచి అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. నిర్ణీత ఆరు ప్రయత్నాల వరకు నీరజ్ అగ్రస్థానాన్ని కొనసాగించాడు.

అన్నీ సాధించాడు...

2016లో ప్రపంచ అండర్-20 చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలిచి వెలుగులోకి వచ్చిన నీరజ్ ఈ ఏడేళ్ల కాలంలో ఇంతింతై వటుడింతై అన్నట్లు ఎదిగాడు. 2017 ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి పాల్గొని 15వ స్థానంలో నిలిచిన నీరజ్ ఆ తర్వాత రాటుదేలాడు. అదే ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలిచిన నీరజ్... 2018 ఆసియా క్రీడల్లో, 2018 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ పసిడి పతకాలు సొంతం చేసుకున్నాడు. 2021లో టోక్యో ఒలింపిక్స్‌లో అందరి అంచనాలను తారుమారు చేస్తూ స్వర్ణ పతకం నెగ్గిన ఈ హరియాణా స్టార్ 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం, 2022 ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో స్వర్ణంతో మరింత ఎత్తుకు ఎదిగాడు. అదే జోరును కొనసాగిస్తూ తాజా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకంతో యావత్ భారతాన్ని ఆనందడోలికల్లో ముంచాడు. తాజా స్వర్ణంతో నీరజ్ అథ్లెటిక్స్‌లోని అన్ని మేజర్ ఈవెంట్లలో పతకాలు నెగ్గిన జావెలిన్ త్రోయర్‌గా నిలిచాడు.

భారత రిలే జట్టుకు ఐదో స్థానం

ఆదివారమే జరిగిన పురుషుల 4x400 మీటర్ల రిలే ఫైనల్లో అనస్ యాహియా, అమోజ్ జేకబ్, అజ్మల్, రాజేశ్ రమేశ్‌లతో కూడిన భారత బృందం ఐదో స్థానాన్ని దక్కించుకుంది. భారత బృందం 2 నిమిషాల 59.92 సెకన్లలో గమ్యానికి చేరింది. మరోవైపు మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ ఫైనల్లో భారత అథ్లెట్ పారుల్ చౌదరీ 11వ స్థానంలో నిలిచింది. పారుల్ 9 నిమిషాల 15.31 సెకన్లలో గమ్యానికి చేరి కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది.

3 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు లభించిన మొత్తం పతకాలు. 2003లో మహిళల లాంగ్‌జంప్‌లో అంజూ జార్జి కాంస్యం సాధించగా... 2022లో నీరజ్ రజతం, 2023లో నీరజ్ స్వర్ణం గెలిచాడు.

2 ఒలింపిక్స్‌తోపాటు ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ స్వర్ణ పతకాలు గెలిచిన రెండో భారతీయ క్రీడాకారుడు నీరజ్ చోప్రా. గతంలో షూటర్ అభినవ్ బింద్రా ఈ ఘనత సాధించాడు. అభినవ్ బింద్రా 2006 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో పసిడి పతకాలు గెలిచాడు.

చాంప్ రాయలసీమ కింగ్స్

ఫైనల్లో కోస్టల్ రైడర్స్‌పై గెలుపు ● ఆంధ్ర ప్రీమియర్ లీగ్



శ్రీకాంత్, వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఏపీఎల్ ట్రోఫీ అందుకుంటున్న కెప్టెన్ విహారి, గిరినాథ్ రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌లో రాయలసీమ కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం ఇక్కడి వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఫైనల్లో హనుమ విహారి సారథ్యంలోని రాయలసీమ కింగ్స్ ఐదు వికెట్ల తేడాతో గత సీజన్ చాంపియన్ కోస్టల్ రైడర్స్ జట్టును ఓడించింది. వర్షం వల్ల 18 ఓవర్లకు కుదించిన ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన కోస్టల్ రైడర్స్ 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. ధరణి కుమార్ (23 బంతుల్లో 30; 5 ఫోర్లు), మద్దిల వర్ధన్ (32 బంతుల్లో 50; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. రాయలసీమ బౌలర్లలో షేక్ కమరుద్దీన్ 3, హరిశంకర్ 2 వికెట్లు తీశారు. అనంతరం రాయలసీమ కింగ్స్ 16.3 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ హనుమ విహారి (29 బంతుల్లో 46 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), బోధల కుమార్ (23 బంతుల్లో 53; 4 ఫోర్లు, 5 సిక్సర్లు) చెలరేగారు. ఆరంభంలో ఓపెనర్ హనీశ్ రెడ్డి (0), వంశీకృష్ణ (3) వికెట్లను కోల్పోయి తడబడిన కింగ్స్‌ను కెప్టెన్ హనుమ విహారి కడదాకా అజేయంగా నిలబడి గెలిపించాడు. శ్రవణ్ (18 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) కాసేపు అండగా నిలువగా... తర్వాత విహారి, కుమార్ నాలుగో వికెట్‌కు 78 పరుగులు జోడించారు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన కుమార్ అర్ధసెంచరీ సాధించాడు. అతని నిష్క్రమణ తర్వాత తేజ రెడ్డి (4) నిరాశపరచగా... గిరినాథ్ రెడ్డి (17 బంతుల్లో 29; 1 ఫోర్, 3 సిక్సర్లు) ఆశిష్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లోని తొలి మూడు బంతులను సిక్స్‌లుగా మలిచి రాయలసీమ కింగ్స్ విజయాన్ని ఖరారు చేశాడు. కోస్టల్ రైడర్స్ బౌలర్లలో స్టీఫెన్, ఆశిష్ రెండేసి వికెట్లు తీశారు. భారత జట్టు మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు. తొలుత శ్రీకాంత్ వైఎస్ఆర్ స్టేడియంలో ఏసీఏ పూర్వ కార్యదర్శి ఎస్.వెంకటరావు గేట్‌ను ప్రారంభించారు.

పోటీ ఆ ఇద్దరి మధ్యే!

- టైటిల్ ఫేవరెట్స్‌గా జొకోవిచ్, అల్‌కరాజ్
- నేటి నుంచి యూఎస్ ఓపెన్ టోర్నీ





న్యూయార్క్: టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్‌కు రంగం సిద్ధమైంది. నేటి నుంచి జరిగే ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో అందరి దృష్టి పురుషుల సింగిల్స్ విభాగంపైనే ఉంది. టైటిల్ నిలబెట్టుకునేందుకు ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)... 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో చరిత్ర పుటల్లో స్థానం సంపాదించేందుకు నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) పట్టుదలతో ఉన్నారు. జొకోవిచ్ విజేతగా నిలిస్తే... టెన్నిస్ చరిత్రలో అత్యధికంగా 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియా) పేరిట ఉన్న రికార్డును సమం చేస్తాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీల్లో టైటిల్ నెగ్గి, వింబుల్డన్ టోర్నీ ఫైనల్లో అల్‌కరాజ్ చేతిలో ఓడిపోయిన జొకోవిచ్‌కు ఈసారి ఈ స్పెయిన్ స్టార్ నుంచే గట్టిపోటీ ఎదురుకానుంది. కోవిడ్ టీకా వేసుకోని కారణంగా గత ఏడాది జొకోవిచ్ యూఎస్ ఓపెన్‌కు దూరమయ్యాడు. కోవిడ్ వ్యాక్సిన్ నిబంధనలు సడలించడంతో జొకోవిచ్ ఈసారి బరిలోకి దిగుతున్నాడు.

విద్య, ఉద్యోగ సమాచారం

వరంగల్ ఐఎంఎస్‌లో వివిధ పోస్టులు

వరంగల్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్(ఐఎంఎస్)కి చెందిన ఈఎస్ఐ హాస్పిటల్/డిస్పెన్సరీల్లో.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09
» **పోస్టుల వివరాలు:**సివిల్ అసిస్టెంట్ సర్జన్-03, డెంటల్ అసిస్టెంట్ సర్జన్-01, ఫార్మసిస్ట్-05.
» **వేతనం:** నెలకు సీఏఎస్/డీఏఎస్ రూ.58,850, ఫార్మసిస్ట్ రూ.31,040.
» **అర్హత:** ఎంబీబీఎస్, బీడీఎస్, డీఫార్మసీ, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది జాయింట్ డైరెక్టర్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, ఈఎస్ఐ హాస్పిటల్ క్యాంపస్, నర్సంపేట్ రోడ్, వరంగల్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరి తేది:** 28.08.2023.
» **వెబ్‌సైట్:** peddapalli.telangana.gov.in

ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, బెంగళూరులో 100 పోస్టులు

బెంగళూరులోని ఏరోనాటి కల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఏడీఏ).. ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
» **విభాగాలు:** మెకానికల్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, సివిల్ ఇంజనీరింగ్, ఇన్ఫోసైన్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్/ఇంజనీరింగ్ డిగ్రీ/ఎంఈ/ఎంటెక్/ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 28 ఏళ్లు ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.39,370 నుంచి రూ.46,990 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:**రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలి.
» **ఇంటర్వ్యూ వేదిక:** ఏడీఏ క్యాంపస్ 2, సురన్‌జన్ దాస్ రోడ్, న్యూథిప్పసంద్ర పోస్ట్, బెంగళూరు-560075.
» **ఇంటర్వ్యూ తేది:** 04.09.2023, 07.09.2023, 11.09.2023, 14.09.2023. » **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 8.30 నుంచి 11 వరకు.
» **వెబ్‌సైట్:** www.ada.gov.in

కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలు

కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వివరాలు:** బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ నర్సింగ్ (బీఎస్సీ నర్సింగ్).
» **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు.
» **అర్హత:** ఇంటర్మీడియట్(బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ) లేదా ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. టీఎస్ ఎంసెట్-2023 ర్యాంకు సాధించి ఉండాలి. **వయసు:** 31.12.2023 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.
» **ఎంపిక విధానం:**టీఎస్ ఎంసెట్-2023 ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.08.2023
» **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in

ఐఐటీ తిరుపతిలో 24 నాన్‌టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), తిరుపతి..డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 24
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ లైబ్రేరియన్-01,డిప్యూటీ రిజిస్ట్రార్-01, జూనియర్ సూపరింటెండెంట్-02, జూనియర్ అసిస్టెంట్-08, జూనియర్ హిందీ అసిస్టెంట్ గ్రేడ్1-01, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్-02, జూనియర్ టెక్నీషియన్-08, ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ,ఆబ్జెక్టివ్-బేస్డ్ టెస్ట్, రాతపరీక్ష, స్కిల్ టెస్ట్/ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.09.2023
» **వెబ్‌సైట్:** iittp.ac.in

ఐఐటీ ధన్‌బాద్‌లో ఇంజనీర్ పోస్టులు

ధన్‌బాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ సిస్టమ్స్ ఇంజనీర్.
» **విభాగాలు:** సిస్టమ్ అడ్మిన్, హెచ్‌పీసీ అండ్ క్లౌడ్ మేనేజ్‌మెంట్, నెట్‌వర్క్ అడ్మిన్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీటెక్/ఎంఎస్సీ/ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 40 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.08.2023
» **వెబ్‌సైట్:** https://www.iitism.ac.in

ఐఐటీల్లో కోర్సు, పీఎస్‌యూ కొలువు @ గేట్

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్.. సంక్షిప్తంగా..గేట్! ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ + పీహెచ్‌డీల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! దీంతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో(పీఎస్‌యూ).. ఎంట్రీ లెవల్‌లో ఇంజనీర్ ఉద్యోగాలకు సైతం గేట్ స్కోర్ ప్రామాణికంగా నిలుస్తోంది!! అందుకే ఏటా దేశవ్యాప్తంగా లక్షల మంది ఈ పరీక్షకు హాజరవుతున్నారు. ఇటీవల గేట్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. గేట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, కొత్త మార్పులు, సిలబస్ విశ్లేషణతోపాటు పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..

గేట్ పరీక్షలో ప్రతి ఏటా ఏదో ఒక మార్పు కనిపిస్తోంది. ఈ ఏడాది కొత్తగా డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేపర్‌ను ప్రవేశ పెట్టారు. దీంతో.. గేట్ పేపర్ల సంఖ్య 30కి చేరింది. పలు ఐఐటీలు ఎంటెక్ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ ప్రోగ్రామ్‌లను అందిస్తున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని.. కొత్తగా ఈ పేపర్‌ను ప్రవేశపెట్టినట్లు తెలుస్తోంది.

అర్హతలు

బీటెక్, బీఈ, బీఆర్క్, బీఎస్సీ, బీకాం, బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. అదేవిధంగా ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా గేట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. నాలుగేళ్ల కోర్సులు చదువుతున్న విద్యార్థులు మూడో సంవత్సరం నుంచే గేట్‌కు దరఖాస్తు చేసుకునే వీలుంది.

రెండు పేపర్లకు హాజరయ్యే అవకాశం

గేట్-2024 నుంచి రెండు పేపర్లకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు అభ్యర్థులు తమ అర్హతకు అనుగుణంగా ఏదైనా ఒక పేపర్‌కు మాత్రమే హాజరయ్యే పరిస్థితి ఉండేది. తాజా మార్పుతో ఇకపై తమ అర్హతలకు సరితూగే రెండు పేపర్లలో పరీక్షకు హాజరు కావచ్చు. గేట్ నిర్వాహక కమిటీ నిర్దేశించిన నిబంధనలను అనుసరిస్తూ.. నిర్దిష్ట కాంబినేషన్స్‌లోనే పేపర్లను ఎంచుకోవాల్సి ఉంటుంది.

పరీక్ష గతంలో మాదిరిగానే

- ఈ ఏడాది గేట్ పరీక్ష విధానంలో ఎలాంటి మార్పులు లేదు. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ▪ గేట్ పరీక్ష పార్ట్-1, పార్ట్-2 పేరుతో రెండు విభాగాల్లో వంద మార్కులకు ఉంటుంది. మొత్తం 65 ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్-1లో జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి 10 ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగానికి 15 మార్కులు కేటాయిస్తారు. ఒక మార్కు ప్రశ్నలు అయిదు, రెండు మార్కుల ప్రశ్నలు అయిదు ఉంటాయి.
- పార్ట్-2లో అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్‌లో 55 ప్రశ్నలు అడుగుతారు. ఇందులోనే ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ నుంచి కూడా 13 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఒక మార్కు ప్రశ్నలు 25, రెండు మార్కుల ప్రశ్నలు 30 ఉంటాయి.

» గేట్ 2024 ప్రకటన విడుదల
» మొత్తం 30 పేపర్లలో గేట్ పరీక్ష
» కొత్తగా డేటా సైన్స్ అండ్ ఏఐ పేపర్
» రెండు పేపర్లకు హాజరయ్యే అవకాశం

మూడు రకాలుగా ప్రశ్నలు

గేట్‌లో ప్రశ్నలను మూడు విధాలుగా అడుగుతారు. అవి.. ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్, మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్(ఎంఎస్‌క్యూ), న్యూమరికల్ ఆన్సర్ టైప్ (ఎన్ఏటీ) ప్రశ్నలు ఉంటాయి. ఎంసీక్యూ విధానంలో నాలుగు లేదా అయిదు ఆప్షన్లలో ఏదో ఒక ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించాల్సి ఉంటుంది. మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్ విధానంలో అడిగే ప్రశ్నలకు.. ఒకటి కంటే ఎక్కువ ఆప్షన్లు సమాధానంగా ఉంటాయి. ఇలాంటి ప్రశ్నలకు సమాధానం గుర్తించాలంటే.. సంబంధిత టాపిక్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగుండాలి. న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు కొంత కాలిక్యులేషన్స్‌తో కూడినవిగా ఉంటాయి.

గేట్‌తో ప్రయోజనాలెన్నో

గేట్ స్కోర్ ఆధారంగా ఆయా విద్యాసంస్థల్లో పీజీ, పీహెచ్‌డీలో ప్రవేశాలు ఖరారు చేసుకున్న వారికి పలు ప్రయోజనాలు లభిస్తున్నాయి. ఎంటెక్ వంటి పీజీ ప్రోగ్రామ్‌లో అడుగుపెడితే నెలకు రూ.12,400 స్టయిఫండ్, పీహెచ్‌డీలో చేరితే నెలకు రూ.28 వేల స్కాలర్‌షిప్ అందుతుంది. రాష్ట్ర స్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో పీజీలో ప్రవేశాలకు సంబంధించి గేట్ ఉత్తీర్ణులకు తొలి ప్రాధాన్యం ఇస్తారు.



పీఎస్‌యూ జాబ్స్

గేట్ స్కోర్ ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాలను సైతం సొంతం చేసుకోవచ్చు. గత కొన్నేళ్లుగా నవరత్న, మహారత్న, మినీరత్న వంటి హోదా పొందిన పబ్లిక్ సెక్టార్ యూనిట్స్(పీఎస్‌యూ).. గేట్ స్కోర్ ఆధారంగా ఎగ్జిక్యూటివ్ ట్రైనీ, గ్రాడ్యుయేట్ ఇంజనీర్ వంటి పోస్టులను భర్తీ చేస్తున్నాయి. అభ్యర్థులు ఆయా సంస్థల నోటిఫికేషన్స్‌కు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేసి తదుపరి దశలో గ్రూప్ డిస్కషన్/గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాయి. తుది ఎంపికలో గేట్ స్కోర్‌కు, జీడీ/జీటీలకు నిర్దేశిత వెయిటేజీ కల్పిస్తున్నాయి. గేట్ స్కోర్‌కు 75 శాతం వెయిటేజీ; గ్రూప్ డిస్కషన్/గ్రూప్ టాస్క్‌లకు గరిష్టంగా పది శాతం; పర్సనల్ ఇంటర్వ్యూకు 15 శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నాయి. మరికొన్ని పీఎస్‌యూలు గేట్ స్కోర్‌కు 60 నుంచి 65 శాతం వెయిటేజీ కేటాయిస్తున్నాయి.

జీడీ/ఇంటర్వ్యూ ఇలా

- పీఎస్‌యూలు మలి దశలో నిర్వహించే గ్రూప్ డిస్కషన్‌లో ప్రతి అభ్యర్థికి సగటున అయిదు నుంచి ఆరు నిమిషాల సమయం లభిస్తుంది. ఈ సమయంలోనే అభ్యర్థులు సదరు టాపిక్‌పై తమ అభిప్రాయాలను తెలపాల్సి ఉంటుంది. గ్రూప్ టాస్క్ విధానంలో ఒక వాస్తవ సమస్యను అభ్యర్థుల ముందుంచి.. సమస్యకు పరిష్కారం కనుక్కోవాలని సూచిస్తున్నారు.
- పీఎస్‌యూల ఎంపిక ప్రక్రియలో చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూ. గ్రూప్ డిస్కషన్ లేదా గ్రూప్ టాస్క్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఈ ఇంటర్వ్యూల్లో అభ్యర్థుల వ్యక్తిగత నేపథ్యం, టెక్నికల్ నాలెడ్జ్‌లను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు.

ఐఐటీల్లోనూ మలిదశ

ఐఐటీల్లో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీ వంటి ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గేట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఐఐటీలు సైతం మలి దశలో గ్రూప్ టాస్క్, గ్రూప్ డిస్కషన్స్ పేరిట పరీక్షలను నిర్వహిస్తున్నాయి. కొన్ని ఐఐటీలు రిటెన్ ఎస్సేలు నిర్వహించే విధానాన్ని కూడా అనుసరిస్తున్నాయి. వీటిలో విజయం సాధించిన వారికే సీట్లు ఖరారు అవుతున్నాయి.

కటాఫ్ పెరుగుతోంది

ఐఐటీల్లో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ + పీహెచ్‌డీల్లో ప్రవేశం, అదే విధంగా పీఎస్‌యూ కొలువులకు షార్ట్ లిస్టింగ్ క్రమంలో గేట్ స్కోర్ కటాఫ్‌లు క్రమేణా పెరుగుతున్నాయి. జనరల్ కేటగిరీలో 750 నుంచి 800 స్కోర్, రిజర్వ్‌డ్ కేటగిరీలో 500 నుంచి 600 స్కోర్ సాధిస్తేనే మలి దశకు అవకాశం లభిస్తుంది.

మంచి స్కోర్‌కు మార్గం

ఎంచుకున్న సబ్జెక్ట్‌లో బేసిక్స్ నుంచి అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్ వరకూ.. పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ప్రతి టాపిక్‌ను చదివేటప్పుడు ప్రశ్నార్హమైన అంశాలను గుర్తించడంతోపాటు దానికి సంబంధించి ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి. ఒక టాపిక్ నుంచి ఎన్ని రకాలుగా ప్రశ్నలు అడిగే అవకాశం ఉందో గుర్తించి సాధన చేయాలి. గేట్ సిలబస్‌ను అకడమిక్ అంశాలతో అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. వీక్లీ టెస్ట్‌లు,మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావాలి. ఈ అప్రోచ్ విజయ సాధనలో ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది.

ప్రాధాన్యతను గుర్తిస్తూ

అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లోని టాపిక్స్‌కు లభిస్తున్న వెయిటేజీ, అకడమిక్‌గా ఉన్న ప్రాధాన్యాన్ని అనుసరిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. డిసెంబర్ చివరి వారం లేదా జనవరి మొదటి వారానికి ప్రిపరేషన్ పూర్తి చేసుకునేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ఆ తర్వాత ఉన్న వ్యవధిలో ఆన్‌లైన్ మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరయ్యే విధంగా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇలా ఇప్పటి నుంచే నిర్దిష్ట ప్రణాళికతో అడుగులు వేస్తే.. పరీక్షలో మంచి స్కోర్ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** ఆగస్ట్ 30 – సెప్టెంబర్ 29, 2023
- **ఆలస్య రుసుముతో చివరి తేదీ:** అక్టోబర్ 13, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** అక్టోబర్ 7 – 11, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** జనవరి 3, 2024
- **గేట్-2024 తేదీలు:** 2024 ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో (ప్రతి రోజు రెండు సెషన్లు. మొదటి సెషన్ ఉదయం 9-12, మధ్యాహ్నం సెషన్ 2-5 వరకు)
- **ఫలితాల వెల్లడి:** మార్చి 16, 2024
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://gate2024.iisc.ac.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	366	64,887
నిఫ్టీ ▽	121	19,266

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,591	△	127
డోజోన్స్	34,347	△	247
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,339	△	5
డాక్స్	15,632	△	10
షాంఘై	3,064	▽	18
నికాయ్	31,624	▽	663


అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.27	83.94
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.61	107.01
€	యూరో	ఎస్‌బీఐ	89.29	92.44
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.46	58.22
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.65	54.95
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.35	62.31
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.98	22.60
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.50	23.29
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.46

బీమా పాలసీని వెనక్కి ఇచ్చేస్తే..?





విష్ణు స్వరూప్ (30) పేరిట రెండు జీవిత బీమా ఎండోమెంట్ పాలసీలు ఉన్నాయి. ఆరేళ్ల క్రితం తనకు ఉద్యోగం వచ్చిన కొత్తలో ఆ పాలసీలను విష్ణు పేరిట ఆయన తండ్రి ప్రారంభించారు. వీటి కోసం ఏటా రూ.50,000 ప్రీమియంను విష్ణు స్వయంగా చెల్లిస్తున్నారు. ఈ రెండింటి రూపంలో వస్తున్న బీమా రక్షణ రూ.10 లక్షలు. కాల వ్యవధి 20 ఏళ్లు. ఎందుకోగానీ తాను తీసుకున్న బీమా ఉత్పత్తులు తగినంత రక్షణ ఇవ్వడం లేదన్న అభిప్రాయం అతడిలో కలిగింది. దీంతో ఓ ఆర్థిక సలహాదారుడిని సంప్రదించాడు. పాలసీల పూర్తి వివరాలు, విష్ణు ఆదాయం, జీవిత లక్ష్యాలన్నింటినీ సమగ్రంగా విశ్లేషించిన అనంతరం.. వెంటనే సదరు రెండు ఎండోమెంట్ పాలసీలను సరెండ్ చేసేయాలని ఫైనాన్షియల్ అడ్వైజర్ సూచించారు. నిపుణుడిని సంప్రదిస్తే కానీ, ఆ పాలసీల వల్ల పెద్దగా ప్రయోజనం లేదన్న విషయం అతడికి బోధపడలేదు. విష్ణు మాదిరే ఎండోమెంట్ పాలసీలకు భారీ ప్రీమియం చెల్లించే వారు మన చుట్టూ ఎంతో మంది ఉన్నారు. అలాంటి ప్రతి ఒక్కరూ ఒక్కసారి తమ ప్లాన్‌ను సమీక్షించుకోవాల్సిన అవసరం అయితే ఉంది.

- ఎండోమెంట్ ప్లాన్‌లో రాబడి శూన్యం
- బీమా రక్షణ కొద్ది మాత్రమే
- దీనికి ప్రత్యామ్నాయం టర్మ్ ప్లాన్
- తక్కువ ప్రీమియంతో మెరుగైన రక్షణ
- ఎండోమెంట్ ప్లాన్‌ను వెనక్కి ఇచ్చేయొచ్చు
- పాలసీని సరెండర్ చేయడమే మార్గం
- లేదంటే పాలసీ పెయిడప్ చేసుకోవచ్చు

నిన్న మొన్నటి వరకు జీవిత బీమా అంటే ఎక్కువ మందికి తెలిసింది ఎండోమెంట్ పాలసీల గురించే. టర్మ్ ఇన్సూరెన్స్ ఇటీవలి కాలంలోనే ఆదరణను, ప్రాధాన్యాన్ని సంతరించుకుంటోంది. ఎండోమెంట్ పాలసీలు గతంలో ప్రజల సహజ పొదుపు మనస్తత్వం కోణం నుంచి అభివృద్ధి చేసినవి. అంతేకానీ, అచ్చమైన బీమా రక్షణ కోసం కావు. పెట్టుబడుల సాధనాలు, రాబడులపై అవగాహన విస్తృతమవుతున్న కొద్దీ, టర్మ్ పాలసీల ప్రాధాన్యం తెలిసి వస్తోంది. ఈ రెండింటి మధ్య వ్యత్యాసం గురించి క్లుప్తంగా చెప్పుకోవాలంటే.. పాలసీహోల్డర్ దురదృష్టవశాత్తూ మరణిస్తే కుటుంబానికి మెరుగైన పరిహారం ఇచ్చి ఆదుకునేవి టర్మ్ ప్లాన్లు. కాల వ్యవధి ముగిసే రోజు వరకు జీవించి ఉంటే రూపాయి తిరిగి రాదు. దీనికి భిన్నంగా.. పాలసీ కాల వ్యవధిలో మరణించినా లేక పాలసీ గడువు ముగిసే వరకు జీవించి ఉన్నా.. ఈ రెండు సందర్భాల్లోనూ ఎంతో కొంత ముట్టజెప్పేవి ఎండోమెంట్ ప్లాన్లు. ఇవి తక్కువ బీమా రక్షణ, తక్కువ రాబడితో కూడినవి. బీమా ఏజెంట్లు ఎండోమెంట్ ప్లాన్ల విక్రయానికే ఎక్కువగా మొగ్గు చూపిస్తుంటారు. దీనిపై వారికి లభించే కమీషన్ ఎక్కువగా ఉంటుంది. మొదటి ఏడాది ప్రీమియంలో 10–25 శాతం వరకు వారికి కమీషన్‌గా ముడుతుంది. అంతేకాదు రెండో సంవత్సరం నుంచి పాలసీ ముగిసే వరకు ఏటా ప్రీమియంపై 5–7 శాతం కమీషన్‌గా ఏజెంట్లకు ఆదాయం వస్తూనే ఉంటుంది. టర్మ్ ప్లాన్ల పైనే ఇదే స్థాయిలో కమీషన్ ఉంటుంది. కాకపోతే టర్మ్ పాలసీల ప్రీమియం తక్కువ కనుక కమీషన్ కూడా అదే స్థాయిలో ఉంటుంది. దేశ వాసుల్లో చాలా మందికి ఎండోమెంట్ ప్లాన్లే ఉన్నాయి. తెలిసిన ఏజెంట్ బలవంతం పెట్టాడని, స్నేహితులు, బంధువులు సూచించారని చెప్పి వీటిని తీసుకోవడం కనిపిస్తుంది. చెల్లిస్తున్న ప్రీమియానికి మెరుగైన బీమా రక్షణ ఇవ్వని, ప్రీమియం భారంతో కూడిన ఇలాంటి ఎండోమెంట్ ప్లాన్లను వదిలించుకునే మార్గం ఉంది. సరెండర్ చేసేయడమే..

ఎందుకు సరెండర్ చేయాలి..?

తాము తీసుకున్న జీవిత బీమా ఎండోమెంట్ ప్లాన్‌లో తగినంత కవరేజీ లేదని, ప్రీమియం ఎక్కువగా ఉందని అనిపిస్తే దాన్ని నిలిపివేయడంలో ఎలాంటి తప్పు లేదు. జీవిత బీమా ప్లాన్ తీసుకునేది ఎందుకు..? తమకు ఏదైనా జరిగితే కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పాలు కాకూడదనే. తమపై ఆధారపడిన వారు, అసాధారణ సందర్భాల్లో కష్టాలు పడకూడదంటే అందుకు తగినంత కవరేజీతో లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్ ఉండాల్సిందే. పిల్లల విద్య ఆగిపోకూడదు. వారి రోజువారీ జీవనం, ఇతర వ్యయాలు అన్నింటినీ జీవిత బీమా పరిహారం ఆదుకునే విధంగా ఉండాలి. అందుకే వార్షిక ఆదాయానికి ఎంతలేదన్నా కనీసం పది రెట్ల మేరకు బీమా కవరేజీ తీసుకోవాలన్నది నిపుణుల సూచన. విష్ణు స్వరూప్‌నే ఉదాహరణగా తీసుకుందాం. అతడు రూ.10 లక్షల కవరేజీ కోసం ఏటా రూ.50వేలు చెల్లిస్తున్నాడు. కానీ, కేవలం రూ.20 వేల వార్షిక ప్రీమియం చెల్లించడం ద్వారా విష్ణు రూ.1.5 కోట్ల టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవచ్చు. ఫైనాన్షియల్ అడ్వైజర్ సలహాతో విష్ణు అదే పనిచేశాడు. ఉన్న ఎండోమెంట్ ప్లాన్లను సరెండ్ చేశాడు. రూ.1.5 కోట్ల టర్మ్‌ప్లాన్ తీసుకున్నాడు. 30 ఏళ్ల ఆరోగ్యవంతుడైన వ్యక్తి రూ.కోటి సమ్ అష్యూరెన్స్‌తో టర్మ్ ప్లాన్ తీసుకుంటే వార్షిక ప్రీమియం రూ.25,000. ఎండోమెంట్ పాలసీల్లో బీమా రక్షణతోపాటు, ఎంతో కొంత రాబడి ఉంటుందన్నది చాలా మంది అభిప్రాయం. కానీ, ఇందులో వాస్తవం ఏంటన్నది పాలసీదారులకు తప్పకుండా తెలిసి ఉండాలి. ఎండోమెంట్ ప్లాన్లలో రాబడి 4.5–5.5 శాతం మించి ఉండదు. అరుదైన సందర్భాల్లోనే రాబడి 6 శాతం ఉంటుంది. కానీ ద్రవ్యోల్బణం కూడా దీర్ఘకాల సగటు అదే స్థాయిలో ఉంది. దీంతో నికరంగా వచ్చే రాబడి ఏమీ ఉండదు. ఉదాహరణకు రూ.10 లక్షల సమ్ అష్యూరెన్స్‌తో ఎండోమెంట్ ప్లాన్ తీసుకున్నారని అనుకుందాం. సమ్ అష్యూర్డ్‌పై ఏటా 5 శాతం సింపుల్ గ్యారంటీడ్ అడిషన్ వస్తుంది. ఈ పాలసీలో మెచ్యూరిటీ కింద రూ.21 లక్షలు వస్తుంది. రాబడి రేటు 6.22 శాతం. ద్రవ్యోల్బణం 6 శాతం (సగటున) మినహాయిస్తే నికర రాబడి 0.22 శాతమే. అదే ఈక్విటీ పథకాల్లో దీర్ఘకాలానికి ఇన్వెస్ట్ చేస్తే రాబడి వార్షికంగా 10–12 శాతం లేదా అంతకంటే ఎక్కువే ఉంటుంది. డెట్ సాధనాల్లోనూ 7 శాతం మేర రాబడి వస్తుంది.

పాలసీని నిలిపివేస్తే..?

ఎండోమెంట్ ప్లాన్ గురించి ఈ వివరాలు తెలుసుకున్న తర్వాత, ఇక వద్దనుకుంటే పాలసీదారుల ముందు రెండు ఆప్షన్లు ఉన్నాయి. అప్పటి నుంచి ప్రీమియం చెల్లించకుండా ఉండిపోవడం. లేదంటే పాలసీని సరెండర్ చేయడమే సరైనది. పాలసీలో కవరేజీ, రాబడి ఆకర్షణీయంగా లేదని అసంతృప్తిగా ఉంటే అప్పటి నుంచి ప్రీమియం చెల్లించకుండా ఆగిపోవచ్చు. కాల వ్యవధి తర్వాత ఫండ్ వెనక్కి వస్తుంది. దీన్నే పాలసీ పెయిడప్ అని అంటారు. మెచ్యూరిటీ తర్వాత ఎంత వస్తుందన్నది బీమా సంస్థ చెబుతుంది. అంతేకాదు, జీవిత బీమా కవరేజీ కూడా కొనసాగుతుంది. కాకపోతే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియంకు అనుగుణంగా జీవిత బీమా కవరేజీని తగ్గిస్తారు. ఉదాహరణకు రూ.10 లక్షల సమ్ అష్యూర్డ్ పాలసీని 20 ఏళ్ల కాలానికి తీసుకుని, ఐదేళ్ల పాటు ప్రీమియం చెల్లించారని అనుకుందాం. అప్పుడు రూ.10 లక్షలకు బదులు రూ.2.5 లక్షల జీవిత బీమా కవరేజీ కాల వ్యవధి ముగిసే వరకు లభిస్తుంది. పెయిడప్ చేసే నాటికి జమ అయిన గ్యారంటీడ్ అడిషన్స్, బోనస్‌లు కలిపి పెయిడప్ వ్యాల్యూని నిర్ణయిస్తారు.

సరెండర్ చేస్తే..?

పాలసీ కాల వ్యవధి ముగియకముందే దాన్నుంచి వైదొలగాలని అనుకుంటే, సరెండర్ వేల్యూని వెనక్కి పొందొచ్చు. అప్పటి వరకు ఎన్నేళ్లపాటు ప్రీమియం చెల్లించారు, ఎంత చెల్లించారు, బోనస్, పెయిడప్ వేల్యూ ఆధారంగా సరెండర్ వేల్యూ ఎంతన్నది ఉంటుంది. ఇందుకు సరెండర్ వేల్యూ ఫ్యాక్టర్ చార్ట్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. సరెండర్ ఫ్యాక్టర్ 35 శాతం అనుకుంటే.. రూ.10 లక్షల పాలసీలో రూ.3.5 లక్షలు పాలసీదారునికి దక్కుతుంది. పాలసీ తీసుకుని కాల వ్యవధి పెరుగుతూ వెళుతున్న కొద్దీ, ఈ సరెండర్ వేల్యూ ఫ్యాక్టర్ 70 శాతం వరకు చేరుతుంది. ''కాల వ్యవధికి ముందే పాలసీని సరెండర్ చేస్తే తీవ్రంగా నష్టపోవాలి. సరెండర్ ఫీజుల రూపంలో అప్పటి వరకు చెల్లించిన ప్రీమియంలో గణనీయమైన మొత్తాన్ని కోల్పోతారు. కొన్ని కేసుల్లో బోనస్ వంటివి కూడా రావు. కనుక పాలసీ నియమ, నిబంధనలను చదివి అర్థం చేసుకోవాలి''అని ఫైనాన్షియల్ ప్లానింగ్ సంస్థ 'ఫైనాన్షియల్ స్మార్ట్' సీఈవో నీతా మెనెజెస్ సూచించారు. సరెండర్ వేల్యూ విషయంలో బీమా సంస్థల మధ్య ఏకరూపత కనిపించదు. కొన్ని బీమా సంస్థలు ప్రత్యేకమైన సరెండర్ వేల్యూ ఫ్యాక్టర్‌చార్ట్‌లను ఉపయోగిస్తున్నాయి. కొన్ని సంస్థల్లో అయితే చాలా దారుణంగా, నామమాత్రంగా సరెండర్ వేల్యూని నిర్ణయిస్తున్నారు. అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం ఆధారంగా సరెండర్ వేల్యూని కొన్ని ఖరారు చేస్తున్నాయి.

సరెండర్ చేస్తే ఎంతొస్తుంది?

సమ్ అష్యూర్డ్:	రూ.10లక్షలు
పాలసీ కాల వ్యవధి:	20 ఏళ్లు
వార్షిక ప్రీమియం:	రూ.50వేలు
బోనస్ అడిషన్ ఏటా:	రూ.50వేలు

సరెండర్ కాల వ్యవధి	5ఏళ్ల తర్వాత	10 ఏళ్ల తర్వాత	15 ఏళ్ల తర్వాత
పెయిడప్ వేల్యూ (రూ.లక్షల్లో)	5	10	15
సరెండర్ వేల్యూ ఫ్యాక్టర్ (శాతంలో)	35	50	70
సరెండర్ వేల్యూ (రూ.లక్షల్లో)	1.75	5	10.50

సరెండర్ ఎప్పుడు చేయాలి?



బీమా పాలసీల్లో సరెండర్ పెనాల్టీ ఎంతో ఎక్కువగా ఉంటుందని భారతీ ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ కస్టమర్ ఆఫీసర్ నితిన్ మెహతా తెలిపారు. పాలసీ సరెండర్ చేయడానికి ముందే, ఎదురయ్యే ఆర్థిక ప్రతికూలతలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అందుకని సరెండర్ చేసే ముందు ఎంత వస్తుందన్నది తెలుసుకోవాలి. ఎండోమెంట్ ప్లాన్‌కు ప్రీమియం ఇక చెల్లించడం కష్టంగా ఉందని భావిస్తే అప్పుడు సరెండర్ చేస్తే ఎంతొస్తుంది? పెయిడప్‌గా మారిస్తే గడువు ముగిసిన తర్వాత ఎంతొస్తుందన్నది విశ్లేషించుకోవాలి. సరెండర్ చేసినా లేక పెయిడప్ చేసినా.. అదే సమయంలో టర్మ్ ప్లాన్ తీసుకోవడం తప్పనిసరి. లేదంటే అసలు లక్ష్యమే దెబ్బతింటుంది. రూ.10 లక్షల సమ్ అష్యూర్డ్ పాలసీని 20 ఏళ్ల కాలానికి తీసుకున్నారు. 5 ఏళ్ల పాటు ఏటా రూ.50,000 చొప్పున ప్రీమియం చెల్లించిన తర్వాత సరెండర్ చేసేయాలని నిర్ణయించారు. దీంతో అప్పటి నుంచి ఏటా రూ.50,000 ప్రీమియం రూపంలో ఆదా అవుతుంది. అప్పుడు ఏటా రూ.20,000 ప్రీమియంపై రూ.కోటి టర్మ్ ప్లాన్ తీసుకోవాలి. మిగిలిన రూ.30వేలను ఇండెక్స్ ఫండ్స్‌లో సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి. ఇలా చేస్తే ఏటా 12 శాతం సగటు రాబడి అంచనా ఆధారంగా 15 ఏళ్ల తర్వాత రూ.12.50 లక్షలు సమకూరుతుంది. ఐదేళ్ల తర్వాత సరెండర్ చేయడం వల్ల వచ్చిన మొత్తాన్ని తీసుకెళ్లి ఇండెక్స్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల అది కూడా ఏటా 12 శాతం చొప్పున 15 ఏళ్లలో వృద్ధి చెందుతుంది. బీమా, పెట్టుబడిని కలిపి చూడకూడదు. అచ్చమైన బీమా రక్షణ ఏర్పాటు చేసుకోవడానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. మంచి రాబడి కోసం మేలైన పెట్టుబడి సాధనాలను ఎంపిక చేసుకోవాలి.

మరిన్ని ఫీచర్లతో ఆదాయపన్ను శాఖ వెబ్‌సైట్

న్యూఢిల్లీ: ఆదాయపన్ను శాఖ ఆధునికీకరించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. యూజర్లకు మరింత సౌకర్యంగా, విలువ ఆధారిత సదుపాయాలతో దీన్ని రూపొందించినట్టు ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) ప్రకటించింది. సీబీడీటీ చైర్మన్ నితిన్ గుప్తా ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.'కొత్త టెక్నాలజీకి అనుగుణంగా ఉండేందుకు, పన్ను చెల్లింపుదారులకు మెరుగైన అనుభవం కోసం ఐటీ శాఖ వెబ్‌సైట్ www.incometaxindia.gov.in ను యూజర్లకు అనుకూల ఇంటర్‌ఫేస్, విలువ ఆధారిత ఫీచర్లతో పునరుద్ధరించింది'అని సీబీడీటీ పేర్కొంది.

ధోనీ జెడ్ బ్లాక్ అగరబత్తి టీవీసీ యాడ్ విడుదల



హైదరాబాద్: జెడ్ బ్లాక్ బ్రాండ్ పేరుతో 3–ఇన్–1 అగరబత్తులను విక్రయిస్తున్న మైసూర్ డీప్ పెర్ఫ్యూమరీ హౌజ్ (ఎండీపీహెచ్) భారత మాజీ క్రికెట్ కెప్టెన్ ఎంఎస్ ధోనితో ఒక టీవీ కమర్షియల్ (టీవీసీ) ప్రచార యాడ్‌ను విడుదల చేసింది. రోజువారీ ప్రార్థనల ప్రాముఖ్యతను 'మన్ కీ శాంతి' పేరిట దీనిని రూపొందించినట్లు ఎండీపీహెచ్, జెడ్ బ్లాక్ డైరెక్టర్ అంకిత్ అగర్వాల్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జెడ్ బ్లాక్‌కు ఆరేళ్లుగా బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న ధోని మరోసారి మా ప్రచార కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం గౌరవంగా భావిస్తున్నామని కంపెనీ డైరెక్టర్ అన్షుల్ అగర్వాల్ వెల్లడించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

28-8-2023	
విశాఖ	480–00
చిత్తూరు	483–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	72.00
27-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	435–00
వరంగల్	437–00
రిటైల్ ధర	4.95

సాక్షి ఫ్లాష్

నోసిల్ | హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 212 టార్గెట్: రూ. 267

ఎందుకంటే: వివిధ రబ్బర్ కెమికల్స్ తయారీ కంపెనీ నోసిల్‌కు రూ. 267 టార్గెట్ ధరను అంచనా వేస్తున్నాం. సామర్థ్య వినియోగాన్ని పెంచుకునే అవకాశాలు, ప్రత్యేకించిన రబ్బర్ కెమికల్స్ తయారీపై దృష్టి సారించడం ద్వారా మార్జిన్లను మెరుగుపరచుకోనున్న అంచనాలు ఇందుకు కారణమయ్యాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో మా అంచనాలకంటే 10 శాతం తక్కువగా నిర్వహణ లాభం(ఇబిటా), 5 శాతం తక్కువగా నికర లాభం ప్రకటించింది. ఇందుకు ఆదాయం 8 శాతం క్షీణించడం ప్రభావం చూపింది. మరోవైపు అంచనాలకుమించిన ఇతర వ్యయాలు, పన్ను చెల్లింపులు ఇందుకు జత కలిశాయి. అయినప్పటికీ అంచనాలకంటే ముడివ్యయాల భారం తగ్గడంతోపాటు.. ఇతర ఆదాయం పెరగడం లాభదాయకతకు కొంతమేర మద్దతిచ్చాయి. త్రైమాసికవారీగా(క్యూ4తో) చూస్తే ఏప్రిల్–జూన్(క్యూ1)లో



మొత్తం ఆదాయం చెప్పుకోదగ్గ వృద్ధిలేకుండా రూ. 400 కోట్లుగా నమోదైంది. క్యూ4(జనవరి–మార్చి)తో పోల్చితే అమ్మకాల పరిమాణం 2 శాతం నీరసించగా.. ఉత్పత్తుల ధరలు(రియలైజేషన్స్) 2 శాతం మెరుగుపడ్డాయి. యూరోపియన్ మార్కెట్లో మాంద్య పరిస్థితుల కారణంగా ఎగుమతుల పరిమాణం వెనకడుగు వేసింది. దేశీయంగా బలమైన డిమాండ్ కొనసాగుతోంది. ఆసియా, అమెరికా మార్కెట్లలోనూ పటిష్ట డిమాండ్ కనిపిస్తోంది. ఈ ఏడాది క్యూ1లో సామర్థ్య వినియోగం 65 శాతానికే పరిమితమైంది. మొత్తం అమ్మకాల పరిమాణంలో స్పెషాలిటీ కెమికల్స్ వాటా 25 శాతంగా నమోదైంది.

అలెంబిక్ ఫార్మా | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 753 టార్గెట్: రూ. 875


ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో మా అంచనాలను మించుతూ అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ ఆదాయం 4 శాతం పుంజుకుంది. ఇందుకు నాన్‌యూఎస్ ఫార్ములేషన్లు, ఏపీఐ విక్రయాలు దోహదపడ్డాయి. అయితే కొత్త ప్లాంట్ల ఏర్పాటుతో పెరిగిన వ్యయాలు(రూ. 60–65 కోట్లు) నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు బలహీనపడ్డాయి. నికర లాభం మాత్రం 19 శాతం ఎగసింది. ఇందుకు ప్రధానంగా తరుగుదలతోపాటు.. పన్ను వ్యయాలు తగ్గడం సహకరించాయి. దేశీ ఫార్మా పరిశ్రమను మించుతూ కంపెనీ పనితీరులో 4–5 శాతం వృద్ధి నమోదుకానున్నట్లు యాజమాన్యం అంచనా వేసింది. స్వల్ప కాలిక అవకాశాలు, ధరల క్షీణత నేపథ్యంలో యూఎస్ ఫలితాలు మా అంచనాలను అందుకోలేకపోయాయి. నిర్మాణంలో ఉన్న మూడు ప్లాంట్లపై పెట్టుబడి రైటాఫ్(సీడబ్ల్యూఐపీ) రూ. 1,550 కోట్ల ప్రొవిజన్‌ను చేపట్టింది. అయితే సాధారణ రిజర్వ్‌ల నుంచి బదిలీ చేయడం ద్వారా లాభనష్టాల




ఖాతాపై ప్రభావం పడకుండా చూసింది. ఈ మూడు యూనిట్ల కార్యకలాపాలు ప్రారంభమైన నేపథ్యంలో పెరగనున్న నిర్వహణ వ్యయాలకు ఇప్పటికే చేపట్టిన అలియోర్ డెర్మాస్యూటికల్స్ రైటాఫ్‌లు కొంతమేర చెక్ పెట్టనున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో యూఎస్‌లో విడుదల చేయనున్న 20 కొత్త ఉత్పత్తులు సైతం వీటికి మద్దతివ్వనున్నాయి. వెరసి ఇకపై త్రైమాసికవారీగా మార్జిన్లు మెరుగుపడనున్నట్లు భావిస్తున్నాం. యూఎస్‌లో అమ్మకాల పరిధి పెరగనుండటం, మార్జిన్లలో వృద్ధి, మరిన్ని పెట్టుబడుల వ్యూహాత్మక కేటాయింపునకు అవకాశాల కారణంగా ఇకనుంచి కంపెనీ పనితీరు మరింత పుంజుకోనున్నట్లు అంచనా వేస్తున్నాం.

మహీంద్రా మాన్యులైఫ్ బిజినెస్ సైకిల్ ఫండ్

మహీంద్రా మాన్యులైఫ్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా బిజినెస్ సైకిల్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సెప్టెంబర్ 4 వరకు అందుబాటులో ఉంటుంది. బిజినెస్ సైకిల్స్ ఆధారంగా మెరుగ్గా రాణించే ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీస్‌లో ఈ ఫండ్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తారు. ఇది వన్ టైమ్ అలాగే సిప్ మార్గంలో పెట్టుబడులకు కూడా అనువైనదిగా ఉంటుందని సంస్థ ఎండీ ఆంథోనీ హెరెడియా తెలిపారు. ఈ ఫండ్‌ను చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ కృష్ణ సంఘవి, రంజిత్ శివరామ్ రాధాకృష్ణన్ నిర్వహిస్తారు. ప్రస్తుత వ్యాపార దశ, రంగాలవారీ ట్రెండ్స్‌ను గుర్తించి తగు స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తారు. బిజినెస్ సైకిల్స్ సానుకూలంగా ఉన్న అత్యంత నాణ్యమైన, వివిధ మార్కెట్ క్యాప్స్ ఉన్న కంపెనీలను ఎంపిక చేసుకోవడం వల్ల డైవర్సిఫికేషన్‌కు వీలుంటుంది.



రిటైర్మెంట్ ఫండ్‌కు మేలైన మార్గం..?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను విశ్రాంత జీవనం కోసం కావాల్సిన నిధిని సమకూర్చుకోవాలని అనుకుంటున్నాను. రిటైర్మెంట్ ఫండ్ వంటి దీర్ఘకాలిక లక్ష్యాలకు స్మాల్‌క్యాప్ ఫండ్స్ అనుకూలమేనా?

– వర్షిత్

స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులకు దీర్ఘకాలం ఒక్కటే సరిపోదు. పెట్టుబడులు పెట్టిన తర్వాత స్వల్ప కాలం నుంచి మధ్య కాలానికి కనిపించే నష్టాలకు, యూనిట్ల విలువ క్షీణతకు తట్టుకోగలిగి ఉండాలి. దీర్ఘకాలంలో సంపద సృష్టికి స్మాల్‌క్యాప్ పథకాలను పరిశీలించొచ్చు. అయినప్పటికీ స్మాల్‌క్యాప్ పథకాల్లో పెట్టుబడులు అంత సులభమేమీ కాదు. అవి అదే పనిగా నిర్ణీత సమయాల్లో నష్టాలను ఎదుర్కొంటూ ఉంటాయి. మార్కెట్లో ఇతర విభాగాలు మంచి పనితీరు చూపిస్తూ, అదే సమయంలో స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులు నష్టాలను చూపిస్తుంటే సామాన్య ఇన్వెస్టర్లు ఆందోళన చెందకుండా ఉండడం కష్టం. అందుకనే మీ మొత్తం పెట్టుబడుల్లో 10–15 శాతం మించి స్మాల్‌క్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేయకుండా ఉండడమే నయం. చిన్న కంపెనీని ఎంపిక చేసుకుంటే, అది ఆ తర్వాతి కాలంలో పెద్ద కంపెనీగా మారిందనడానికి వందలాది ఉదాహరణలు ఉన్నాయి. ఇటువంటి సందర్భాల్లో సంపద సృష్టి జరుగుతుంది. కానీ, అలా ఎంపిక చేసుకున్న ప్రతి కంపెనీ కూడా ఓ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కాదు. సంపదను తుడిచిపెట్టేవీ ఉంటాయి. ఆటుపోట్లను తట్టుకునే బలం చిన్న కంపెనీలకు తక్కువగా ఉంటుంది. దీర్ఘకాంలో చిన్న కంపెనీలు సంపదను సృష్టించగలవు. లార్జ్‌క్యాప్ కంపెనీలతో పోలిస్తే మంచి వృద్ధిని చూపించగలవు. సాధారణంగా చిన్న కంపెనీలను ఎక్కువ మంది అనుసరించరు. ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు చాలా చిన్న కంపెనీలకు దూరంగా ఉంటారు. ప్రతి స్మాల్‌క్యాప్ ఫండ్ భిన్నంగా పనిచేస్తుంటుంది. వివిధ పథకాల మధ్య ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. సిప్ ద్వారా స్మాల్‌క్యాప్ కంపెనీల్లో దీర్ఘకాలానికి ఇన్వెస్ట్ చేయడం వల్ల రిస్క్ తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా స్మాల్‌క్యాప్ కంపెనీల విషయానికొస్తే కావాల్సినంత లిక్విడిటీ ఉండదు. చిన్న కంపెనీలు కావడంతో ఫ్రీ ఫ్లోటింగ్ ఈక్విటీ తక్కువగా ఉంటుంది. దీంతో మార్కెట్ల కరెక్షన్లలో కొద్దిపాటి అమ్మకాల ఒత్తిడికే షేర్ల ధరలు భారీగా నష్టపోతుంటాయి. మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్ కంపెనీలతో పోలిస్తే స్మాల్‌క్యాప్ కంపెనీలు రిస్క్ ఎక్కువతో ఉంటాయి. మారుతున్న మార్కెట్లకు అనుగుణంగా డైనమిక్‌గా ఉండేవి తక్కువే. ముఖ్యంగా చిన్న కంపెనీల్లో ఏ ధరలో కొనుగోలు చేశారు? (సహేతుక వ్యాల్యూషన్ వద్ద) అన్నది రాబడులకు కీలకం అవుతుంది.

నా వయసు 45 ఏళ్లు. నా విశ్రాంత జీవనం కోసం వచ్చే పదేళ్ల పాటు, ప్రతి నెలా రూ.50,000 చొప్పున ఇన్వెస్ట్ చేయాలన్నది నా ప్రణాళిక. ఏ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి?

– ఆశిష్ అథాలే

రిటైర్మెంట్ కోసం పొదుపు చేసుకోవాలనుకునే వారు వాస్తవికంగా ఆలోచించాల్సిందే. ముందుగా రిటైర్మెంట్ కోసం ఎంత మొత్తం కావాలన్నది నిర్ణయించుకోవాలి. రిటైర్మెంట్ నాటికి ఎంత నిధి సమకూర్చుకోగలరో అవగాహనకు రావాలి. విశ్రాంత జీవన అవసరాలకు కావాల్సినంత మీరు కూడబెట్టే విధంగా ప్రణాళిక ఉండాలి. రెండు నుంచి మూడు మంచి ఫ్లెక్సీక్యాప్ పథకాలను ఎంపిక చేసుకోవాలి. నెలవారీ సిప్ ద్వారా వాటిల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మరో పదేళ్ల పాటు మీ కెరీర్ కొనసాగనుంది. కనుక మీ పెట్టుబడి వృద్ధి చెందడానికి తగినంత వ్యవధి మిగిలి ఉంది. ఈక్విటీ పథకాల్లో పెట్టుబడులకు సంబంధించి అవగాహన లేకపోతే, అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇవి అచ్చమైన ఈక్విటీ పథకాలతో పోలిస్తే కొంచెం తక్కువ అస్థిరతలతో ఉంటాయి. అలాగే రిటైర్మెంట్ కోసం ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పథకాలు, ఈక్విటీ పథకాలను ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత.. ఈక్విటీ పెట్టుబడులను ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పథకాల్లోకి మార్చాల్సిన అవసరం ఏర్పడదు. ఎందుకంటే సగం పెట్టుబడులు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (డెట్ ఫండ్స్) సాధనాల్లోనే ఉంటాయి. ఈక్విటీ, డెట్ మధ్య పెట్టుబడుల కేటాయింపు జాగ్రత్తగా ఉండాలి. ద్రవ్యోల్బణ ప్రభావాన్ని అధిగమించేలా, వడ్డీ రేట్లు తగ్గినప్పుడు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలపై పడే ప్రభావాన్ని అధిగమించేలా ఈ సమతూకం ఉండాలి.

చదువు పూర్తయిన తరువాత ఉద్యోగం అంటే చాలామంది ఇంజినీర్‌లో, డాక్టర్‌లో, టీచర్‌లో లేక బ్యాంకు ఉద్యోగాలనే అనుకుంటారు. అయితే, ఫిజికల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన వారికి కూడా మంచి ఉద్యోగావకాశాలున్నాయి. డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ చదివిన వారు అంతటితో ఆగిపోకుండా మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) పూర్తి చేస్తే ప్రస్తుతం అనేక ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఈ కోర్సు పూర్తి చేసిన వారు బీపీఈడీ కళాశాలలు, డిగ్రీ, పీజీ కళాశాలల్లో అధ్యాపకులుగా, రాష్ట్రంలోని వివిధ స్టేడియాల్లో శిక్షకులుగా, ఫిట్‌నెస్, జిమ్ ట్రైనర్లుగా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్)లో వివిధ క్రీడలకు సంబంధించి కోచ్‌లుగా స్థిరపడవచ్చు. అయితే సరైన అవగాహన లేక ఎక్కువ మంది విద్యార్థులు ఈ కోర్సులో చేరేందుకు ముందుకు రావడం లేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎంపీఈడీ కోర్సు చదవాలనుకునే విద్యార్థులకు రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అన్ని రకాల మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఆచార్య బృందంతో చక్కని అవకాశం కల్పిస్తోంది.

- నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ)



ఇది చదివితే.. జాబ్ కొట్టొచ్చు

- 'నన్నయ'లో ఎంపీఈడీ చదివే అవకాశం
- విద్యార్థులకు డిజిటల్ తరగతులు
- ఉదయం వేళల్లో ప్రాక్టికల్స్
- పూర్తి స్థాయిలో సౌకర్యాలు



మన ప్రాంత విద్యార్థుల కోసం..

నన్నయ వర్సిటీలో 2017–18 విద్యా సంవత్సరం నుంచి మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సు నిర్వహిస్తున్నారు. దీనిని యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు పర్యవేక్షిస్తున్నారు. ఎంపీఈడీ కోర్సు కోసం నాటి ఈ ప్రాంత విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తోందనే ఉద్దేశంతో.. వారికి మేలు చేసే లక్ష్యంతో నన్నయ వర్సిటీ అప్పటి ఉప కులపతి ముర్రు ముత్యాలనాయుడు హయాంలో ఈ కోర్సును ప్రారంభించారు. దీని ద్వారా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థులకు మేలు చేకూరుతోంది. ఇప్పటి వరకూ 5 బ్యాచ్‌లలో విద్యార్థులు ఎంపీఈడీ కోర్సు పూర్తి చేసి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్థిరపడ్డారు. వర్సిటీలో ఎంపీఈడీ చదువుతున్న విద్యార్థులకు వివిధ క్రీడలు, క్రీడా పోటీల నిర్వహణ పరిజ్ఞానంతో పాటు ఫస్ట్ ఎయిడ్, ఫిజియోథెరపీలో కూడా వర్సిటీ సమీప ఆస్పత్రుల్లో ప్రాథమిక శిక్షణ అందిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి సెమినార్లు, వివిధ యూనివర్సిటీల్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే వర్సిటీ జట్లకు మేనేజర్లుగా హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి రామ్‌గోపాల్ ఆధ్వర్యాన వివిధ జాతీయ, అంతర్ విశ్వవిద్యాలయాల స్థాయి పోటీల్లో పాల్గొనే జట్ల ఎంపికల నిర్వహణలో ఎంపీఈడీ విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. తద్వారా వారికి ప్రాక్టికల్ నాలెడ్జి అందిస్తున్నారు. కోర్సు కో ఆర్డినేటర్‌గా కె.బాలసత్యనారాయణ వ్యవహరిస్తున్నారు.

40 సీట్లు.. పూర్తి సౌకర్యాలు

నన్నయ వర్సిటీలో మొత్తం 40 ఎంపీఈడీ సీట్లు ఉన్నాయి. కోర్సు కాల పరిమితి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లుగా నిర్వహిస్తారు. రెండేళ్ల బీపీఈడీ కోర్సు పూర్తి చేసి, పీజీ సెట్‌లో అర్హత సాధించిన వారు ఈ కోర్సులో చేరేందుకు అర్హులు. ఎంపీఈడీ విద్యార్థులకు శిక్షణ అందించేందుకు వర్సిటీలో అథ్లెటిక్స్ ట్రాక్, ఫుట్‌బాల్ ఫీల్డ్, క్రికెట్ నెట్స్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్, చెస్, క్యారమ్స్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో–ఖో కోర్టులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ ప్రాక్టికల్ శిక్షణ, 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ థియరీ క్లాసులు నిర్వహిస్తారు. మధ్యాహ్నం స్థానిక ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో వ్యాయామ అధ్యాపకులు, ఉపాధ్యాయులుగా ఉద్యోగం చేసుకోవచ్చు. ఎంపీఈడీ విభాగంలో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు, కోచ్‌లు–4 ఉన్నారు.

రూ.8.5 కోట్లతో ఇండోర్, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు

ఇప్పటికే ఉన్న సౌకర్యాలకు తోడుగా రూ.8.5 కోట్లతో నన్నయ వర్సిటీకి ఆధునిక ఇండోర్ స్టేడియం, 50 మీటర్ల స్విమ్మింగ్ పూల్ మంజూరయ్యాయి. సీఎం జగన్ ప్రభుత్వ సహకారంతో రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ కృషితో ఖేలో ఇండియా పథకంలో భాగంగా ఈ పనులు చురుకుగా జరుగుతున్నాయి. ఈ పనులను వర్సిటీ ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పర్యవేక్షిస్తున్నారు. కొద్ది నెలల్లోనే ఈ సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి.

ఉజ్వల భవిష్యత్తు

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంపీఈడీ కోర్సు పూర్తి చేసిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. వివిధ క్రీడలు, యోగాలో ప్రాక్టికల్ క్లాసులు వర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నాం. వర్సిటీ పరిధిలో 388 అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలలున్నాయి. ఎంపీఈడీ పూర్తి చేసిన విద్యార్థులు వ్యాయామ అధ్యాపకులుగా పని చేసే అవకాశాలను ఈ కళాశాలలు కల్పిస్తున్నాయి.

– ఆచార్య జి.సుధాకర్, రిజిస్ట్రార్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం

త్వరలో జ్యోతిర్మయి వ్రతం

అన్నవరం సత్యదేవుని సన్నిధిలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు

- వ్రత సమయం 3-4 గంటలు
- 45 జ్యోతులతో 45 మంది దేవతలకు పూజలు
- సత్యదేవునితో పాటు నవగ్రహాలకూ అష్టోత్తర పూజలు
- ప్రత్యేక పుష్పాలు, నివేదనలు



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు (ఫైల్)

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో త్వరలో విశిష్టమైన మరో సరికొత్త వ్రతానికి శ్రీకారం చుట్టనున్నారు. 'సత్యదేవుని జ్యోతిర్మయి వ్రతం' పేరిట దీనిని నిర్వహించేందుకు చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వ్రతం నిర్వహణకు కావాల్సిన పూజాసామగ్రి, ప్రసాదాలు వంటి వాటిపై దేవస్థానం పండితుల నుంచి నివేదిక కోరామని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ ఆదివారం విలేకర్లకు తెలిపారు.

అన్నవరం: సత్యదేవుని వ్రతానికి దేశవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యం ఉంది. వివాహం అనంతరం, గృహప్రవేశం తరువాత స్వామివారి వ్రతం ఆచరించడం తెలుగు రాష్ట్రాల్లో ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. ఏటా దేవస్థానంలో సుమారు 7 లక్షల వ్రతాలు జరుగుతున్నాయి. వీటి నిర్వహణకు దేవస్థానంలో 260 మంది పురోహితులు దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్నారు. వీరు కాకుండా మరో 40 మంది అదనంగా సేవలందిస్తున్నారు. రూ.2 వేలు, రూ.1,500, రూ.800, రూ.300 టికెట్లపై ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వ్రతాలు నిర్వహిస్తున్నారు.

విశిష్టం.. సత్యదేవ జ్యోతిర్మయి వ్రతం

ప్రస్తుతం జరుగుతున్న వ్రతాలకు అదనంగా.. రత్నగిరిపై కొత్తగా సత్యదేవ జ్యోతిర్మయి వ్రతాలు నిర్వహించాలని నిర్ణయించారు. సత్యదేవుని సన్నిధిలో ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం చేస్తున్న సత్యదేవుని వ్రతంతో పోల్చితే ఇది చాలా విశిష్టమైనదని పండితులు చెబుతున్నారు. సత్యదేవుని వ్రతం ఆచరించడానికి సుమారు గంటన్నర సమయం పడితే జ్యోతిర్మయి వ్రతానికి మూడు నాలుగు గంటలు పడుతుందని అంటున్నారు.

- సాధారణ వ్రతంలో నవగ్రహాలు, పంచభూతాలు, అష్టదిక్పాలకులు.. ఇలా 45 మంది దేవతలు, ప్రత్యధిదేవతలకు తాంబూలాలు మాత్రమే సమర్పిస్తారు. జ్యోతిర్మయి వ్రతంలో ఈ 45 మంది దేవతలకూ జ్యోతులు వెలిగించి, ఆవాహన చేస్తారు.
- ఈ వ్రతంలో ఉపయోగించే గావంచా (నేలపై మంటపానికి వేసే వస్త్రం) పొడవు అర మీటరు పొడవు, అర మీటరు వెడల్పు ఉంటుంది. దానిపై బియ్యం వేసి, గౌరీ దేవిని ప్రతిష్ఠించి, ఆపై పండితుల మంత్రోచ్చారణల నడుమ దేవతలను ఆవాహన చేస్తారు. తమలపాకులపై దీపపు సెమ్మెలు ఉంచి జ్యోతులు వెలిగిస్తారు.
- సత్యదేవుని జ్యోతిర్మయి వ్రతంలో భాగంగా నవగ్రహాలకు తొమ్మిది రకాల పుష్పాలతో పూజలు చేస్తారు. అలాగే, తొమ్మిది రకాల నివేదనలు సమర్పిస్తారు. నవగ్రహాలకు కూడా అష్టోత్తర పూజలు నిర్వహిస్తారు.
- ఈ వ్రతం చేయించేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన పురోహితులు అవసరం. వ్రతాలాచరించే భక్తుల జంట వద్ద పురోహితుడు ఉండి, మొదటి నుంచి చివరి వరకూ దీనిని నిర్వహిస్తారు. స్వామివారి వ్రత కథను అందరికీ కలిపి ఒక పురోహితుడు చెబుతారు.
- చివరిలో స్వామి, అమ్మవార్లకు వేద పండితుల ఆశీస్సులు, అనంతరం ప్రసాద వితరణతో వ్రతం ముగుస్తుంది.
- జ్యోతిర్మయి వ్రతంలో పూజాద్రవ్యాలు, ప్రసాదాలు, వ్రత సామాగ్రికే సుమారు రూ.4 వేల వ్యయమవుతుందని అంచనా.

మహిమాన్విత వ్రతం

సత్యదేవుని జ్యోతిర్మయి వ్రతం చాలా మహిమాన్వితమైనది. కోరిన కోర్కెలు తీర్చే వ్రతమిది. 25 సంవత్సరాల క్రితం అప్పటి సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు దేవులపల్లి నారాయణ, వ్రతబ్రహ్మ పాలంకి పట్టాభి రామ్మూర్తి, వేద పండితులు ఇరగవరపు లక్ష్మీనృసింహాచార్యులు ఈ వ్రతం చేయించారు. ఈ వ్రతంలో సత్యదేవుడిని జ్యోతి స్వరూపుడిగా భావిస్తారు. ప్రతి గ్రహాధిదేవత, ప్రత్యధిదేవత, దిక్పాలకులు, పంచభూతాలకు జ్యోతులు వెలిగించి పూజ చేస్తారు. నవగ్రహాలకు పూలతో పూజలు చేసి, దినుసులు నివేదిస్తారు.

– కన్నబాబు, సత్యదేవుని కల్యాణ బ్రహ్మ, దేవస్థానం కమిటీ సభ్యుడు

దసరా నుంచి ప్రారంభం!

సత్యదేవుని జ్యోతిర్మయి వ్రతం చాలా విశిష్టమైంది. దీనిని గతంలో పండితులు తమ ఇళ్ల వద్ద నోచుకునేవారు. ఇప్పుడు ఈ వ్రతాన్ని రత్నగిరిపై నిర్వహించాలని నిర్ణయించాం. ఇందుకోసం పాత అకౌంట్స్ విభాగాన్ని జ్యోతిర్మయి వ్రత మంటపంగా సిద్ధం చేస్తాం. ఏసీ సౌకర్యం కల్పిస్తాం. వ్రతానికి అవసరమైన సామగ్రిపై నివేదిక ఇవ్వాలని పండితులను ఆదేశించాం. వచ్చే నెలాఖరుకల్లా మంటపం తయారవుతుంది. ఈ వ్రతం టిక్కెట్టు రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకూ ఉంటుంది. దసరా నుంచి దీనిని ప్రారంభించే అవకాశం ఉంది.

– ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

ఏపీఎల్ నిర్వహణ భేష్

టీమిండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్



విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) నిర్వహణ చాలా బాగుందని.. యువ క్రికెటర్లకు ఇదొక మంచి వేదిక అని టీమిండియా మాజీ కెప్టెన్, బీసీసీఐ సెలక్షన్ కమిటీ మాజీ ఛైర్మన్ కృష్ణమాచారి శ్రీకాంత్ అన్నారు. ఏపీఎల్ రెండో సీజన్ ఫైనల్ మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించడానికి ముందు ఆదివారం ఆయన విశాఖలోని వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో మీడియాతో మాట్లాడారు. 'విశాఖపట్నం చాలా అందమైన నగరం. నాకెంతో ఇష్టమైన ప్రదేశమిది. ఇక్కడి వాతావరణం బాగుంటుంది. విశాఖ వేదికగా అనేక టోర్నీల్లో ఆడాను. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పనితీరు అద్భుతం. ఏపీలో ప్రతిభ ఉన్న క్రికెటర్లు చాలా మంది ఉన్నారు. వారిని ప్రోత్సహించేందుకు ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఏపీఎల్ తరహా టోర్నీల ద్వారా క్రికెటర్లకు అవకాశాలు పెరుగుతాయి. రాబోయే రోజుల్లో ఏపీ నుంచి దేశానికి మరింత మంది ప్రాతినిధ్యం వహించేలా ఏసీఏ ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలి' అని సూచించారు. 'టెస్ట్, వన్డే, టీ20 ఇలా అన్ని ఫార్మాట్‌లలోనూ రాణించేవిధంగా యువ క్రికెటర్లు తమను తాము మలుచుకోవాలి. సచిన్ ప్యాషన్‌తో ఆడితే.. కోహ్లి ప్యాషన్‌తో పాటు అగ్రెసివ్‌గా ఆడుతాడు. అది వారి స్టయిల్. నేను కూడా అగ్రెసివ్‌గానే ఆడేవాడిని. జట్టులో చోటు దక్కించుకోవాలంటే ఆటతీరుతో పాటు చిత్తశుద్ధి, క్రమశిక్షణ కూడా చాలా అవసరం. నాకు మీడియాతో మంచి అనుబంధం ఉంది. మీడియా ఒక ఆటగాడిని ఎలివేట్ చేసేందుకు చాలా దోహదపడుతుంది. అది ఆటగాళ్లతో పాటు క్రికెట్ అభివృద్ధికి ఎంతో ఉపయోగకరం' అని శ్రీకాంత్ అన్నారు. ఏసీఏ అధ్యక్షుడు పి.శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏపీఎల్ సీజన్–2కు మంచి ఆదరణ లభించిందని చెప్పారు. కార్యక్రమంలో టీమిండియా క్రికెటర్ కేఎస్ భరత్, ఏసీఏ ఉపాధ్యక్షుడు పి.రోహిత్‌రెడ్డి, సీఈవో ఎంవీ శివారెడ్డి, అపెక్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

వెంకట్రావు పేరుతో 'స్టాండ్' గర్వకారణం

అనంతరం విశాఖ స్టేడియంలోని ఓ స్టాండ్‌కు ఏసీఏ మాజీ కార్యదర్శి ఎన్.వెంకట్రావు పేరు పెట్టగా.. దానిని కృష్ణమాచారి శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసీఏ కార్యదర్శిగా వెంకట్రావు సేవలందిస్తున్న రోజుల్లోనే తాను క్రికెటర్‌గా ఎదిగానని చెప్పారు. ఆయన పేరుతో స్టాండ్ ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా వెంకటరావు 'సాక్షి'తో మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేశారు. అప్పట్లో బీసీసీఐ ఉపాధ్యక్షుడిగా, అంపైర్ కమిటీ చైర్మన్‌గా, క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా, 2003 వరల్డ్‌కప్‌లో పాల్గొన్న టీమిండియా జట్టు మేనేజర్‌గా తాను అందించిన సేవలకు ఇదో జ్ఞాపికగా భావిస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం ఆయన కుమారుడు రమణమూర్తి ఏపీఎల్‌లో తలపడుతున్న బెజవాడ టైగర్స్ జట్టుకు యజమానిగా ఉన్నారు. కార్యక్రమంలో ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 17న 'పీఎం విశ్వకర్మ యోజన'

- దీనిపై గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు అవగాహన
- కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు



సాక్షి, అమరావతి: గ్రామాల్లోని సంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారుల వ్యాపారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి శ్రీకారం చుడుతోంది. వచ్చేనెల 17న ప్రారంభమయ్యే ఈ పథకంపై రాష్ట్రంలో పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయి నుంచి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా.కేఎస్ జవహర్‌రెడ్డి జిల్లాకలెక్టర్లను ఆదేశించారు. తొలుత ఈ పథకంపై గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో నమోదుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ సూచించారు. 18 రకాల వృత్తి, హస్త కళాకారుల్లో లబ్ధిదారులను గుర్తించాల్సి ఉందని, లబ్ధిదారుల నమోదు ప్రక్రియపై వలంటీర్లకు శిక్షణివ్వాలని సీఎస్ చెప్పారు. నైపుణ్య కేంద్రాలనూ గుర్తించాల్సిందిగా కలెక్టర్లకు సూచించారు. ఈ పథకం కింద తొలిదశలో ఒక లక్ష మంది లబ్ధిదారులతో ప్రారంభించనుందని, ఈలోగా రాష్ట్రంలో అర్హులైన 18ఏళ్లు నిండిన సంప్రదాయ కుల, చేతి వృత్తిదారులను, హస్త కళాకారులను గుర్తించాలన్నారు. లబ్ధిదారుల ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్ అనంతరం వెరిఫికేషన్ చేయాలని, అర్హులకు పీఎం విశ్వకర్మ యోజన సర్టిఫికెట్‌తో పాటు గుర్తింపు కార్డు ఇవ్వాలని ఆయన తెలిపారు. గ్రామాల్లోని సంప్రదాయ కుల, హస్త కళాకారులకు నైపుణ్యాభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడం, మార్కెట్ అనుసంధానం చేయడం, సామాజిక భద్రత అందించడం ఈ పథకం లక్ష్యమని సీఎస్ జవహర్‌రెడ్డి వివరించారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా 30 లక్షల మంది కళాకారుల వ్యాపారాన్ని బలోపేతం చేసేందుకు 2023–2028 వరకు కేంద్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్లను వ్యయం చేయనుంది.

పంచాయతీ కార్యదర్శులకు రేపటి నుంచి శిక్షణ

- పరిపాలన, లే అవుట్ అనుమతుల నిబంధనలు తదితర అంశాలపై శిక్షణ
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 56 కేంద్రాల్లో శిక్షణా తరగతులు

సాక్షి, అమరావతి: గ్రామాల్లో కొత్తగా లే అవుట్ల ఏర్పాటుకు అమలులో ఉన్న నిబంధనలతో పాటు పరిపాలనకు సంబంధించిన మొత్తం ఆరు అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం నుంచి శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం 26 జిల్లాల పరిధిలో 56 కేంద్రాలను ఏర్పాటు చేశారు. విడతల వారీగా మొత్తం 12,500 మందికి పైగా గ్రేడ్–1 స్థాయి నుంచి గ్రేడ్–5 స్థాయి పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ విషయాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ శిక్షణ సంస్థ డైరెక్టర్ జె.మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో బ్యాచ్‌లో 50 మంది చొప్పున పాల్గొంటారు. పంచాయతీ కార్యదర్శుల సంఖ్యకు అనుగుణంగా ఒక్కో జిల్లాలో రెండు నుంచి ఆరు విడతల్లో ఈ శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతాయి. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాల్లోనూ, పంచాయతీల్లోనూ సాధారణ పరిపాలనకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఒక్కో మండలంలో ఉండే మొత్తం పంచాయతీ కార్యదర్శుల్లో మూడో వంతు మందే ఒక్కో విడత శిక్షణలో పాల్గొంటారు. గ్రామ పంచాయతీల పరిధిలో కొత్త లే అవుట్ల ఏర్పాటు–అమలులో ఉన్న నిబంధనలు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష కార్యక్రమంలో గ్రామ కంఠాల పరిధిలో ఇళ్ల యజమానులకు హక్కు పత్రాల జారీకి సంబంధించిన అంశాలు, క్షేత్రస్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ఉపాధి హామీ పథకం కార్యక్రమాలు, ఉద్యోగుల విధినిర్వహణకు సంబంధించి క్రమశిక్షణ చర్యలు తదితరాలపై ఈ శిక్షణ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. వీటి నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 552 మంది మాస్టర్ ట్రైనర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943